www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 17-3-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 331 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, పాల్గుణమాసం, బహుళపక్షం, తిథిః తదియ రా.7:33 తదుపరి చవితి, నక్షత్రం: చిత్త మ.2:47 తదుపరి స్వాతి, వర్జ్యం: రా.9:06-10:54, అమృతఘడియలు: ఉ.7:34-9:22, దుర్ముహూర్తం: మ.12:47-1:35, మ.3:10-3:58, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:25, సూర్యాస్తమయం: 6:21 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సునీత విలియమ్స్ రాకకు మార్గం సుగమం

ఐఎస్ఎస్‌తో అనుసంధానమైన స్పేస్ ఎక్స్ వ్యోమ నౌక

నలుగురు వ్యోమగాములను తీసుకువెళ్లిన క్రూ డ్రాగన్-10

సునీత, విల్మోర్‌లతో 20న తిరిగి భూమ్మీదకు వచ్చే అవకాశం



ఐఎస్ఎస్‌లో సునీత విలియమ్స్, ఇతర వ్యోమగాములు

9



ప్రొద్దుటూరు నుంచి ఆర్టీపీపీ మార్గంలో పెన్నానదిపై హైలెవల్ వంతెన పనులు చేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి గ్రాండ్ రిపోర్ట్

పురోగతిలో హైలెవెల్ బ్రిడ్జి

వైసీపీ ప్రభుత్వంలో కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి ఆర్టీపీపీ మార్గంలో పెన్నానదిపై రూ.52 కోట్లతో హైలెవెల్ వంతెన పనులు మంజూరయ్యాయి. రూ.14 కోట్ల మేర పనులు చేసినా పైసా కూడా నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.14 కోట్ల బిల్లులు కాంట్రాక్టరుకు చెల్లించింది. దీంతో పెన్నానదిపై హైలెవెల్ వంతెన పనులు వేగంగా జరుగుతున్నాయి. జూలై నాటికి బ్రిడ్జి పనులు పూర్తవుతాయని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

అభివృద్ధికి మళ్లీ మోక్షం!

జగన్ ఏలుబడిలో ఆగిన ఎన్నో పనులు ఇప్పుడు పట్టాలపైకి

పునాదులు, గోడలకే పరిమితమైన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు... అర్ధంతరంగా ఆగిపోయిన రహదారుల పనులు... అసంపూర్తిగా వదిలేసిన కాలువలు, వంతెన నిర్మాణాలు... ఇలా వైసీపీ విధ్వంసక పాలనలో నిలిచిపోయిన ఎన్నో అభివృద్ధి పనులకు మళ్లీ మోక్షం కలుగుతోంది. గత జగన్ సర్కారు అడ్డగోలు అప్పులు, లాకట్టులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చినా... కూటమి ప్రభుత్వం మళ్లీ వాటిని పట్టాలెక్కిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమై వైసీపీ సర్కారు ఆపేసిన పనులు... వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి బిల్లులు ఇవ్వకపోవడంతో ఆగిపోయిన పనులు... ఎన్నింటినో కూటమి ప్రభుత్వం మళ్లీ చేపట్టింది. కొన్ని ప్రారంభోత్సవ దశకు చేరుకోగా, మరికొన్ని చురుగ్గా సాగుతున్నాయి. అయినా ఇంకా చాలా పనులు చేయాల్సి ఉంది. నిధుల కోసం అధికారులు ఎదురు చేస్తున్నారు. గత జగన్ ప్రభుత్వంలో ఆగిపోయిన పలు అభివృద్ధి పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.. 11లో

నిధుల కొరత ఉన్నా కూటమి ప్రభుత్వం చొరవ

రోడ్లు, భవనాలు, కాలువలు వంతెనల పనులు చకచకా

పెండింగ్ బిల్లులూ చెల్లింపు

ప్రారంభించని పనులూ పూర్తి చేయాలని స్థానికుల ఎదురు చూపులు

వేగంగా తమ్మిలేరు పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఏలూరు జిల్లాలోని తమ్మిలేరు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు.. కూటమి ప్రభుత్వం వచ్చాక శరవేగంగా జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో రూ.16 కోట్లు జైకా నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించే సమయానికి 2019 ఎన్నికల కోడ్ రావటంతో బ్రేక్ పడింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎడమ కాలువలో కేవలం రూ.1.64 కోట్ల పనులు జరిగాయి. బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మంత్రి పార్థసారథి చొరవతో వర్షాకాలం నాటికి అధిక శాతం పనులు పూర్తిచేయటానికి కృషి చేస్తున్నారు.



తమ్మిలేరు ప్రాజెక్టు రైట్ కెనాల్‌లో జరుగుతున్న ప్రొటెక్షన్ వాల్ పనులు

మేం పనికిరామా?

పోస్టింగ్‌ల్లో వివక్షపై 'ప్రమోటీ'ల ఆవేదన



కీలక బాధ్యతలన్నీ ఆర్ఆర్ కేడర్ ఐఏఎస్‌లకేనా?

రాష్ట్ర సర్వీసుల నుంచి ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన అధికారులకు అన్యాయం

కార్పొరేషన్లు, పనిలేని విభాగాలకా?

కలెక్టర్, జేసీ పోస్టుల భర్తీలోనూ చిన్నచూపు

ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక్కరూ లేరు

గగ్గోలు పెడుతున్న ప్రమోటీ ఐఏఎస్‌లు

వేర్వేరుగా కొందరు అధికారుల భేటీలు.. చర్చ


సీఎంను కలిసి విన్నవించాలని ప్రయత్నాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారుల్లో దాదాపు 70 శాతం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నేరుగా ఎంపికైన వారుంటే.. మరో 30 శాతం అధికారులు ప్రమోటీ ఐఏఎస్‌లు. ప్రమోటీలు అంటే.. రాష్ట్ర సర్వీసుల నుంచి ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన వారు. ఫైళ్లను పరిష్కరించడం, క్షేత్రస్థాయిలో ప్రజలకు దగ్గరగా పనిచేసిన అనుభవం వారికి బాగా ఉంటుంది. పనితీరు, సమర్థత ఆధారంగా ఐఏఎస్‌లుగా వారికి పదోన్నతి కల్పిస్తారు. అయితే పోస్టింగ్‌ల విషయంలో తమను చిన్నచూపు చూస్తున్నారని ప్రమోటీ ఐఏఎస్‌లు ఆవేదన చెందుతున్నారు. గత ఎనిమిది నెలలుగా ఇచ్చిన పోస్టింగ్‌ల్లో తమ కేడర్‌లో ఒకరిద్దరికి మినహా ఇతరులకు చెప్పుకోదగ్గ పోస్టింగ్‌లు రాలేదని, కీలకమైన పోస్టింగ్‌ల్లో ఏమాత్రం ప్రాధాన్యం లేకుండా పోయిందని తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో అందరూ ఆర్ఆర్ బ్యాచ్ (డైరెక్ట్) ఐఏఎస్‌లు ఉండటంతో తమను పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇదే అంశంపై ఇటీవల ప్రమోటీ ఐఏఎస్ అధికారులు కొందరు విడివిడిగా సమావేశమై చర్చించారు. ప్రభుత్వాధినేత అయిన

మిగతా 12వ పేజీలో...

ఫ్యాటీ లివర్‌ను తేలిగ్గా తీసుకోవద్దు



12

నిర్లక్ష్యం చేస్తే కాలేయ క్యాన్సర్ ముప్పు.. బీపీ, షుగర్, హృద్రోగాలకూ దారితీస్తుంది

శారీరక శ్రమ లేకపోవడం, ప్రాసెస్డ్ ఆహారం, జన్యుకారణాలతోనూ వచ్చే ప్రమాదం

పెద్దగా ఖర్చు లేకుండా ఏఐ ద్వారా దీన్ని గుర్తించే విధానాన్ని మేం అభివృద్ధి చేశాం

పదేళ్ల తర్వాత వచ్చే ఆరోగ్య సమస్యలనూ జన్యు పరీక్ష ద్వారా గుర్తించే పరిజ్ఞానం

సెల్ డొనేషన్, జన్యు మార్పిడి జంతువులతో సులువు కానున్న అవయవ మార్పిడి

రక్తపోటు, మధుమేహం, కుంగుబాటు వంటివాటికి మలం క్యాప్సూల్స్‌తో వైద్యం

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి



ఆక్రమించిన భూమి మధ్యలో సీసీ రోడ్డు నిర్మించుకున్న దృశ్యం

రామచంద్రా.. ఏమిటీ అరాచకం?

పెద్దిరెడ్డి ఆక్రమణలో రూ. 100 కోట్ల బుగ్గ మఠం భూములు

తిరుపతిలో ఇంటి పక్కనే 3.88 ఎకరాలు స్వాహా.. అందులోనే కార్యాలయం, వాహనాల పార్కింగ్.. భూములకు కంచె.. దర్జాగా మధ్యలో సీసీ రోడ్డు 9

సర్వే కూడా చేయలేని స్థితిలో అధికారులు.. అధికారం పోయినా పవర్ తగ్గని పెద్దిరెడ్డి

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 'భూదాహం' అంతా ఇంతా కాదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆయన చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. గత జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లూ సొంత నియోజకవర్గం పుంగనూరులోనే కాదు, తిరుపతిలోనూ ఆయన హవా జోరుగా సాగింది. తిరుపతిలో తన నివాసం పక్కనే ఉన్న బుగ్గ మఠానికి చెందిన భూములను గతంలో ఆయన ఆక్రమించారు. వంద కోట్ల రూపాయలకు పైగా విలువైన భూములు ఇప్పటికీ ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. విశేషం ఏమిటంటే.. అధికారం పోయినా కూడా ఆయన నీడ తాకడానికి కూడా అధికారులు భయపడుతున్నారు. కనీసం సర్వే చేసేందుకు కూడా ధైర్యం చేయడం లేదు.

రేపు ఢిల్లీకి చంద్రబాబు

అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీని ఆహ్వానించనున్న సీఎం

పలువురు కేంద్ర మంత్రులతోనూ భేటీ 9

అమరావతికి మరో రూ.11వేల కోట్లు!

రుణం మంజూరుపై సీఆర్డీఏతో హడ్కో ఒప్పందం 12

త్వరలో మరో జర్మన్ బ్యాంకు నుంచి 5 వేల కోట్లు

మొత్తం 16 వేల కోట్లతో మలివిడత పనులకు శ్రీకారం

ఇప్పటికే రూ.40 వేల కోట్ల పనులకు టెండర్లు ఖరారు

అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

2026 మార్చి 16కి పూర్తి

మ్యూజియంగా శ్రీరాములు నివాసం

రాజధానిలోనే స్మారక కేంద్రం కూడా 3

పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో సీఎం



12

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్ చూపిస్తే పరీక్షా కేంద్రాలకు ఉచిత ప్రయాణం

ఒత్తిడికి గురికాకుండా రాయండి

విద్యార్థులకు సీఎం ఆల్ ది బెస్ట్

దస్తగిరిని ముక్కలుగా నరికేస్తాం

వివేకా కేసులో సాక్షులందరూ చచ్చిపోయారు

అవినాశ్ రెడ్డి, జగన్‌లు మీ అంతుచూస్తారు 3

అప్రూవర్ దస్తగిరి భార్య షబానాకు బెదిరింపు

ఇంట్లోకి చొరబడి వైసీపీ మహిళా కార్యకర్తల దాడి

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు: షబానా



పాడ్‌క్యాస్టర్, కంప్యూటర్ శాస్త్రవేత్త లెక్స్ ఫ్రీడ్‌మన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

సద్విమర్శ.. ప్రజాస్వామ్య ఆత్మ!

ఆరోపణకు, విమర్శకు చాలా తేడా ఉంది

ఆర్ఎస్ఎస్.. జీవిత పరమార్థం తెలిపింది

ఎవరికైనా చావు తప్పదు.. భయపడకూడదు

గుజరాత్ అల్లర్ల విషయంలో నాపై దుష్ప్రచారం

కోర్టులు విచారణ జరిపి విముక్తి కల్పించాయి

ట్రంప్‌తో అనుబంధం.. మా ఇద్దరికీ దేశమే ఫస్ట్

'లెక్స్ ఫ్రీడ్‌మన్' షోలో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, మార్చి 16: నిర్మాణాత్మక సద్విమర్శ ప్రజాస్వామ్యానికి ఆత్మవంటిదని ప్రధాని మోదీ అన్నారు. సద్విమర్శను తాను స్వాగతిస్తానని చెప్పారు. అయితే ఆరోపణలకు, విమర్శలకు చాలా తేడా ఉందన్నారు. తప్పుడు ఆరోపణలు ప్రజాస్వామ్యానికి హానిచేస్తాయని చెప్పారు. ఆదివారం అమెరికన్

మిగతా 9వ పేజీలో...

వందల కొద్దీ బ్రాంచిలు లేవు, వేల సంఖ్యలో విద్యార్థులు లేరు, 8th 9th 10th క్లాసుల నుంచే ఫౌండేషన్ కోర్సులు లేవు. విజయవాడలో ఒకే ఒక్క బ్రాంచితో, దేశ వ్యాప్తంగా ప్రముఖ మెడికల్ కాలేజీల్లో, 2021లో స్థాపించినప్పటి నుండి కేవలం **4** ఏళ్ళలో **4,366** ఫ్రీ మెడికల్ సీట్లు సాధించింది

10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్ ది బెస్ట్



శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ

100% NCERT అనుగుణంగా అద్భుతమైన శిక్షణ ఇచ్చి, సబ్జెక్టు క్షుణ్ణంగా నేర్పించి, NEET పరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్ది, అద్భుత ఫలితాలు సాధించడం శ్రీ గోసలైట్స్ కి మాత్రమే సాధ్యం.

భారత దేశంలోని AIIMS, JIPMER వంటి ప్రతిష్ఠాత్మకమైన మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించాలనే ఆశయం ఉన్న 10వ తరగతి విద్యార్థుల కోసం ఛాలెంజింగ్ ప్రోగ్రాం **GOAL-100**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు అనుగుణంగా, జూనియర్ ఇంటర్ లో కొత్తగా **MBiPC** గ్రూప్ ప్రారంభిస్తున్నాం, బాలురకు 1 సెక్షన్, బాలికలకు 1 సెక్షన్.

Sri Gosalites GoAL-100

GOsalites ALpha Batch

AIIMS, JIPMER లాంటి ప్రతిష్ఠాత్మక మెడికల్ కాలేజీల్లో సీటు సాధించాలంటే NEETలో ఆల్ ఇండియా 100 లోపు ర్యాంకు రావాలి. టాప్ 100 లోపు ర్యాంకులు సాధించడానికై శ్రీ గోసలైట్స్ ప్రారంభిస్తున్న ప్రోగ్రాం **GoAL-100.**

ఫీజు రాయితీ వివరాలు

Level-2 Rank	Concession
1-10	90%
11-20	80%
21-30	70%
31-40	60%
41-50	50%
51-75	40%
76-100	30%

ఎంపిక విధానం

- ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మాత్రమే
- ఈ టెస్ట్ ద్వారా కేవలం 100 మంది విద్యార్థులను మాత్రమే ఎంపిక చేస్తారు.
- **Level-1** 10వ తరగతి CBSE/ICSE విద్యార్థులు 22-03-2025 నుంచి 30-03-2025 తేదీల మధ్య ఏ రోజైన, 10వ తరగతి స్టేట్ బోర్డు విద్యార్థులు 05-04-2025 నుండి 13-04-2025 తేదీల మధ్య ఏ రోజైన శ్రీ గోసలైట్స్ గంగూరు గర్ల్స్ క్యాంపస్, విజయవాడ నందు పరీక్ష రాయవలసి ఉంటుంది.
- **Level-2** Level-1 క్వాలిఫై అయిన విద్యార్థులు అదే రోజు Level-2 పరీక్ష రాయవలసి ఉంటుంది. ఈ పరీక్షలో మొదటి 100 మందిని ఈ బ్యాచ్‌కి ఎంపిక చేయడం జరుగుతుంది.
- EXAM SYLLABUS మరియు EXAM PATTERN కొరకు మా వెబ్‌సైట్ చూడగలరు.

Scan to Register OR Message 'Hi' on Whatsapp 81878 71115

Sri Gosalites GIFT

(Gosalites Intermediate Foundation Tuning Programme)

10వ తరగతి పూర్తి అయిన తరువాత డాక్టర్ అవ్వాలనే విద్యార్థుల కోసం Sri Gosalites 4 వారాల ఉచిత ఆన్‌లైన్ **GIFT Programme (Gosalites Intermediate Foundation Tuning Programme)** సిద్ధం చేసింది. డాక్టర్ అవ్వాలనే మీ లక్ష్యానికి ఇక్కడ తొలి అడుగు వేస్తే, మీ విజయం ఖాయం.

ప్రోగ్రామ్ ప్రారంభించు తేదీలు

CBSE / ICSE విద్యార్థులకు 24-03-2025 నుండి

స్టేట్ బోర్డు విద్యార్థులకు 07-04-2025 నుండి

GIFT Programme ఎందుకు?

- 10 వ తరగతి వరకు సబ్జెక్టివ్ ఎగ్జామ్స్ మాత్రమే జరుగుతాయి, అందువలన విద్యార్థులు బట్టీకి అలవాటు పడి ఉంటారు.
- కానీ, నీట్ పరీక్షకు ఆబ్జెక్టివ్ విధానం ఉంటుంది. బేసిక్స్ మీద గ్రిప్, కాన్సెప్ట్స్‌పై అవగాహన, అప్లికేషన్ ఓరియెంటేషన్ కావాలి, దీనికి ప్రత్యేక శిక్షణ అవసరం.
- ఎన్నో సంవత్సరాల అనుభవం నుండి శ్రీ గోసలైట్స్ టీమ్, టెన్త్ విధానానికి మరియు నీట్ ఎగ్జామ్‌కు అనుసంధానం చేయిస్తూ బేసిక్స్ మీద పూర్తిగా గ్రిప్ సాధించడానికి విద్యార్థులందరికీ GIFT Programme అందిస్తుంది.
- మీరు ఎక్కడ చదువుదామనుకున్నా, డాక్టర్ అవ్వాలనే మీ ఉన్నత ఆశయానికి మద్దతుగా మావంతు కృషిగా నీట్ పరీక్షకు మీరు ఈజీగా సన్నద్ధం కావడానికి GIFT Programme అందిస్తున్నాము.

Scan to Register OR Message 'Hi' on Whatsapp 81878 71116

NEET-2024లో సంచలనం

నీట్ ఫలితాల్లో చరిత్ర సృష్టించినా, చరిత్ర తిరగరాసినా, అది కేవలం శ్రీ గోసలైట్స్ కే సొంతం.

K SANJOG NAIDU
10TH SCHOOL: ST JOSEPH HIGH SCHOOL SRIKAKULAM
Direct Inter
706
H.T. No. 1205260177
AIIMS, Jodhpur

నీట్ పరీక్ష ప్రారంభించిన తరువాత, లాంగ్ టర్మ్ నుండి తెలుగు రాష్ట్రాల్లో వేరెవ్వరికీ సాధ్యపడని విధంగా, మొట్టమొదటి సారిగా 700 పైగా మార్కులు సాధించి, చరిత్ర సృష్టించిన శ్రీ గోసలైట్స్ విద్యార్థులు.

Long Term

S MALLIKARJUNA RAO – PREVIOUS INTER COLLEGE: LAKSHYA JR COLLEGE - GUNTUR – NEET 2023 MARKS: 450 – **701** – H.T. No. 1205030913 – JIPMER, Puducherry

G PUJITHA – PREVIOUS INTER COLLEGE: SRI CHAITANYA - GOSALA – NEET 2023 MARKS: 522 – **700** – H.T. No. 1205030301 – AIIMS, Mangalagiri

N ROHITH SHIVA SAI – PREVIOUS INTER COLLEGE: SAINIK SCHOOL - KERALA – NEET 2023 MARKS: 348 – **700** – H.T. No. 1205220073 – AIIMS, Mangalagiri

Direct Inter

టెక్నో స్కూల్స్ నుండి కాకుండా, ఒలింపియాడ్ స్కూల్స్ నుండి కాకుండా, కేవలం సాధారణ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులను సైతం నీట్-2024లో డైరెక్ట్ ఇంటర్ నుండే ఆలిండియా బెస్ట్ మార్కులు సాధించేలా తీర్చిదిద్దామని చెప్పడానికి మా విద్యార్థులే సాక్ష్యం.

GOMEDHIKAM NAYAN – 10TH SCHOOL: BHARATHI VIDYA BHAVAN TIRUPATI – **700** – H.T. No. 1205170159 – AIIMS, Mangalagiri

M MAYUKH SARMA – 10TH SCHOOL: RIDGE SCHOOL, KURNOOL – **700** – H.T. No. 1205120334 – AIIMS, Mangalagiri

GADDALA BENHUR – 10TH SCHOOL: RIDGE SCHOOL, KURNOOL – **696** – H.T. No. 1205160202 – JIPMER, Puducherry

SARABU SRI NIKHIL – 10TH SCHOOL: MONTESORI INDUS SCHOOL KURNOOL – **695** – H.T. No. 1205050445 – AIIMS, Bibinagar

NAMU AASRITH – 10TH SCHOOL: NEXTGEN INTERNATIONAL SCHOOL ONGOLE – **695** – H.T. No. 1205030839 – Gandhi Medical College, Hyderabad

NEET-2024 ఫలితాల్లో 640 పైగా మార్కులు సాధించిన శ్రీ గోసలైట్స్ విద్యార్థులు 160 మంది

అమ్మలాంటి ప్రేమ.. నాన్నలాంటి బాధ్యత...

కొత్త తరానికి అనుగుణంగా సరికొత్తగా మార్పులు చేసి స్థాపించిన శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ, నీట్ కోచింగులో కొత్త కెరటంగా, నీట్ ఫలితాల్లో సంచలనంగా మారి, చరిత్ర సృష్టిస్తూ, ప్రతి ఏడాది చరిత్రను తిరగరాస్తుంది. ప్రతి క్లాస్ రూమును డిజిటలైజ్ చేసి, స్మార్ట్ బోర్డు ద్వారా బోధన కొనసాగిస్తూ, ఇరు తెలుగు రాష్ట్రాల్లో నూరు శాతం డిజిటలైజ్ చెయ్యబడిన ఏకైక విద్యాసంస్థగా పేరుగాంచింది.

సాధారణ స్కూల్స్ లో చదివి, డాక్టర్ కావాలనే కోరికతో మా వద్ద డైరెక్ట్ ఇంటర్ లో చేరిన సామాన్య విద్యార్థుల సంకల్పానికి, మా సమర్థతను జోడించి, నీట్ పరీక్షలకు అనుగుణంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో అద్భుతమైన శిక్షణ అందించి, అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చెయ్యడం మాకెంతో గర్వకారణం. ప్రారంభించిన తొలి ఏడాది NEET-21లో 724, NEET-22లో 1013, NEET-23లో 1,237, NEET-24లో 1,392 మంది ఫ్రీ మెడికల్ సీట్లు సాధించారు.

గత నాలుగేళ్లుగా మా వెన్నంటి నిలబడి, అడుగడుగునా సహకరించిన మా ప్రియతమ విద్యార్థులకు, ముఖ్యంగా తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞతాభివందనలు.

మీరే మా నమ్మకం, మీరే మా బలం, ముమ్మాటికీ ఇది మీ సంస్థ.

10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేస్తూ...
మీ నరేంద్ర బాబు, చైర్మన్



V. Narendra Babu, Chairman
Smt. V. Usha, Director

NEET-2024లో అత్యుత్తమ ర్యాంకులతో, దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించిన 1392 మంది శ్రీగోసలైట్స్ విద్యార్థులు.

NATIONAL MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	AIIMS, Jodhpur	1
2	AIIMS, Mangalagiri	8
3	AIIMS, Bibi Nagar	3
4	JIPMER Puducherry	4
5	JIPMER KARAIKAL	3
	Total	19

OTHER STATES - MAIN COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	Christian Medical College, Vellore	2
2	Bangalore Medical College, Bengaluru	1
3	Madras Medical College, Chennai	1
4	Stanley Medical College, Chennai	4
5	Mysore Medical College, Mysuru	2
6	Kilpauk Medical College, Chennai	2
	Total	12

ANDHRA PRADESH MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	KMCK-Kurnool Medical College, Kurnool	64
2	SVMC-Sri Venkateswara Medical College, Tirupati	53
3	GMCA-Government Medical College, Anantapur	44
4	ACSR-ACSR Government Medical College, Nellore	40
5	GMCG-Guntur Medical College, Guntur	40
6	GMCK-RIIMS, KADAPA	39
7	PADT-Sri Padmavathi Medical College for Women (SVIMS), Tirupati	37
8	NARN-Narayana Medical College, Nellore	54
9	KONA-Konaseema Institute of Medical Sciences, Amalapuram	46
10	RMCK-Rangaraya Medical College, Kakinada	29
11	AMCV-Andhra Medical College, Visakhapatnam	28
12	GMCS-RIIMS, Srikakulam	26
13	VMCK-Viswabharathi Medical College&General Hospital, Kurnool	57
14	GSLR-GSL Medical College & General Hospital, Rajahmundry	38
15	SMCV-Siddhartha Medical College, Vijayawada	22
16	NRIM-Nrim Medical College, Guntur	37
17	GMCO-RIIMS, Ongole	20
18	SRMC-Santhiram Medical College, Nandyal	41
19	GVPT-Gayatri Vidya Parishad Medical College, Vizag	30
20	PESK-P.E.S. Institute of Medical Sciences and Research, Kuppam	33
21	GMCN-Government Medical College, Nandyal	44
22	BMCT-Sri Balaji Medical College & Hospital, Tirupati	30
23	GEMS-Great Eastern Medical School & Hospital, Srikakulam	32
24	FIMS-Fathima Institute of Medical Sciences, Kadapa	25
25	APLC-Apollo Institute of Medical Sciences & Research, Chittoor	29
26	NIMR-Nimra Institute of Medical Sciences, Ibrahimpatnam	18
27	ASRA-Alluri Sitarama Raju Academy of Medical Sciences, Eluru	47
28	PSIM-Dr.Pinnamaneni Siddhartha Institute of Medical Sciences & Research Foundation, Gannavaram	28
29	MAHA-Maharajah's Institute of Medical Sciences, Vizianagaram	27
30	NRVP-NRI Medical College, Vizag	20
31	GMCM-Government Medical College, Machilipatnam	31
32	GMCE-Government Medical College, Eluru	26
33	GMCV-Government Medical College, Vijayanagaram	16
34	GMCR-Government Medical College, Rajahmundry	21
35	KATR-Katuri Medical College & Hospital, Guntur	16
36	GMCP-Government Medical College, Peeleru	4
	Total	1192

TELANGANA MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	GAND-Gandhi Medical College and Hospital, Secunderabad	2
2	OMCH-Osmania Medical College, Hyderabad	2
3	KKTI-KMC Warangal-Kakatiya Medical College	5
4	MAMS-Mamata Academy of MED SCI, Bachupally	8
5	GSGR - Government Medical College Sangareddy	1
6	SGMC-Government Medical College, Siddipet	2
7	GMSR-Government Medical College, Suryapet	3
8	GMNL-GMNL-Government Medical College, Nalgonda	4
9	RADL-RIIMS, Adilabad	1
10	DCMS-Deccan College of Medical Sciences College in Hyderabad, Telangana	1
11	BASK-Bhaskar Medical College, Moinabad	1
12	GWNP-Government Medical College, Wanaparthy	3
13	SIMS-Singareni Institute of Medical Sciences, Telangana	8
14	RVMC-RVM Institute of Medical Sciences and Research Center, Muluru	5
15	GJTL-Government Medical College, Jagtial	2
16	GMHR-GOVT Medical College, Maheshwaram	2
17	AIMD-Arundathi Institute of Medical Sciences, Dundigal	1
18	MMTA-Mamata Medical College, Khammam	5
19	GVKB-Govt Medical College, Vikarabad	2
20	SVSM-S.V.S. Medical College, Mahabubnagar	1
21	GMHB-GOVT Medical College, Mahabubabad	4
22	GJGN-GOVT Medical College, Jangaon	1
23	GMBK-Govt Medical College, Bhadradri, Kothagudem	7
24	PRTM-Prathima Institute of Medical Sciences, Karimnagar	6
25	PRIW-Pratima Relief Institute of Medical Sciences, Warangal	4
26	GNRM-Govt Medical College, Nirmal	1
27	GNGK-Govt Medical College, Nagarkurnool	1
28	MAHE-Maheshwara Medical College, Patancheru, Medak	3
29	FCIM - Father Colombo Institute of Medical Sciences, Warangal	5
30	GJBP-Govt Medical College, Jayashankar Bhupalpally	2
31	GNRN-Govt Medical College, Narayanpet	1
32	GASF - Govt Medical College, Kumuram	1
33	MNRS-MNR Medical College, Sangareddy	3
34	ESIM-ESI Medical College, Sanathnagar, Hyd	3
35	GQTB-Govt Medical College, Quthbullapur	1
36	KMHD-Kamineni Academy of Medical Sci And Research, Hyd	1
37	KMNI-Kamineni Institute of Medical Sciences., Narketpally	3
39	MEDI-Medicity Institute of Medical Sciences	6
40	NIMG-Neelima Institute of Medical Sciences, Ghatkesar	1
41	NOVA-Nova Institute of Medical Sciecnes, Hayathnagar,	2
42	SURB-Surabhi Institute of Medical Sciences, Siddipet	2
43	TRRM-TRR Institute of Medical Sciences, Inole, Patancheru	2
44	Mallareddy Institute of Medical Sciences, Hyderabad	5
45	APLO-Apollo Institute of Medical Sciences and Research, Hyd	1
46	CAN-Cananda Rao Institute of Medical Sciences, Karimnagar	3
47	CMR-CMR Institute of Medical Sciences, Kandalkoya	1
	Total	129

KARNATAKA MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	KRISHNAGIRI MC	2
2	S Niranjanappa MC	1
3	Raichur IMS	1
4	YIMS Yadgiri	1
5	SHIMOGA I M S., SHIMOGA	1
6	Jawahar Lal Nehru MC	1
7	K.S Hegde MC	3
8	Raja Rajeswari MC	1
9	SDU MC	1
	Total	12

TAMILNADU MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	THOOTHUKU DI MC,THOOTHUKUDI	1
2	ESIC, Chennai	1
3	NAGAPATTINAM MC	1
4	Tagore MC	1
5	THIRUVALLUR MC	2
6	GOVT DINDIGUL MC, TAMILNADU	1
7	VELS MC	4
8	Shri Sathya Sai MC	3
9	SRM MC	3
10	VMKV MC	2
11	Mahatma Gandhi MC	2
12	Sri Lakshmi Narayana IMC	2
13	Chettinad MC	1
14	Meenakshi MC	1
15	Saveetha MC	1
16	Sri Ramachandra MC	1
17	Aarupadai Veedu MC	1
18	Vinayaka Missions MC	1
	TOTAL	29



Ganguru - Girls Campus (Long Term)



Penamaluru - Girls Campus (Senior Inter)



Penamaluru - Girls Campus (Junior Inter)



Penamaluru - Boys Campus (Inter Goal-100)



Poranki - Boys Campus (Long Term)



Poranki - Boys Campus (Inter)



Edupugallu - Girls Campus (Inter Goal-100)

Scan & Visit our Website

Sri Gosalites Medical Academy

...brand of future medicos

Saiganesh Towers, Ganguru, Penamaluru (M), VIJAYAWADA - 521 139
M: 98 582 18888, 98 583 18888, 98 584 18888
E: official@gosalites.com, gosalitesvja@gmail.com
www.gosalites.com /gosalites



మీడియాతో మాట్లాడుతున్న నమ్రత, పక్కన ఆంధ్ర హాస్పిటల్స్ అధినేత పీవీ రమణమూర్తి

బిడ్డలకు తల్లిపాలే శ్రేయస్కరం

» మహేశ్‌బాబు సతీమణి నమ్రత

» ఆంధ్రా ఆస్పత్రిలో మదర్స్ మిల్క్ బ్యాంక్ ప్రారంభం

విజయవాడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని సినీనటుడు మహేశ్‌బాబు సతీమణి నమ్రత అన్నారు. విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్స్‌లో ఆంధ్రా ఆస్పత్రి, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సంయుక్తంగా రూ.37.24 కోట్లతో ఏర్పాటు చేసిన మదర్స్ మిల్క్ బ్యాంకును ఆమె ఆదివారం ప్రారంభించారు. అనంతరం నమ్రత మాట్లాడుతూ.. తల్లి పాలు తక్కువ ఉన్న వారికి, నెలలు నిండకుండా, బరువు తక్కువగా పుట్టిన వారికి ఈ మిల్క్‌బ్యాంకు ద్వారా పాలు అందిస్తారని తెలిపారు. పాలు ఎక్కువగా ఉన్న దాతల నుంచి సేకరించి అనేక కారణాల వల్ల తల్లిపాలు అందని నవజాత శిశువులకు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఏటా 7,200 మంది నవజాత శిశువులకు ఈ బ్యాంకు ద్వారా పాలు అందిస్తారన్నారు. మదర్స్ మిల్క్‌బ్యాంకును ఏర్పాటు చేసిన రోటరీ, ఆంధ్ర హాస్పిటల్స్‌కు అభినందనలు తెలిపారు. ఎంతోమంది నవజాత శిశువులకు తల్లిపాలు అందించడం ద్వారా రాబోయే రోజుల్లో శిశువులకు అనారోగ్య సమస్యలు దూరంచేసే ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని చెప్పారు. మహేశ్‌బాబు ఫౌండేషన్ ద్వారా గర్భాశయ కేన్సర్ నివారణకు వ్యాక్సిన్ వేయిస్తున్నామని ఆమె తెలిపారు. ఏటా 1,500 మందికి ఈ వ్యాక్సిన్ వేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం మహేశ్‌బాబు ఫౌండేషన్ సహకారంతో గుండె శస్త్రచికిత్సలు చేయించుకున్న పిల్లలతో ఆమె మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్ర హాస్పిటల్స్ అధినేత పీవీ రమణమూర్తి, మేనేజింగ్ డైరెక్టర్ పీవీ రామారావు, డాక్టర్ కె.విక్రమ్, కార్డియాక్ టీమ్ పాల్గొన్నారు.

తిరుమలలో ఏకసభ్య కమిషన్

» కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన

» రద్దీ వేళల్లో క్యూలైన్లలో ఇబ్బందులపై ఆరా

» తొక్కిసలాటపై విచారణకు నేడు కలెక్టర్

» రేపు టీటీడీ ఈవో, ఇతర అధికారులు..

తిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణ మూర్తి తిరుమలలోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన శనివారం తిరుమలలోని క్యూలైన్లను, కంపార్టుమెంట్లను పరిశీలించారు. తిరిగి ఆదివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు దర్శనానికి ఎలా వెళ్తున్నారు? తిరిగి ఎలా వస్తున్నారు? రద్దీ అధికంగా ఉన్న సమయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి? తదితరాలను పరిశీలన చేయడంతోపాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, లైజన్ ఆఫీసర్ రూప్‌చంద్‌తో కలిసి యాత్రికుల వసతి సముదాయం-4(పీఏసీ)లోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను వీడియోవాల్‌పై ఉన్న స్క్రీన్ల ద్వారా వీక్షించారు. తిరుమలలో మొత్తం ఎన్ని సీసీ కెమెరాలు ఉన్నాయి? ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు? వాటి ద్వారా ఎలాంటి పరిశీలనలు చేస్తున్నారు? బ్యాకప్ ఎన్ని రోజులు ఉంటుందనే విషయాలను టీటీడీ విజిలెన్స్, పోలీసు అధికారులు ఆయనకు వివరించారు. సోమవారం ఉదయం తిరుమల నుంచి తిరుపతికి చేరుకుంటారు. వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాటపై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను విచారించనున్నారు. ఈనెల 18వ తేదీన టీటీడీ ఈవోను, ఇతర అధికారులను విచారించనున్నారు



రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి, నివాళి అర్పిస్తున్న నాయకులు

హంతకులకు శిక్ష తప్పదు

» టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబానికి సీఎం భరోసా

» ఆ తర్వాతే అంత్యక్రియలకు కదిలిన కుటుంబసభ్యులు



రామకృష్ణ (ఫైల్)

పుంగనూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్త చేతిలో దారుణ హత్యకు గురైన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కృష్ణాపురానికి చెందిన రామకృష్ణ అంత్యక్రియలు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చిన తర్వాత ఆదివారం సాయంత్రం జరిగాయి. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా మృతదేహానికి టీడీపీ జెండా, పూలమాల వేయడానికి రాగా.. తమకు న్యాయం జరిగేవరకు అంత్యక్రియలు చేయబోమని, అవసరమైతే అమరావతికి తీసుకెళతామని కుటుంబీకులు తేల్చిచెప్పారు. తమ తండ్రిని వేటకొడవలితో నరికి చంపిన వైసీపీ కార్యకర్త వెంకట్రమణ, మరో నలుగురికి వెంటనే ఉరిశిక్ష వేయించాలని, లేకుంటే వారిని తమకు అప్పగించాలని భీష్మించారు. దీంతో సీఎం చంద్రబాబుకు చల్లా ఫోన్‌చేసి విషయం తెలిపారు. సీఎం వెంటనే రామకృష్ణ కుమారులతో మాట్లాడి, వారిని ఓదార్చారు. 'అక్కడి విషయాలన్నీ నాకు తెలుసు.. మీరు ధైర్యంగా ఉండండి. హంతకులను అరెస్టు చేయించడానికి పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడతాను. మీకు టీడీపీ అండగా ఉంటుంది. త్వరలోనే మీ ఇంటికి మంత్రులు, పార్టీ పెద్దలు వచ్చి మాట్లాడతారు' అని చంద్రబాబు వారికి భరోసా కల్పించారు. రామకృష్ణ మృతి బాధాకరమని సంతాపం వ్యక్తం చేసి.. అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు బాధిత కుటుంబీకులతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడారు. హంతకులను వదిలే ప్రసక్తే లేదని, టీడీపీ అండగా ఉంటుందని, న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి చల్లా.. నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు కృష్ణాపురంలోని వారి పొలంలో రామకృష్ణకు కన్నీటి వీడ్కోలు పలికారు.

జగన్ హత్యా రాజకీయాలు మానలేదు: లోకేశ్

'వైసీపీ మూకల దాడిలో మృతిచెందిన రామకృష్ణకు కన్నీటి నివాళి. వైసీపీ రక్తచరిత్రలో టీడీపీ కార్యకర్తను కోల్పోయాం. జనం ఛీ కొట్టినా జగన్ హత్యా రాజకీయాలు మానలేదు. హంతకులకు శిక్ష తప్పదు' అని 'ఎక్స్' వేదికగా మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

» 2026 మార్చి 16కి పూర్తి

» మ్యూజియంగా శ్రీరాములు నివాసం

» రాజధానిలోనే స్మారక కేంద్రం కూడా ఏర్పాటు చేస్తాం

» పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు



అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్ తదితరులు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం 58 రోజులపాటు కఠోర దీక్ష చేపట్టి, ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములు స్మారకంగా 58 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఉండవల్లి నివాసంలో ఆదివారం జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వచ్చే జయంతి నాటికి పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చంద్రబాబు తెలిపారు. అమరావతిలోనే మెమోరియల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా పొట్టి శ్రీరాములు స్వగ్రామమైన పడమటిపల్లిలోని నివాసాన్ని మ్యూజియంగా రూపుదిద్దుతామని, గ్రామంలో ఆధునిక వసతులతో ఆరోగ్య కేంద్రం, హైస్కూల్ భవనాన్ని నిర్మిస్తామని అన్నారు. గ్రామస్థుల విన్నపం మేరకు బకింగ్ హామ్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జనం కోసం, తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు బతికారని, తెలుగువారి చరిత్ర ఉన్నంత వరకు ఆయన గుర్తుంటారని పేర్కొన్నారు. శ్రీరాములు త్యాగ ఫలితమే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాందీ అని సీఎం అన్నారు. ఏ భాష మాట్లాడేవారిని ఆ భాష వారే పాలించుకునే అవకాశం రావాలని శ్రీరాములు కోరుకున్నారని గుర్తు చేశారు. తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని పోరాడి ఆత్మార్పణ చేశారన్నారు. పొట్టి శ్రీరాములు పేరును నెల్లూరు జిల్లాకు పెట్టింది తామేనని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి నంబర్ 1 రాష్ట్రంగా నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని చంద్రబాబు తెలిపారు. శ్రీరాములు పేరుతో మెమోరియల్ ట్రస్టు కూడా ఏర్పాటు చేయాలని ఆయన అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ రోజుకి 125వ జయంతి వేడుకల్లోకి అడుగుపెట్టామని వచ్చే ఏడాది మార్చి 16 వరకు ప్రతినెలా ఒకటి చొప్పున 12 రకాల కార్యక్రమాలు చేపడతామన్నారు. అప్పటికి 125వ జయంతి ఉత్సవాలు పూర్తవుతాయని చంద్రబాబు అన్నారు.

పవన్‌ని సీఎం చేసేవరకూ నిర్విరామ కృషి

» దుబాయ్‌లో జనసేన నేతల పిలుపు

» గల్ఫ్‌లో ఘనంగా ఆ పార్టీ ఆవిర్భావ ఉత్సవాలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసేవరకూ దేశవిదేశాల్లోని జనసేన కార్యకర్తలు నిర్విరామంగా కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గల్ఫ్ దేశాల్లో జనసేన అవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూఏఈలో జరిగిన సభలో పార్టీ ఇన్‌చార్జి కేసరి త్రిమూర్తులు మాట్లాడారు. ఏపీలో జనసేన అధికారంలో భాగమే కానీ, పూర్తి అధికారం పార్టీది కాదన్న విషయాన్ని మననం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని జనసేన గల్ఫ్ జాతీయ కన్వీనర్ చంద్రశేఖర్ మెగళ్ల పిలుపునిచ్చారు.

దస్తగిరిని ముక్కలుగా నరికేస్తాం

» వివేకా కేసులో సాక్షులందరూ చచ్చిపోయారు

» అవినాశ్ రెడ్డి, జగన్‌లు మీ అంతుచూస్తారు


» అప్రూవర్ దస్తగిరి భార్య షబానాకు బెదిరింపు

పులివెందుల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): "మరో ఏడాదిలో దస్తగిరిని ముక్కలు ముక్కలుగా నరికేస్తాం. దస్తగిరి ఏమైనా సాధించాడా హారతులు పడుతున్నావు." అంటూ వైసీపీ కార్యకర్తలైన ఇరువురు మహిళలు ఖుల్సుం, పర్వీన్‌లు తీవ్రస్థాయిలో బెదిరించారని వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి భార్య షబానా వెల్లడించారు. ఈ ఇద్దరు మహిళలు తనపై దాడి చేసినట్టు చెప్పారు. ఆదివారం రాత్రి పులివెందులలో ఆమె మీడియాతో మాట్లాడారు. తన తండ్రికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో పులివెందుల ఆసుపత్రిలో చికిత్స చేయించినట్టు తెలిపారు. అనంతరం శనివారం రాత్రి తొండూరు మండలంలోని మల్లేల గ్రామానికి తీసుకెళ్లామన్నారు. అక్కడ తన బంధువుల ఇంటి వద్దకు పలకరించేందుకు వెళ్లగా ఖుల్సుం, పర్వీన్ తన బంధువుల ఇంట్లోకి చొరబడి తనపై దాడి చేశారని తెలిపారు. దాడి చేస్తున్న సమయంలో ఆ మహిళలు ఎవరికో ఫోన్ చేసి తనను తిడుతున్న తీరును వారికి వినిపించారన్నారు. "దస్తగిరిని సంవత్సరంలో ముక్కలు ముక్కలుగా నరికేస్తాం. మాజీ సీఎం జగన్, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, మల్లేల వైసీపీ నాయకుడు రవీంద్రనాథరెడ్డి మీ అంతు చూస్తారని బెదిరించారు" అని షబానా చెప్పారు. ఇంతలో దస్తగిరి అక్కడికి రావడంతో ఆయన్ను కూడా తిడుతూ సవాల్ విసిరారన్నారు. దస్తగిరి గన్‌మెన్లు ఇలా గొడవలు పడితే సమస్య అవుతుందని, పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని చెప్పడంతో అక్కడి నుంచి తొండూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చామన్నారు. ఎస్‌ఐ చిన్న పెద్దయ్యకు జరిగిన విషయాన్ని వివరించినప్పుడు.. "ఆడవాళ్లు గొడవపడినప్పుడు సర్దుకుపోవాలి కానీ ఇలా గొడవలు పెద్దవి చేసుకోవడం ఎందుకు" అని చెప్పారన్నారు. దస్తగిరిని చంపేస్తామంటున్నా కూడా మీరు పట్టించుకోరా? అని ఎస్‌ఐని ప్రశ్నించినట్టు తెలిపారు. ఇక్కడ న్యాయం జరగదని భావించి పులివెందుల రూరల్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లి కంప్లైంట్ ఇచ్చామన్నారు. శనివారం సాయంత్రం కంప్లైంట్ ఇచ్చినా ఆదివారం సాయంత్రం వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని షబానా ఆరోపించారు. ఇప్పటికే ఆరుగురిని చంపేశామని, దస్తగిరిని కూడా చంపేస్తామని ఆ మహిళలు బెదిరించారని కన్నీటి పర్యంతమయ్యారు. "వైసీపీ వాళ్లకు కక్ష సాధింపులు ఉంటే నన్ను, నా భర్తను చంపుతారేమో గానీ.. నా పిల్లల జోలికి వస్తే మాత్రం పరిస్థితి వేరుగా ఉంటుంది. ఇప్పటికే ఆరుగురు సాక్షులు చనిపోయినా కేసు బతికే ఉంది. విచారణ సాగుతుంది. ఏదో ఒకరోజు ఈ కేసులో న్యాయం గెలవడం తథ్యం" అని షబానా అన్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం: సీఐ

మల్లేల గ్రామంలో దస్తగిరి భార్య షబానాతో ఇరువురు మహిళలు గొడవపడ్డారని, దీనిపై పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పులివెందుల రూరల్ సీఐ రమణ తెలిపారు. ఈ ఘటనపై షబానా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ ఫిర్యాదును తొండూరు ఎస్‌ఐకి పంపించామన్నారు. విచారించిన అనంతరం ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగిస్తామని సీఐ తెలిపారు.





శ్రీశ్రీ సాహిత్యంపై సదస్సు

'మహాప్రస్థానం' అమృతోత్సవం సందర్భంగా విజయవాడ, ఆంధ్ర లొయోల కళాశాలలో మార్చి 18, 19 తేదీలలో శ్రీశ్రీ సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుంది. మార్చి 18 ఉ.10గంటలకు ముమ్మడి సమావేశ మందిరంలో లొయోల కళాశాల ప్రిన్సిపల్ జి.ఎ.పి కిశోర్ అధ్యక్షతన జరిగే ప్రారంభ సదస్సులో కొలకలూరి ఆశాజ్యోతి ముఖ్య అతిథిగా, మాధురి ఇంగువ విశిష్ట అతిథిగా, శ్రీశ్రీ విశ్వేశ్వర రావు, కోయి కోటేశ్వర రావు గౌరవ అతిథులుగా పాల్గొంటారు. ఈ సదస్సులో 35 మందికి పైగా శ్రీశ్రీ సాహిత్యంపై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు.

కోలా శేఖర్

'వీర నాగు శతకం' ఆవిష్కరణ

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ సిటీ కళాశాల విద్యార్థి చిక్కొండ్ర రవి రచించిన 'వీరనాగు' శతకం ఆవిష్కరణ మార్చి 19 ఉ.10గంటలకు వనపర్తి జిల్లా బుద్ధారం గ్రామంలో ఆర్.డి.ఆర్.యం.యు.పి.యస్ దగ్గర జరుగుతుంది. సభాధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య, ముఖ్య అతిథి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, విశిష్ట అతిథి గోరటి వెంకన్న, ఆవిష్కర్త మదిరె మల్లమ్మ. వివరాలకు: 94927 65358.

నెలపొడుపు

ప్రపంచ కవితాదినోత్సవ సభ

కవి సంధ్య – చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ప్రపంచ కవితా దినోత్సవ సభ మార్చి 23 సా.5గంటల నుంచి కమిటీ హాలు, పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వ విద్యాలయంలో జరుగుతుంది. శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో దర్భశయనం శ్రీ నివాసచార్య 'కవిత్వం ప్రయోజనం' అంశంపై ప్రసంగిస్తారు. కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుంది. ముఖ్య అతిథి ఎన్.గోపి, గౌరవ అతిథులుగా ఓల్గా, దీర్ఘాశి విజయ్ భాస్కర్, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొంటారు.

కవి సంధ్య

'దీర్ఘ కవితా వికాసం'పై ప్రసంగం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఏడవ సమావేశం మార్చి 23 ఉ.10గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ సమావేశంలో 'దీర్ఘ కవితా వికాసం' అంశంపై కాంచనపల్లి గోవర్ధనరాజు ప్రసంగిస్తారు. రూప్ కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. అందరూ ఆహ్వానితులే.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

కార్టూన్ల పోటీ

మామిడిపూడి రామకృష్ణయ్య స్మారకంగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహణలో కార్టూన్ల పోటీ జరుగుతుంది. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ బహుమతులు వరుసగా: రూ.6వేలు, 5వేలు, 4వేలు, 3వేలు, 2వేలు. ముప్పై ప్రత్యేక బహుమతులు ఒక్కొక్కటి రూ.1000. ఒక్కొక్కరు రెండు కార్టూన్లు పంపవచ్చు. ఎ4 సైజులో గీసి 300 రిజల్యూషన్‌లో స్కాన్ చేసి మెయిల్ చెయ్యాలి. చివరి తేదీ: మార్చి 30. కార్టూన్లు పంపాల్సిన ఈమెయిల్: ethakotas@yahoo.com

ఈతకోట సుబ్బారావు

తరాల వలస వేదనతో 'గిర్మిటియా' కవిత్వం

బ్రిటిష్ ఆక్రమిత ప్రాంతాల్లో బానిసత్వాన్ని రద్దు చేస్తూ బ్రిటన్ పార్లమెంట్ 1833లో చట్టాన్ని తీసుకురావడంతో ప్రత్యామ్నాయాల వేట మొదలైంది. భారత దేశంలోని బ్రిటిష్ ప్రభుత్వం తన వలస పాలనలో ఉన్న ఇతర దేశాలకు భారతీయులను ఒప్పంద కార్మికులుగా ఎగుమతి చేయటం ప్రారంభించింది. తమ పాలనలో నాలుగు వేర్వేరు ఖండాల్లో ఉన్న పలు దేశాలకు– అక్కడి చక్కెర, రబ్బరు, తేయాకు, కోకో తోటలలో పనిచేయడానికి– 13 లక్షల మంది భారతీయ ఒప్పంద కార్మికులను హిందూ మహా సముద్రం మీదుగా పంపించింది. ఆయా దేశాల తోటల్లో ఐదు నుంచి పదేళ్ళ పాటు పనిచేయడానికి భారతీయులు తెలిసో తెలియకో చేసుకున్న రాతపూర్వక ఒప్పందాన్ని 'గిర్మిట్' అన్నారు (ఇది 'అగ్రిమెంట్' అన్న పదానికి భ్రష్ట రూపం).

భారత దేశం నుంచి ఇలా ఇతర బ్రిటిష్ పాలిత దేశాలకు వలస వెళ్లిన ఒప్పంద కార్మికులు పాడుకున్న జానపద గీతాల నుంచి, వారి వారసులు తమ పూర్వీకుల గురించి తెలుసుకున్న లేదా దర్శించిన జీవితానుభవాల నుంచి పుట్టినది 'గిర్మిటియా' కవిత్వం. ఈ కవిత్వంలో ఆవేదనా ఆక్రోశం ఉంది. పూర్వీకుల పట్ల గౌరవమూ ఉంది.

"మేము కలకత్తా చేరాక మా కష్టాలు పెరిగాయి/ మా అందమైన బట్టలన్నీ తీయించేసారు/ జపమాల పూసలు, యజ్ఞోపవీతాలూ/ బెంగాలీ గుడ్డలే మమ్మల్ని అలంకరించాయి/ సాధువుల తలవెంట్రుకలు గొరిగేయబడ్డాయి/ సాధువులు, దొమ్మర్లు, చర్మకారులు, ఇంకా దళితులు/ అందరినీ ఒకే గదిలో పడేశారు" – అని ఈ ఒప్పంద కార్మికులను ఓడల్లో ఎక్కించే ముందు వారికి ఎదురైన అనుభవాల గురించి రాస్తాడు బ్రిటిష్ గయానాకు చెందిన వతుక్ వేద ప్రకాశ్.

"గోదాంలో కాగితం చేతిలో పెట్టారు/ పర్యవసానాలు తెలియక/ దాని మీద వేలుముద్ర పెట్టాను/ చీకటి సంద్రాన్ని ఎలా దాటగలమని/ గొణుక్కుంటూ ఏడ్చుకుంటూ తెరచాపల పడవ మీద/ ఆశ్చర్యంలో కూరుకుపోయాను," అని ఓడ ఎక్కిన తరువాత ఒక భారతీయ కార్మికురాలు వాపోయింది. "అపారమైన సముద్ర ప్రయాణంలో భారతదేశం వెనక్కు మళ్లుతోంది, ఇప్పుడు నీరు తప్ప దిగంతం లేదు, నీరు, నీరు, నీరు తప్ప మరేమీ లేదు..." అని ట్రినిడాడ్ టొబాగో ప్రఖ్యాత కవయిత్రి రామాబాయి ఎస్పినెట్ దుఃఖించింది.





పేదరికం, బాగుపడతామన్న ఆశలే ఎక్కడైనా వలసలకు ముఖ్య కారణాలు.

"వాళ్లు/ ఓడల గుంపులో వచ్చారు/ మందలా వచ్చారు/ పశువుల్లా/ గోధుమరంగు పశువుల్లా/ కళ్లు నిర్మలంగా, పశువుల్లా.. చస్తూ అందరూ/ ఒకేరీతిగా వచ్చారు వాళ్లు.. అందరూ ఒకేరీతిని/ నల్ల సముద్రాన్ని దాటుకుంటూ/ బ్రాహ్మణులు, చర్మకారులూ ఒకేలా" అని బ్రిటీష్ గయానా ప్రముఖ కవయిత్రి మహదాయ్ చెప్పుకుంది.

వలసదారులకు వాగ్దానం చేయబడ్డ భూమిలో ఎదురైన కొత్త జీవిత వాస్తవాలు వారికున్న ఆదర్శవాద కల్పనల్ని తొందరగా పంటాపంచలు చేసాయి. "మారిషస్ దీవి పేరు వినగానే../ బంగారం వెతుక్కోవచ్చని ఇక్కడికి వచ్చాం/ బదులుగా వెదురుబెత్తం దెబ్బలు తిన్నాం/ కూలీల వెనుక చర్మం ఒలిచిందది/ చెరకు తీయడానికి గానుగెద్దులమయ్యాం/ అయ్యో! కూలీలుగా మారడానికా మన దేశం విడిచిపెట్టాం" – అని అక్కడకు చేరుకున్నాక మొత్తుకున్నారు.

"చిన్న తప్పులకే సర్దార్లు కొరడా ఝుళిపించే వారు. విపరీతమైన ఎండలున్నా, వర్షం వచ్చినా, ఉరుములొచ్చినా పని చేయాల్సిందే." – అని అక్కడ బాధితులు చెప్పుకున్నారు. కొన్నిసార్లు వారి బాధల కథలు వినడానికి ఎవరూ ఉండరు.

భారత దేశం నుంచి ఇతర బ్రిటిష్ పాలిత దేశాలకు వలస వెళ్లిన ఒప్పంద కార్మికులు పాడుకున్న జానపద గీతాల నుంచి, వారి వారసులు తమ పూర్వీకుల గురించి తెలుసుకున్న లేదా దర్శించిన జీవితానుభవాల నుంచి పుట్టినది 'గిర్మిటియా' కవిత్వం. ఈ కవిత్వంలో ఆవేదనా ఆక్రోశం ఉంది. పూర్వీకుల పట్ల గౌరవమూ ఉంది.

చెరకు మొక్కలు మాత్రమే సాక్షులు: "కత్తులూ కొడవళ్లతో/ పగలూ రాత్రులూ గడుస్తున్నాయి ఇపుడు/ ఆకుపచ్చని చెరకు ఆకులకు తెలుసు/ మా అన్ని కష్టాలూ" అని తోటల్లో పనిచేస్తున్న మహిళ చెప్తుంది. పని స్థలాల్లోనే కాదు, ఇళ్లల్లో సైతం దుర్భర జీవన పరిస్థితులు వారిని వేధించేవి: "ఆరడుగుల వెడల్పు/ ఎనిమిదడుగుల పొడవు గదిలోనే/ అన్ని సౌఖ్యాలూ/ అందులోనే కొడవళ్లు పనిముట్లు/ అదే సొంత ఇల్లు/ అందులోనే వంటచెరకు/ రుబ్బురోలు పొయ్యి కూడా/ అందులోనే మా పడక". భారతదేశం నుండి ఆర్కటీలు అని పిలవబడే దళారీలు, భవిష్యత్తును గురించి తప్పుడు వాగ్దానాలతో చాలామంది మహిళలకు ఎర వేసేవారు. తమను తప్పుదారి పట్టించిన ఆ దళారీలను గుర్తుతెచ్చుకుని మహిళలు తిట్టుకుంటూ ఉండేవారు: "ప్రేమికుడ్ని వదిలేసి/ దేశం నుండి పారిపోయి వచ్చాను/ నాకు పెళ్లి కాకుండా చేసిన/ ఆ చేర్పించినవాడు తప్పకుండా చావాలి."

భర్తలు ఒప్పంద కార్మికులుగా విదేశం వెళ్ళాక వెనకే మిగిలిపోయిన భార్యల వేదనలు నమోదు చేసిన కవితలూ ఉన్నాయి. "నా స్నేహితురాళ్లందరూ తల్లులయారు/ నేను ఒంటరిగా మిగిలిపోయాను బిడ్డలు లేకుండా/ మళ్లీ మళ్లీ వేడుకున్నాను నిన్ను వెళ్లొద్దని/ అక్కడ ఉన్న స్త్రీ నీ హృదయాన్ని జయిస్తుందని/ పన్నెండేళ్లూ ఒక్క ముక్కయినా రాయలేదు నువ్వు/ చైత్రమాసపు రోజుల్ని నేను ఎలా గడపాలి?" అని కడపలో చాకలి భార్య ఆవేదన చెందింది.

ఒక సురినామ్ కవి జీత నారాయణ్ ఇలా రాస్తాడు: "తేనెలో చిక్కుకున్న ఈగలా మేము బానిసలమయాం/ నా కాళ్లు భూమిని దున్నుతున్నాయి/ నా చేతులు విత్తనాల్ని నాటుతున్నాయి." వలసదారులలో సామాజిక సోపానక్రమాలు, ఆచారాల ప్రత్యేకతల స్థాయి నుంచి, అందరినీ 'కూలీల' స్థితికీ స్థాయికీ తగ్గించాయి. కొందరు నిరసన తెలిపారు. "మమ్మల్ని కూలీ అని ఎందుకు పిలవాలి?/ మేము ఋషుల, సాధువుల వంశాలలో పుట్టిన వాళ్లం?" అని ట్రినిడాడ్ కవి రాస్తాడు.

"ఆకాశంలో సూర్యుడి వైపు చూడు ఎలా స్థిరంగా ఉందో యజమాని కన్నులాగ/ కొబ్బరి చెట్టు కావిలి కాస్తుంది పైనుండి విచారణచేసేవాడిలా/ మా కన్నెల తలలమీద దాని బరువు పడేస్తానని బెదిరిస్తూ" అని ప్రముఖ గయానా కవి డేవిడ్ డాబిడీన్ చెప్పుకుంటే, "మా అమ్మని కనుగొన లేకపోయాను/ మా నాన్ననీ కనుగొన లేకపోయాను/ డోలు వాయింపూ విన బడలేదు నేను ఎవరి పూర్వీకుడ్ని?" అని దక్షిణాఫ్రికా కవి కామౌ బ్రాత్వైట్, తల్లిదండ్రుల్ని వెతుక్కున్నాడు. భారతదేశ విశాల చరిత్రలో ఈ గిర్మిట్ల చరిత్ర అప్పుడు గాని ఇప్పుడు గాని ఎవరూ అంతగా పట్టించుకోకపోవడం ఒక విషాదం.

■ ముకుంద రామారావు

✆ 99083 47273

మనిషి ఏడ్వడం చూస్తాం

విప్లవాన్ని కాంక్షిస్తూ కవిత్వం రాసిన కవయిత్రులను మినహాయిస్తే మిగిలిన కవయిత్రులు సాధారణంగా స్త్రీలకు సంబంధించిన అనేకానేక అంశాలమీద ఉక్కిరిబిక్కిరి అయి, వాటి మీదే తమ ఆవేశాన్ని, ఆగ్రహాన్ని కవితీకరించారు. అయితే ఇందుకు భిన్నంగా భూమి, రైతు, అనంతర పరిణామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంపై కవయిత్రి అమూల్య చందు 'భూమి నవ్వడం చూశాను' అనే పద్యం రాసారు. "మా తాత పంచె కట్టినప్పుడు... భూమి నవ్వడం చూసాను" అంటూ పద్యాన్ని ప్రారంభించారు అమూల్య చందు. నవ్వుతూన్న భూమి వివిధ సందర్భాల్లో కన్నీరు కార్చడం, తాతకు దండం పెట్టడం, తాత చేతుల్ని ముద్దాడ్డం వంటి ప్రతీకలు నేలతల్లితో రైతుకున్న సంబంధాన్ని చెబుతాయి. అంత వరకూ వివిధ సందర్భాల్లో రైతుకు, భూమికి మధ్య బాంధవ్యాన్ని చెప్పిన కవయిత్రి రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో పడ్డాక అదే భూమి ఓడిపోయి పొడి నవ్వును నవ్వింది అన్నారు. ఇది పైకి సాధారణ వాక్యాల కూర్పులా కనపడుతుందేమో కాని దీని వెనుక పల్లెల్లో కూడా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్ల క్రూర హింస ఉంది. ఈ పద్యం చదివిన తర్వాత నా మటుకు నాకు మా కోనసీమలో పచ్చని పొలాలు, కొబ్బరితోటల ఎకరాలు కళ్ల ముందే సెంట్లు, గజాలుగా రూపాంతరం చెందుతున్న విషాదం కనిపించింది. ఈ వాస్తవ దారుణాలను చూసి కవిత్వం రాస్తే సరిపోతుందా అని కొందరు బుద్ధిజీవులు అనుకోవచ్చు. సరిపోకపోవచ్చు. కానీ రైతుల గురించి, వారికి దూరమవుతున్న భూమి గురించి కన్నీరు కారుస్తున్న వారు ఉన్నారని తెలుసుకోవాలి కదా, ఈ అమూల్య చందు లాగా. అందుకే... అమూల్య రాసిన పద్యం నన్ను కదిపింది. కుదిపింది. కన్నీరైంది.



■ ముక్కామల చక్రధర్

✆ 99120 19929

ప్రియ పద్యం



భూమి నవ్వడం చూశాను

మా తాత పంచె కట్టినప్పుడు
నాగలికి ఎడ్లను కట్టేటప్పుడు
భూమి నవ్వడం చూశాను...

మన్ను దున్నేటప్పుడు
నాట్లు వేసేటప్పుడు
నీళ్ళు పెట్టేటప్పుడు
మా తాత కాళ్ళకు భూమి దణ్ణం పెట్టడం చూశాను...

పసిపిల్లగా పంటను సాకేటప్పుడు
పురుగుమందును జల్లేటప్పుడు
కాకులకు వడిశెల వేసేటప్పుడు
కన్నకూతురిగా మారిన భూమి తాత చేతుల్ని ముద్దాడ్డం చూశాను..

పొలాన్ని బీడుగా చేసి... గజానికో రేటు కట్టి..
వట్టిపోయిన పొలమంటూ పదికో పరక్కో అమ్మినప్పుడూ...
భూమి నవ్వడం చూశాను...

ఆ నవ్వుపై కలుపుమొక్కల్లా లేచిన అపార్టుమెంట్ల
నీలినీడలు కమ్మినప్పుడు
వాటాలేసి, వంతులేసి.. పంచుకుని
తుంచుకుంటున్నప్పుడు
భూమి నవ్వడం చూశాను..

పొక్లెయిన్ ఇనుపచేతితో గుండె పిండైనప్పుడు
వేలవేల దిమ్మెసెలతో మొహంపై
మోదైనప్పుడు ఆఖరిగా భూమి నవ్వడం చూశాను..
ఆమె నవ్వును హత్య చేసిన నిందితులను
ప్రత్యక్షంగా చూశాను...
వాదించే జడ్జిలేదు ఉరితీసే తీర్పులేదు...
చంపింది మనిషిని కాదుగా నేలను కదా..
చిట్టచివరిగా తెరలు తెరలుగా పొరలు పొరలుగా
ఓడిపోయిన భూమి పొడి నవ్వును చూశాను..

■ అమూల్య చందు

పుస్తకాలు ఆన్‌లైన్‌లో అమ్మడమే మంచిది

– 'కథా ప్రపంచం' కిరణ్

తిరుపతిలో ఓ సాహిత్య జీవి ఒంటి చేత్తో అరుదైన పుస్తకాలను ప్రచురించి సాహిత్య ప్రపంచానికి అందిస్తూ ఉన్నాడు. బాల సాహిత్యం, తెలుగు కథలు, నవలలు, ఇతర భాషలు, ఇతర దేశాలకు చెందిన రచనల తెలుగు అనువాదాలు ప్రచురిస్తున్నాడు. ఆయన పేరు కిరణ్. కథాప్రపంచం కిరణ్‌గా, తిరుపతి కిరణ్‌గా సుపరిచితుడు. ఆయనతో సంభాషణ..



మీ నేపథ్యం గురించి చెప్పండి?

మాది తిరుపతి. నాన్న టీటీడీ ఉద్యోగం చేసేవారు. నేను హైదరాబాదులో బీకాం చదువుకున్నాను. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో మీడియా రంగంలో పని చేశాను. కొంత భక్తి ఉన్నా, సాహిత్యమంటే ప్రాణం. ఇందువల్ల సాహిత్య రంగం లోనే పూర్తి కాలం పని చేయాలని నిర్ణయించుకున్నాను. పుస్తకాలను చదవడం, మనసుకు నచ్చిన పుస్తకాలను ప్రచురించడం ఒక వ్యాపకంగా పెట్టుకున్నాను. పాఠకుల నుంచీ మంచి ఆదరణ లభిస్తుండటంతో సాహిత్య ప్రచురణ రంగం లోనే కొనసాగుతున్నాను.

సాహిత్యంతో పరిచయం ఎలా జరిగింది?

తిరుపతి కపిలతీర్థం రోడ్డులో నవభారతి స్కూల్లో ఐదవ తరగతి వరకూ చదువుకున్నాను. ఆ స్కూల్ నిర్వాహకుడు ఏనుగుల రామస్వామి నాయుడు స్కూల్‌లో సాహిత్య వాతావరణాన్ని ఏర్పరిచారు. చందమామ, బాలజ్యోతి, బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు పత్రికలు తెప్పించేవారు. అక్కడికి వచ్చే హిందూ పత్రికలోని యంగ్ వరల్డ్ చాలా ఆసక్తిగా ఉండేది. మొదట పుస్తకాల్లో బొమ్మలంటే ఇష్టం ఉండేది. హైదరాబాద్ చేరాకా అబిడ్స్ పాత పుస్తకాలే నా ప్రపంచం. అఫ్జల్‌గంజ్ లైబ్రరీలో చాలా చదువుకున్నాను. తెలియకుండానే సాహిత్యం పట్ల ఆసక్తి కల్గింది.

మీ 'కథ ప్రపంచం' ప్రచురణల గురించి చెప్పండి?

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సప్ ద్వారా పుస్తకాలు అందిస్తున్నాను. బుక్ ఫెయిర్లలో 'కథా ప్రపంచం' ప్రచురణలు అందుబాటులో పెడుతున్నాను. వేల కాపీలు వెయ్యకుండా పబ్లిష్ ఆన్ డిమాండ్ (పీఓడీ) పద్ధతిలో 200 పుస్తకాలు అచ్చు వేసి, ఆ తర్వాత డిమాండును బట్టి పుస్తకాలు పునర్ముద్రణ చేస్తున్నాను. కొత్త తరంలో పుస్తక పఠనం పెంచాలన్నదే లక్ష్యం.

2013 లో కథా ప్రపంచం పేరున ఫేస్‌బుక్ పేజ్, ఆ తర్వాత బ్లాగ్, వెబ్‌సైట్ మొదలుపెట్టి నిర్వహించాను. సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వేలాదిమంది స్పందించేవారు. వారు కోరిన పుస్తకాలు, రచయితల వివరాలు సైతం అందించేవాడిని. ఇలా ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్‌కె నారాయణ్, కెఏ అబ్బాస్ వంటి రచయితల గురించి తెలుసుకున్నాను. ఇలాంటి గొప్ప రచయితల గురించి నేనే పుస్తకాలను ఎందుకు తీసుకురాకూడదనే ఆలోచన కలిగింది. 'కథా ప్రపంచం' ప్రచురణల ద్వారా పుస్తకాలు ప్రచురించటం మొదలుపెట్టాను.

ఎన్ని పుస్తకాలు ప్రచురించారు?

ఇప్పటిదాకా యాభై పుస్తకాలు తెచ్చాను. గోపిని కరుణాకర్ 'మా తిరుపతి కొండ కథలు' మొదట ప్రచురించాను. ఆ తర్వాత ఎస్వీ రంగారావు కథలు, మధురాంతకం రాజారాం బాలల కథలు, ముళ్ళపూడి శ్రీదేవి 'రమణీయ శ్రీ రామాయణం', ప్రేమ్‌చంద్ కథావళి, కమలాదాస్ 'కుక్కలు' మొదలైన పుస్తకాలు ప్రచురించాను. నేను ప్రచురించిన యాభై పుస్తకాల్లో సగం బాల సాహిత్యమే. పిల్లల కోసం బేతాళ కథలు ఏడు భాగాలు, చందమామ బాలల కథా సాహిత్యం ఐదు భాగాలు, పిల్లల పిట్ట కథలు ఐదు భాగాలు ప్రచురించాను. పరోపకారి పాపన్న కథలు, దుర్గేశ నందిని, గుండు భీమన్న కథలు వంటి పుస్తకాలను పిల్లలను దృష్టిలో ఉంచుకొని ప్రచురించాను.

పుస్తకాల అమ్మకాలు ఎలా సాగుతున్నాయి?

మొదట్లో పుస్తక విక్రేతలకు పుస్తకాలు ఇచ్చి ఇబ్బంది పడ్డాను. ఆన్‌లైన్‌లో పుస్తకాలు అమ్ముకోవడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చాను. ఇప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ద్వారా పుస్తకాలు అందిస్తున్నాను. బుక్ ఫెయిర్లలో 'కథా ప్రపంచం' ప్రచురణలు అందుబాటులో పెడుతున్నాను. వేల కాపీలు వెయ్యకుండా పబ్లిష్ ఆన్ డిమాండ్ (పీఓడీ) పద్ధతిలో 200 పుస్తకాలు అచ్చు వేసి, ఆ తర్వాత డిమాండును బట్టి పుస్తకాలు పునర్ముద్రణ చేస్తున్నాను. కొత్త తరంలో పుస్తక పఠనం పెంచాలన్నదే లక్ష్యం. త్వరలో ఈ– కామర్స్ వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తున్నాను.

అనువాదాల ప్రచురణలో సమస్యలు?

భాషా నైపుణ్యం ఉన్న అనువాదకులను గుర్తించడం పెద్ద సమస్య. మూల భాషలోనూ, లక్ష్య భాషలోనే కాదు, ఇరు ప్రాంతాల సామాజిక స్థితిగతుల గురించి అనువాదకులకు అవగాహన ఉండేలా చూసుకోవాలి. మూల రచయితకు సంబంధించిన కాపీరైట్స్, అగ్రిమెంట్స్, రచన ప్రతి తీసుకోవాలి. అయితే, గొప్ప రచయితల సాహిత్యాన్ని ఈ తరానికి అందించేలనే బలమైన ఆకాంక్ష ముందు ఈ సమస్యలన్నీ చిన్నవే.


ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి?

ప్రత్యేకించి బాల సాహిత్య రంగంలో కృషి చేయాలని ఉంది. డిల్లీ ప్రగతి మైదాన్‌లో నిర్వహించే వరల్డ్ బుక్ ఫెయిర్‌లో తెలుగు పుస్తకాలను ప్రదర్శించాలని ఉంది.



చాసో కథల్ని కన్నడలోకి తేవాలని అనుకుంటున్నాను. ఒడిశా రచయిత ఫకీర్ మోహన్ సేనాధిపతి రచనలను తెలుగులోకి తేవాలని అనుకుంటున్నాను. మొబైల్ వ్యాన్ ఏర్పాటు చేసుకొని దేశంలోని నగరాలు, పట్టణాలు, పల్లెల్లో పుస్తకం విశిష్టతను తెలియ చేయాలనే ఆశ ఉంది. కథా ప్రపంచం ద్వారా అన్ని భారతీయ భాషల్లోనూ ముఖ్యమైన పుస్తకాలను గుర్తించి ప్రచురించాలని, తెలుగులో నచ్చిన రచనలను ఇతర భాషల్లోకి అనువదించి పుస్తక రూపంలో తీసుకురావాలని ఉంది.

ఇంటర్వ్యూ ■ ఎం. ఆదిశేషయ్య



D Day

ఉన్నట్టుండి
జైలు వాతావరణం
గంభీరమైపోతుంది

పిట్ట కదలదు
కొమ్మ ఊగదు
రహస్య సంకేతమేదో
ఖైదీల్లో గుబులు రేపుతది

ఫాన్సీ రూమ్
మరింత గడ్డకట్టుకుపోతుంది
అక్కడ ప్రతి మట్టి రేణువు
ఓ కథ చెబుతుంది

ముందుగానే
ఖైదీని వీలునామా అడుగుతారు
పేదోడికి వీలునామా ఏముంటది
బతకాలన్న ఆకాంక్ష తప్ప
అదెప్పుడూ గుంజేసుకుంటారాయే

ఆరోజు
ఖైదీ మనసు చదవడం చాలా కష్టం
అంతకన్నా
ఒంటిచేత్తో సముద్రం ఈదడం సులభమేమో.

అన్నీ సరిచూసుకుంటారు
మెడకొలత, ఉరికొలత.. వగైరాలు

మెడ విరగకపోతే
ఊపిరి కోసం తండ్లాట
ఊహకందని విషయం

ఉరితాడుకు
పెరుగును, కొవ్వొత్తిని రాస్తారు
సుఖమరణ ప్రాప్తి జరగాలి కదా..

ఖైదీ ముఖానికి
నల్లని ముసుగేస్తారు
బాధ ప్రపంచానికి
తెలువొద్దనుకుంటారు గాని
తల్లిపేగు ఎక్కడో కదిలే ఉంటది

గాలి స్తంభించిపోతుంది
వన్.. టూ.. త్రీ
ఎర్రటి దస్తీ కింద పడిపోతుంది

క్రేక్ మనే లెవర్ చప్పుడుతో
ఖైదీ శబ్ద ప్రపంచం ఆగిపోతుంది

తాడు కొసన
ఒక జీవితం వేలాడుతుంది

బయట సముద్రం ఉండజుట్టుకొని
మూర్ఛపోతుంది

■ ఉదయమిత్ర



వేగంగా..

ఏళ్ల తరబడి ఆశగా ఎదురుచూస్తున్న దివిసీమలోని గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఇప్పటికే గ్రాండ్ ఎంట్రన్స్, పరిపాలనా భవనాలు సిద్ధం కాగా, త్వరలో పరీక్షా కేంద్రానికి కూడా శంకుస్థాపన చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని, వెనువెంటనే క్షిపణి పరీక్షలు మొదలుపెట్టాలని కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ నిర్ణయించింది. కాగా, అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన నిమిత్తం ఏప్రిల్‌లో రానున్న ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగానే ఈ క్షిపణి పరీక్షా కేంద్రానికి కూడా శంకుస్థాపన చేయించాలని అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.



గుల్లలమోదలోని క్షిపణి పరీక్షా కేంద్రానికి త్వరలో శంకుస్థాపన

ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా భూమిపూజ..?

అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు వచ్చిన సందర్భంలోనే..

- ఇప్పటికే గ్రాండ్ ఎంట్రన్స్, పరిపాలనా భవనం పూర్తి
- రూ.2 వేల కోట్లతో తొలిదశలో అభివృద్ధి
- భవిష్యత్తులో రూ.20 వేల కోట్ల వరకు విస్తరణ

కీలకమైన క్షిపణుల పరీక్షలు ఇక్కడే..



మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌లో సిద్ధమైన పరిపాలనా భవనం



గుల్లలమోదలో ఏర్పాటుచేసిన మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ గ్రాండ్ ఎంట్రన్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దశాబ్దంన్నర కాలంగా ఎదురుచూస్తున్న మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ (క్షిపణి పరీక్షా కేంద్రం) శంకుస్థాపనకు కౌంట్‌డౌన్ మొదలైంది. త్వరలో నాగాయలంకలోని మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌కు భూమి పూజ జరిపేందుకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌లో పరిపాలనా భవనం పూర్తయింది. టెస్టింగ్ అవసరాలకు సంబంధించిన యూనిట్లను, బ్లాక్‌లను నిర్మించాల్సి ఉంది. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ఏప్రిల్‌లో ప్రధాని నరేంద్రమోదీ వచ్చినపుడు ఈ మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌కు కూడా శంకుస్థాపన చేయించే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఇటీవల మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంలోనే ఆయనతో వర్చువల్‌గా శంకుస్థాపన చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. చివరి నిమిషంలో దీనిని తప్పించాల్సి వచ్చింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు కావటంతో మోదీతో ప్రత్యేకంగా భూమిపూజ చేయించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అనూహ్యంగా అమరావతి పునర్నిర్మాణ పనులకు పీఎం వస్తే తప్పకుండా ఆయనతో ఈ టెస్టింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయించాలని భావిస్తున్నారు. అమరావతి కార్యక్రమం లేకపోయినప్పటికీ త్వరలో మోదీ చేతులమీదుగానే ఈ కార్యక్రమం జరిగే అవకాశముంది.

ఏళ్ల నిరీక్షణకు తెర

ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ కార్యకలాపాలు మిగతా 6లో..

మిస్సైల్స్ పరీక్షలు

ఈ సెంటర్‌లో ప్రధానంగా డీఆర్‌డీవో ఆవిష్కరించే అనేక రకాల మిస్సైల్స్‌ను పరీక్షిస్తారు. పరీక్షల అనంతరం గుర్తించిన అంశాలతో వీటిని మరింత అభివృద్ధి చేస్తారు. ప్రత్యేకంగా రెండు రకాల మిస్సైల్స్‌కు ఇక్కడ పరీక్షలు నిర్వహించే అవకాశముంది. దూరప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే బాలిస్టిక్ మిస్సైల్స్‌తో పాటు క్రూజ్ మిస్సైల్స్, యాంటీ మిస్సైల్స్ సిస్టమ్స్ వంటివి ఇక్కడ పరీక్షిస్తారు. మిస్సైల్ గైడెన్స్ సిస్టమ్స్, ప్రొపల్షన్ సిస్టమ్స్‌తో పాటు అనేక కీలక సాంకేతిక విభాగాలు ఏర్పాటు చేస్తారు. సిమ్యులేషన్, డేటా విశ్లేషణ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తారు. మిస్సైల్స్‌ను పరీక్షించిన సందర్భంలో డేటాను విశ్లేషించేందుకు కంప్యూటర్ ఆధారితంగా సిమ్యులేషన్ వ్యవస్థలను ఉపయోగించుకుంటారు.

భారత రక్షణ పరిశోధనల్లో కీలకం

గుల్లలమోదలో ఏర్పాటుచేసే మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ భారత రక్షణ పరిశోధనలో కీలకమైనదిగా చెప్పొచ్చు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును రూ.2 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నప్పటికీ భవిష్యత్తులో రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) నిర్వహించే మిస్సైల్స్ ప్రాజెక్టుల పరీక్షలు, అభివృద్ధిలో ఈ కేంద్రం తనదైన పాత్రను పోషించనుంది.



బస్సుల్లేవ్!

విజయవాడ సబర్బన్‌లో తగ్గిపోతున్న ఆర్టీసీ సర్వీసులు

400 నుంచి 283 పడిపోయిన సిటీ బస్సులు

- షెడ్యూల్ ప్రకారం కూడా నమోదు కాని కిలోమీటర్లు
- బస్సుల ఆక్యుపెన్సీ రేషియోపై తీవ్ర ప్రభావం
- బస్సులు తగ్గిపోవటంతో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- కొత్త బస్సులు వస్తేనే ఆర్టీసీకి మనుగడ!

ఒకప్పుడు నగరంలో బస్టాప్‌ల వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు క్యూ కట్టిన సిటీ సర్వీసులు నేడు చూద్దామన్నా కనిపించని స్థితికి చేరాయి. 400 నుంచి 283 బస్సులకు తగ్గిపోయాయి. ఉన్న బస్సులు కూడా కండీషన్‌లో లేకపోవడం తదితర కారణాలతో షెడ్యూల్ ప్రకారం కూడా కిలోమీటర్లు తిరగలేని దుస్థితి ఏర్పడింది. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఆర్టీసీ సర్వీసులు నడవకపోవడంతో ప్రయాణికులు ఆటోలు, క్యాబ్‌లు తదితర ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. ఇదే విధంగా మరింతకాలం కొనసాగితే ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకం కానుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలో సిటీ బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 400 నుంచి 283 బస్సులకు పడిపోయాయి. సిటీ ఆర్డినరీలు 175 బస్సులు ఉండగా.. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు 108 ఉన్నాయి. ఈ బస్సులన్నీ అక్టోబరు 10, 2024 నాటికి ఉన్న సంఖ్య. గడచిన నాలుగు నెలల్లో మరో 25 బస్సుల వరకు తగ్గిపోయినట్లు సమాచారం. భారీ సంఖ్యలో తగ్గిపోవటం వల్ల నగర ప్రజల అవసరాలకు తగిన విధంగా బస్సులు చాలటం లేదు. దశాబ్దం కిందట విజయవాడ నగర జనాభా ఎనిమిది లక్షలుగా ఉండేది. ప్రస్తుతం విజయవాడ నగర జనాభా 14 లక్షలుగా ఉంది. భవిష్యత్తులో ఈ జనాభా మరింత పెరిగే అవకాశం ఉంది. నానాటికీ పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా బస్సులు పెరగటం లేదు సరికదా.. మరింత తగ్గిపోవటం ఆందోళనకరంగా మారుతోంది. నగర ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా బస్సులు లేకపోవటం ఒక ఎత్తు అయితే ప్రస్తుతం నడుస్తున్న సిటీ బస్సులలో కూడా సగానికి పైగా కాలం తీరిపోయి ఉన్నాయి. నడుస్తున్న బస్సుల కండీషన్ కూడా ఏ మాత్రం బాగోవటం లేదు. డొక్కు బస్సులలో ప్రయాణం చేయాలంటే ప్రయాణికుల ఒళ్లు హూనమైపోతోంది. దీనికి తోడు ఎప్పుడు, ఎక్కడ రోడ్ల మీద సడెన్‌గా బస్సులు ఆగిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. పూర్వం రోజుల్లో అడపాదడపా బస్సులు మిగతా 6లో..

విజయవాడ సిటీ బస్సుల వివరాలు

క్రసం	సిటీ బస్ డిపో	మెట్రో ఎక్స్‌ప్రెస్	సిటీ ఆర్డినరీ	మొత్తం
1.	గవర్నర్ పేట - 1	18	42	60
2.	ఇబ్రహీంపట్నం	26	33	59
3.	గవర్నర్ పేట - 2	52	32	84
4.	విద్యాధరపురం	12	68	80
	మొత్తం	108	175	283

మేమింతే..!



నిమ్రా కళాశాలకు విద్యార్థులను రాంగ్ రూట్‌లో తీసుకువెళుతున్న ఆటో



రాంగ్ రూట్‌లో మోటార్ బైక్‌పై కళాశాల వైపు వెళుతున్న విద్యార్థి



పశ్చిమ ఇబ్రహీంపట్నం యూటర్న్ వద్ద నుంచి రాంగ్ రూట్‌లో వెళుతున్న ఆటో



రాంగ్ రూట్‌లో కళాశాల వైపు వెళుతున్న వ్యక్తి

- నిమ్రా వైద్య కళాశాలకు రాంగ్ రూట్‌లోనే రాకపోకలు
- బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు పెట్టినా జాంతానై..
- 2 కిలో మీటర్ల దూరం తగ్గించుకునేందుకు ప్రమాదకరంగా ప్రయాణం

ఇబ్రహీపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రమాదాలు జరిగినా.. ఎంత మంది ప్రాణాలు కోల్పోయినా 'మేమింతే మారమంతే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు నిమ్రా వైద్య కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు. ఇటీవల నిమ్రా కళాశాలకు వెళ్లే మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ కళాశాలలో చదివే ఇద్దరు వైద్య విద్యార్థునుల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో విద్యార్థి కోమాలో ఉండి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజు నుంచే మళ్లీ రాంగ్ రూట్‌లో ప్రయాణం చేస్తూనే ఉన్నారు. ఇబ్రహీంపట్నం నుంచి వచ్చే వారు కళాశాల్లోకి వెళ్లాలంటే జూపూడి వెళ్లి తిరిగి రావాల్సి ఉండటంతో దగ్గర్లో ఉన్న పశ్చిమ ఇబ్రహీంపట్నం యూ టర్న్ దారిని ఎన్నుకుంటున్నారు. కొద్ది దూరం రాంగ్ రూట్‌లో వెళితే గేటు వద్దకు చేరుకునే వీలుండటంతో ప్రాణాలను పణంగా పెట్టి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత పోలీసులు వారి వృత్తి ధర్మం ప్రకారం నిమ్రా వైద్య కళాశాలలో రెండు సార్లు రాంగ్ రూట్ వల్ల జరిగే ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. యూటర్న్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. నో ఎంట్రీ బోర్డులు సైతం పెట్టించారు. అయినా సరే నిమ్రా వైద్య కళాశాలలకు వెళ్లే వారు మాత్రం రాంగ్ రూట్‌లోనే వెళుతున్నారు. కళాశాల గేటు వద్ద హై వేను దాటే విధంగా దారి సౌకర్యం కల్పిస్తే ప్రమాదాలు నివారించే వీలుంటుందని, రాంగ్ రూట్ సమస్య తప్పు తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



ఇదిగో.. ఓవర్ లోడు!

- పట్టని అధికారులు

6లో

నవరస భరితం.. లవకుశ నాటకం

6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-17 (సోమవారం సాయంత్రం)
సహర్ : 05-02 (మంగళవారం ఉదయం)


ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడాపోటీలు రేపు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

6లో

తిరుపతమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

6లో



నేటి నుంచి పది పరీక్షలు

జిల్లాలో 168 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

- హాజరుకానున్న 31,231 మంది విద్యార్థులు
- పర్యవేక్షణకు ఐదు ఫ్లయింగ్, తొమ్మిది సిట్టింగ్ స్క్వాడ్‌లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు ఆయా పోలీస్ స్టేషన్లకు చేరాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ విధించారు. జిల్లాలో మొత్తం 31,231 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు అబ్బాయిలు 11,696, అమ్మాయిలు 15,987 మంది ఉన్నారు. ఓపెన్ స్కూల్‌కు సంబంధించి అబ్బాయిలు 1,320, అమ్మాయిలు 423 మంది పరీక్షలకు ఫీజు చెల్లించారు. ఇక సప్లిమెంటరీ విద్యార్థులు అబ్బాయిలు 1,196, అమ్మాయిలు 609 మంది పరీక్షలకు హాజరుకాబోతున్నారు. 2,136 మంది ఉపాధ్యాయులను పరీక్షల నిర్వహణకు ఉపయోగిస్తున్నారు. డిపార్టుమెంటల్ అధికారులుగా 168 మంది, చీఫ్ సూపరింటెండెంట్లుగా 168 మంది, కస్టోడియన్స్‌గా 50 మంది, ఇన్విజిలేటర్లుగా 1,750 మందిని నియమించారు. సబ్జెక్టు టీచర్లకు ఆయా సబ్జెక్టుల పరీక్షలు జరిగే రోజున ఇన్విజిలేషన్ లేకుండా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో మూడు డివిజన్లలో ఆరు పరీక్షా కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించారు. తిరువూరులో శ్రీచైతన్య, నారాయణ, నందిగామలో నారాయణ, శ్రీచైతన్య, జగ్గయ్యపేటలో చేగు విద్యాలయం, మైలవరంలో ఎస్ఎస్‌కే ఉన్నత పాఠశాలను సమస్యాత్మక జాబితాలో చేర్చారు. ఈ కేంద్రాల్లో నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. పోస్టాఫీసు, పోలీస్ స్టేషన్ అందుబాటులో ఉన్న కేంద్రాలను ఏ కేటగిరీగా గుర్తించారు. పోలీస్ స్టేషన్ లేక పోస్టాఫీసు అందుబాటులో ఉండే కేంద్రాలను 'బి' కేటగిరీలో చేర్చారు. పోలీస్‌స్టేషన్, పోస్టాఫీసు లేని కేంద్రాలను మిగతా 6లో..



నగరంలో నితిన్

నగరంలో రాబిన్‌హుడ్ చిత్ర బృందం సందడి చేసింది. ఈ నెల 28వ తేదీ చిత్రం విడుదల సందర్భంగా హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల, నిర్మాత రవి శంకర్ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం బందర్ రోడ్డులోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. హీరో నితిన్ మాట్లాడుతూ దుర్గమ్మ ఆశీస్సులతో చిత్ర ప్రమోషన్ విజయవాడ నగరం నుంచి ప్రారంభించామన్నారు. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ త్వరలో పుష్ప3 చిత్రం షూటింగ్ మొదలు కానుందని, మూడేళ్ల వ్యవధిలో చిత్రాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

– ఆంధ్రజ్యోతి, లబ్బీపేట



మంత్రి నారాయణ, హడ్కో అధికారులకు అర్చకుల ఆశీర్వచనం

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మునిసిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ హడ్కో అధికారుల బృందంతో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేయగా, అధికారులు శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. మంత్రితో పాటు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కులశ్రేష్ఠ, కార్పొరేట్ ప్లానింగ్ డైరెక్టర్ ఎం.నాగరాజ్, ఫైనాన్స్ డైరెక్టర్ దల్జీత్ సింగ్ కాత్రి, ఏపీ ప్రాంతీయ ముఖ్య అధికారి బీఎస్ఏ మూర్తి, ఏజీఎం (ఎల్) ఎస్.ఎం.శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ టి.సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న రాబిన్‌హుడ్ చిత్రబృందం



దుర్గమ్మ సేవలో సంగీత దర్శకుడు తమన్, హీరో నితిన్

కనకదుర్గమ్మను రాబిన్ హుడ్ చిత్ర హీరో నితిన్, దర్శకుడు కుడుముల వెంకీ, నిర్మాత రవిశంకర్‌లు దర్శించుకున్నారు. ఈనెల 28న ఈ చిత్రం విడుదల కానున్నట్టు తెలిపారు. అలాగే సంగీత దర్శకుడు తమన్ దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి అమ్మవారి దర్శనానంతరం పండితులు ఆశీస్సులు, అధికారులు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

తిరుపతమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో మూడోరోజు ఆదివారం ఆలయం భక్తులతో పోటెత్తింది. మునేటిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు ఆదివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున బారులుతీరారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలిచైర్మన్ జంగాల శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జగ్గయ్యపేట సీనియర్ సివిల్‌జడ్జి శ్రావణి కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. గుంటూరుకు చెందిన ఎ.గాయిత్రీ-వెంకటేశ్వరరావులు రూ.50,116లు, విద్యానగర్‌కు చెందిన యలమంచి వెంకట మోహన్-లక్ష్మీకుమారిలు రూ.10,116లు అందజేశారు.



పూజలు చేస్తున్న న్యాయాధికారి శ్రావణి కుటుంబసభ్యులు

వైభవంగా ఇనుప ప్రభోత్సవం

తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి ఇనుప ప్రభోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఈవో బీ.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో ఇనుప ప్రభ ఎక్కించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రభోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. తహసీల్దార్ శాంతి లక్ష్మి, ఏసీపీ తిలక్, ఆర్డీవో బాలకృష్ణ, ఈఈ రమా, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎస్సై ఎమ్ఎస్‌కే అర్జున పోలీస్‌బందోబస్తును నిర్వహించారు.





డార్మెటరీ దాతలతో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన చిన్నం నరేష్ కుటుంబసభ్యులు సుమారు కోటిరూపాయలతో డార్మెటరీని నిర్మించగా.. దేవస్థానం నిధులు రూ.5 కోట్లతో కేశ ఖండనశాల, టాయిలెట్ బ్లాక్‌ను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ప్రారంభించారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఈవో కిషోర్ కుమార్, ఈఈ ఎల్.రమా, టీడీపీ మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, గింజుపల్లి గోపి, కల్లూరి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని పల్లకీ ఉత్సవం

నెమలి(గంపలగూడెం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు స్వామికి పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో నిత్యహోమం, బలిహరణ, సువర్ణోత్సవములు, వసంతోత్సవం, పూర్ణాహుతి, చక్రస్నానం, రాత్రి తెప్పోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ నేల సంధ్య, ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, టీడీపీ నాయకులు బెల్లం మధు, మనమ చినబాబు తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామికి చక్రస్నానం

నవరసభరితం.. లవకుశ నాటకం

విజయవాడ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సురభి ప్రదర్శించిన 'లవకుశ' నాటకం నవరస భరితంగా సాగింది. దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం (తంజావూర్) ఆరు రోజులు పాటు నిర్వహిస్తున్న సురభి సంస్థ నాటక మహోత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో లవకుశ నాటకం ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాకు చెందిన శ్రీ శారద విజయ నాట్యమండలి, జనగాం జిల్లాకు చెందిన భానోదయ నాట్యమండలి సంస్థల బృందాలు సంయుక్తంగా ఈ నాటకాన్ని ప్రదర్శించాయి. వాల్మీకి ఆశ్రమ దృశ్యాలు, లవకుశ బాల్యం, శ్రీరాముని వైభవ గీతాలు నాటకానుభూతిని మరింత మధురంగా తీర్చిదిద్దాయి. రంగస్థల అలంకరణ, వేషధారణ, సంగీతం ప్రేక్షకులను అబ్బురపరిచేలా ప్రదర్శించారు.

అశ్వమేధ యాగ ఘట్టం హైలైట్

నాటకంలోని ప్రధాన ఘట్టం అశ్వమేధ యాగం. శ్రీరాముని ఆజ్ఞతో సాగిన యాగాన్ని లవకుశలు అడ్డుకోవడం, అనంతరం వారితో అయోధ్య సైన్యం జరిగిన ఘర్షణ, యుద్ధ సన్నివేశం, శ్రీరామ-లవకుశ మధ్య సంభాషణలు, సీతామాత త్యాగం, ధర్మ విజయం చివరకు వారి అసలు నిజం వెల్లడయ్యే తీరు ప్రేక్షకుల హృదయాలను హత్తుకొనేలా చేశాయి.

సాంకేతిక విన్యాసాలు, నాటక ప్రాముఖ్యత ఈ నాటకాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దడానికి సురభి సంస్థ ఆధునిక సాంకేతికతను వినియోగించింది. లైటింగ్స్, ధ్వని, విజువల్ ఎఫెక్ట్స్ మిశ్రమంగా వినిపించి, వాయుదేవుడి ప్రయాణం, అరణ్య రమణీయత, గంధర్వగానం ఈ అంశాలు నాటకానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. వశిష్ఠునిగా శివశంకర్, శ్రీరామునిగా ఆర్.నాగబాబు, లక్ష్మణునిగా ఆర్.భానుప్రసాద్, భరతునిగా ఆర్.కుమార్, శత్రుఘ్నగా ఆర్.మాధవరావు, ఆంజనేయుడిగా - ఆర్.సురేష్, వాల్మీకిగా ఎ.వెంకటేశ్వరప్రసాద్, సీతాదేవిగా ఎస్పీ హేమమాలిని, భూదేవిగా ఆర్.హరిణి, లవునిగా జాహ్నవి, వి.తనూజ, భాను, కుశునిగా హేమస్వి సంతోషి, హరి శివకృష్ణలు చక్కని నటనతో చక్కని పద్య గానంతో, లాలిత్యమైన అభినయంతో అలరించారు.







లవకుశ నాటకంలో సన్నివేశాలు

అమరజీవి త్యాగం అజరామరం

- పొట్టి శ్రీరాములుకు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాళి

మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం మరువలేమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అమరజీవి జయంతి సందర్భంగా ఆదివారం కృష్ణా జిల్లా కోర్టుసెంటర్‌లోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి మంత్రి రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కూటమి నేతలు కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబాప్రసాద్, సన్నిధి నాగసాయి, వేము కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేశారన్నారు. ఆయన త్యాగ ఫలితంగా ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ, గాంధీ కంటే ముందుగా దళితుల హక్కుల కోసం పొట్టి శ్రీరాములు పోరాడారన్నారు. దళితులకు ఆలయాల్లో ప్రవేశం కల్పించారన్నారు. కార్యక్రమంలో బచ్చుల బోసుబాబు, గుమ్మడి విద్యాసాగర్, బొడ్డు శ్రీనివాస్, గడ్డం రాజు, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బాలాజీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ బాలాజీ

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్ : తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం చాలా గొప్పదని, ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రేమ, నిస్వార్థంతో కూడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత గొప్ప వ్యక్తుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరేందుకు కృషిచేయాలని సూచించారు.





వెంకటరత్నంను కాపాడి ఒడ్డుకు తెచ్చిన ఎస్డీఆర్ఎఫ్ బృందం

వృద్ధుడిని కాపాడిన ఎస్డీఆర్ఎఫ్ బృందం

వన్‌టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కనదుర్గమ్మ దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తు ప్రకాశం బ్యారేజీ సమీపంలో కెనాల్‌లో పడిన వృద్ధుడిని ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందం రక్షించింది. దుర్గమ్మను దర్శించుకుని మొక్కు చెల్లించుకునేందుకు శనివారం గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన అమర వెంకటరత్నం(80) ఒంటరిగా విజయవాడ వచ్చాడు. శనివారం సాయంత్రం రథం సెంటర్ నుంచి నడుచుకుంటూ వెళుతూ ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయాడు. అదేసమయంలో ప్రకాశం బ్యారేజీ వద్ద విధుల్లో ఉన్న ఏపీ ఎస్డీఆర్ఎఫ్ బృందం హుటాహుటిన ఐఆర్‌బీ పడవ సహాయంతో కెనాల్ నుంచి వెంకటరత్నంను ఒడ్డుకు చేర్చారు. అతడి వద్ద ఉన్న రూ.50వేల నగదును నీటిలో కొట్టుకుపోకుండా జాగ్రత్త చేశారు. అతడిని వన్‌టౌన్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు వృద్ధుడి నుంచి వివరాలు తెలుసుకుని పొన్నూరులో ఉన్న అతడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియపరిచి వారు వచ్చిన తర్వాత వెంకటరత్నంను అప్పగించారు. కొద్ది రోజులుగా వెంకటరత్నం ఉపవాసంతో ఉన్నాడని, అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకోవటానికి ఒంటరిగా వచ్చారని అతడి కుమార్తె పోలీసులకు తెలిపింది. వృద్ధుడిని రక్షించిన ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ ఎం.మహేంద్ర నాయక్, సిబ్బంది శివ, పద్మనాభం, సుదర్శన్ రెడ్డి, హుస్సేన్, నాగన్న, సత్యనారాయణలను అధికారులు అభినందించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో వుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

రేపట్నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడలు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

విజయవాడ (స్పోర్ట్స్),మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఈ నెల 18 నుంచి విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం స్టేడియంలో క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం శాసనసభ సంస్కృతి సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు మళ్లీ పాత సాంప్రదాయానికి స్వాగతం పలకటం గొప్ప నిర్ణయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని జీవీ అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అందరినీ పోటీలకు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. 12 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని, 20న బెర్మ్ పార్క్‌లో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎల్ఏ సెక్రటరీ ప్రసన్నకుమార్ టీడీఎల్‌పీ ఇన్‌చార్జ్ కోనేరు సురేష్, శాప్ ఏవో వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ కోర్టును పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు, యార్లగడ్డ వెంకట్రావు



ఎల్లా వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న గురజాడ మధుసూధనరావు, ఆనంద్

పద్మశ్రీ ఎల్లాకు ఆత్మీయ సత్కారం

విజయవాడ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మృదంగ శబ్ద బ్రహ్మ, మృదంగ వాద్య తపస్వి, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, సంగీత సామ్రాట్ కళా సంస్థ, కేవీ బ్రహ్మానందం కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై ఆయనకు సత్కారం జరిగింది. అదే వేదికపై గాయకులు గురజాడ మధుసూదనరావు, కేవీబీ ఆనంద్‌లను సన్మానించారు. అతిథులుగా మంజులూరి కృష్ణకుమారి, మందరపు హైమావతి, మరడాన సాంబశివరావు, గుంటుపల్లి నానయాచారి తదితరులు కళాకారులను సత్కరించుకోవడం మన సంస్కృతికి ప్రతిరూపాలైన మన కళల్ని మనం భక్తితో గౌరవించుకొన్నట్లేనంటూ ప్రసంగించారు. కార్యక్రమంలో ఇటీవల మృతిచెందిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను స్మరించుకొంటూ గురజాడ మధుసూదనరావు, కేవీబీ ఆనంద్, మల్లీశ్వరిలు అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. సినీ సంగీత విభావరిలో స్వాతి, వి.కామేశ్వరి, శ్రావణి, డేవిడ్ రాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాటలను హృద్యంగా పాడి వినిపించారు.

బస్సుల్లేవ్!

(5వ పేజీ తరువాయి)

ఆగిపోయేవి. గత నాలుగేళ్లగా కనుక చూస్తే రోడ్ల మీద బస్సులు ఆగిపోవటం సర్వసాధారణంగా మారిపోయింది. నగరంలో సిటీ బస్సులు తగిన సంఖ్యలో లేకపోవటం, ఉన్న బస్సులు కూడా కండీషన్‌లో ఉండకపోవటంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.

లక్షన్నర నుంచి 78 వేల కిలోమీటర్లకు తగ్గిన షెడ్యూల్

ఆర్టీసీ సిటీ బస్సులు తగ్గడం వల్ల రోజువారీ తిరిగే కిలోమీటర్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. పూర్వం రోజుకు లక్షన్నర కిలోమీటర్లు షెడ్యూల్‌గా ఉండేది. ఖచ్చితంగా అన్ని కిలోమీటర్ల మేర బస్సులు తిరగాలి. ఇంతకంటే ఎక్కువ కూడా తిరిగేవి. బస్సులు తక్కువగా ఉండటం వల్ల ప్రస్తుతం కేవలం 87 వేల కిలోమీటర్లు ఖచ్చితంగా తిరగాలని షెడ్యూల్‌ను మార్చారు. అయినా కూడా 78 వేల కిలోమీటర్లు మాత్రమే బస్సులు తిరుగుతున్నాయి. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కూడా తిరగటం లేదు. దీనికి ప్రధానంగా ఆర్టీసీ అధికారులు ట్రిప్పులను తగ్గించటమే కారణమని తెలుస్తోంది. ప్రయాణికులు ఆదరించటం లేదన్న కారణంతో రెండు మూడేళ్లగా ఆర్టీసీ అధికారులు ట్రిప్పులను రద్దు చేస్తున్నారు. దీంతో షెడ్యూల్ కిలోమీటర్లు కూడా తిరగని పరిస్థితి ఏర్పడింది.

పడిపోయిన ఈపీకే

ఆర్టీసీ బస్సులు తగ్గిపోవటం, షెడ్యూల్ కిలోమీటర్లు కూడా తిరగని కారణంగా ఆర్టీసీ బస్సుల ద్వారా ఆదాయం గణనీయంగా పడిపోయింది. నగరంలోని సిటీ బస్సులన్నింటికీ కలిపి సగటున కిలోమీటరుకు వచ్చే ఆదాయం(ఈపీకే) కూడా తగ్గిపోయింది. పూర్వం కిలోమీటరుకు రూ.50 నుంచి రూ.60 మధ్యన ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ. 44.32లకు పడిపోయింది.

గణనీయంగా తగిన ఓఆర్

తగ్గిన సిటీ బస్సుల సంఖ్య బస్సుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)పై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఎన్టీఆర్ రీజియన్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల ద్వారా 79 శాతం ఓఆర్ వస్తుండగా, సిటీ ఆర్డినరీల ద్వారా 47 శాతం ఓఆర్ వస్తోంది. ఈరెండింటినీ కలిపితే 59 శాతం ఓఆర్ మాత్రమే వస్తోంది. ఒకప్పుడు 70 శాతం నుంచి ప్రస్తుతం 59 శాతానికి ఓఆర్ పడిపోవటం ఆర్టీసీ దీనస్థితిని తెలియచేస్తోంది.

ఆటోల వైపు ప్రయాణికుల చూపు

నగర ప్రజల రవాణా అవసరాలకు తగినన్ని సిటీ బస్సులు లేకపోవటంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ సిటీ ఆపరేషన్‌కు సంబంధించి చూస్తే సబర్బన్ పరిధి విజయవాడ నుంచి మైలవరం, విజయవాడ నుంచి నూజివీడు, విజయవాడ నుంచి హనుమాన్‌జంక్షన్, విజయవాడ నుంచి కంకిపాడు దాటి ఉయ్యూరు వరకు విజయవాడ నుంచి అమరావతి, విజయవాడ నుంచి మంగళగిరి వరకు ఉంది. ఇంత పెద్ద సబర్బన్‌ను పెట్టుకుని తగిన సంఖ్యలో బస్సులు లేకపోవటంతో అయా ప్రాంతాల నుంచి విజయవాడ రావటానికి ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లను ప్రజలు పెద్ద ఎత్తున ఆదరిస్తున్నారు. దీంతో నగరంలో పరిమితికి మించి అర లక్ష వరకు ఆటోలు నడుస్తున్నాయి. ఆర్టీసీ దగ్గర బస్సులు తగ్గిపోవటం వల్ల ఏర్పడిన సమస్య ఇది.

విద్యుత్ సర్వీసులొస్తే మెరుగుకానున్న పరిస్థితి

నగర జనాభా అవసరాలకు తగిన విధంగా బస్సులు లేకపోవటం వల్ల ప్రయాణికులు క్రమేపీ ఆర్టీసీకి దూరమవుతున్నారు. ఇది ఆర్టీసీ భవిష్యత్తుకు ఏమాత్రం మంచిది కాదు. ఇలాంటి సమయంలో ఆర్టీసీకి అత్యాధునిక నూతన సిటీ బస్సులను యుద్ధ ప్రాతిపదికన ప్రవేశపెట్టడం అవసరం. సిటీ బస్సులుగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా అడుగులు పడుతున్నా.. ఇంకా కార్యరూపంలోకి రాలేదు. దాదాపుగా విజయవాడకు 100 సిటీ బస్సుల వరకు వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదనలు అయితే కేంద్రానికి పంపారు కానీ, దీనిపై ఇంకా పూర్తి స్థాయిలో కదలిక ప్రారంభం కాలేదు. విద్యుత్ బస్సులు వస్తే ఆర్టీసీ నగరంలో బతకటానికి అవకాశం ఉంటుంది.

వేగంగా..

(5వ పేజీ తరువాయి)

కొద్దిరోజుల్లోనే ప్రారంభంకానున్నాయి. రాష్ట్ర విభజన కు ముందే కేంద్ర ప్రభుత్వం ఈ మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌ను మంజూరు చేసింది. అప్పట్లో నాగాయలంక మండలం గుల్లలమోద ఆమోదయోగ్యమైనదిగా నిర్ణయించారు. గుల్లలమోద సముద్రతీర ప్రాంతాన్ని కలిగి ఉండటం వల్ల మిస్సైల్స్ టెస్టింగ్ చేసిన క్రమంలో శకలాలు సముద్రంలో పడిపోతాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం ఉండదు. పర్యావరణానికి కూడా విఘాతం ఉండదని అప్పట్లో నిర్ణయించారు. ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. రాష్ట్ర విభజన జరిగాక గతంలోని టీడీపీ ప్రభుత్వం చొరవ కారణంగా గుల్లలమోదలో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌కు సంబంధించి కదలిక వచ్చింది. 381 ఎకరాలను కేటాయించారు. ఈ భూములు కేటాయించిన ప్రాంతంలో మడ అడవులు ఉండటంతో పర్యావరణకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మడ అడవులకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తిరిగి భూములు కేటాయించటం వల్ల సమస్య తొలగింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ అనుమతులు కూడా అవసరం కాబట్టి కాలాతీతం జరిగింది. ఇటీవల కాలంలో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ పరిపాలనా భవనం పనులు పూర్తయ్యాయి. కాంపౌండ్ వాల్, గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాలను అభివృద్ధి చేశారు. మిస్సైల్ టెస్టింగ్‌కు సంబంధించిన మిగిలిన విభాగాలను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడకు మిస్సైల్స్ తరలించి పరీక్షించటమే తరువాయి.

నేటి నుంచి పది పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

'సీ' కేటగిరిలో పెట్టారు. జిల్లాలో మొత్తం 168 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 'ఏ' కేటగిరిలో 134, 'బి' కేటగిరిలో 22, 'సీ' కేటగిరిలో 12 కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో నిర్వహించే పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడానికి ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఒక్కో స్క్వాడ్‌లో ముగ్గురు అధికారులు ఉంటారు. డిప్యూటీ తహసీల్దార్, ఎస్ఐ, విద్యాశాఖ నుంచి ఒకరు ఈ స్క్వాడ్‌లో ఉంటారు. ఇవి కాకుండా తొమ్మిది సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. సీ కేటగిరి కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లు ఉంటాయి. ప్రతి పరీక్షా కేంద్రంలో 100 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశారు. పాఠశాలలు పెద్దగా ఉన్న కేంద్రాల్లో 200 మంది వరకు రాసేలా ప్రణాళిక రూపొందించారు.

కలెక్టర్ డీకే బాలాజీకి అఖిల భారత యోగా సంస్థ ప్రశంసలు

మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి నాడు 108 రౌండ్లలో సూర్య నమస్కారాలు, 1296 ఆసనాలు వేసిన కలెక్టర్ డీకే బాలాజీని ఆలిండియా యోగా ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఆచార్య దమయంతి అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. దమయంతి పంపిన ప్రశంసాపత్రాన్ని ఆదివారం కలెక్టర్ బాలాజీకి యోగా గురువు గురునాథబాబు అందజేశారు. ఉదయపు నడక మిత్రమండలి హాలులో కలెక్టర్ రెండు గంటల సేపు యోగ శిక్షణలో పాల్గొన్నారు. కలెక్టర్‌కు యోగాగురువులు గురునాథబాబు, మహాలక్ష్మి, చింతయ్య, ఆర్డీ ప్రసాద్ అభినందనలు తెలిపి సత్కరించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

ఏఐకేఎంఎస్ జాతీయ సభలను జయప్రదం చేయాలి

గాంధీనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నాందేడ్‌లో ఈనెల 21 నుంచి జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) మూడో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం దాసోహమవుతుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 2.51 శాతం నిధులే కేటాయించారన్నారు. సోమనాథ్ కమిషన్ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. నేతలు ఎం.రామకృష్ణ, ఎం.పోతురాజు, రెడ్డిశ్రీను, జి.శంకర్, నాని, శ్రీను పాల్గొన్నారు.


రోడ్డు పక్కన వదిలేసిన తుప్పు పట్టిన ఆటోలు


రోడ్డు పక్కన వదిలేసిన లారీ బాడీ


నిలిపి ఉంచిన వినియోగంలో లేని బస్సులు, లారీలు

డంపింగ్ యార్డులా ఆర్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతం

- వినియోగంలో లేని ఆటోలు, బస్సులు, లారీలను తెచ్చి రోడ్డు పక్కన వదిలేస్తున్న యజమానులు
- వాహనాలను అడ్డాగా మార్చుకున్న మందుబాబులు

(ఆంధ్రజ్యోతి-పటమట): 11వ డివిజన్ టవర్ లైన్ కొత్త రోడ్డు ఆర్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతం ఒకప్పుడు సువిశాలమైన రోడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణానికి చిరునామాగా ఉండేది. కానీ, ప్రస్తుతం ఆ ప్రాంతం డంపింగ్ యార్డులా మారింది. వినియోగించని, తుప్పు పట్టిన ఆటోలు, బస్సులు, లారీలను వాటి యజమానులు రోడ్డు పక్కనే వదిలేశారు. దీంతో ఆ వాహనాలను, వాటి పక్కన మరుగు ప్రదేశాలను మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం తాగాక మందు బాటిళ్లనూ అక్కడే పడేస్తున్నారు. ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో అసాంఘిక శక్తులు తిష్ట వేస్తున్నాయి. చీకటిగా ఉండడం, ఆకతాయిల ఆగడాల నేపథ్యంలో రాత్రి వేళల్లో మహిళలు ఈ రోడ్డులో నడిచేందుకు భయపడుతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఈ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి రోడ్డు పక్కన నిలిపిన బస్సులు, లారీలు, ఆటోలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



స్క్రాప్ వాహనాలు తొలగించాలి

స్క్రాప్ వాహనాలతో ఇబ్బందిగా ఉంది. వెంటనే వాటిని తొలగించాలి. రోడ్డుపై వీధి దీపాలు లేవు. ఆకతాయిల కారణంగా రాత్రి వేళల్లో జనం భయంతో బతకాల్సి వస్తోంది. పోలీస్ నిఘా పెంచాలి.
-వడ్లపూడి వెంకట్రావ్, స్థానికుడు


పెద్ద మొత్తంలో పోగైన వ్యర్థాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పక్కన ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారి దాసు

గీతా వారసత్వ విలువలు పిల్లలకు అందించాలి

రామలింగేశ్వరనగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గీతా వారసత్వ విలువలను విద్య ప్రారంభ దశ నుంచే పిల్లలకు అందించాలని ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారి దాసు అన్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇస్కాన్ మందిరంలో ఆదివారం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బహుమతులు అందజేశారు. గీతా వారసత్వ విలువలుప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలతో భగవద్గీతను పఠింపచేయాలని ఆయన సూచించారు. కేబీఎన్ కళాశాల హెచ్‌వోడీ రమేష్‌బాబు, మాజీ ప్రిన్సిపాల్ వి.నారాయణరావు, టి.శ్రీనివాస్, పీబీ సిద్ధార్థ కన్వీనర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా అపరిష్కృతంగా విద్యారంగ సమస్యలు

- పాలకుల నిర్లక్ష్య వైఖరే అందుకు కారణం
- అన్ని వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా బడులను ప్రభుత్వం తీర్చిదిద్దాలి: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


విద్యారంగ, ఆర్థిక సమస్యలపై నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గవర్నర్‌పేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఐదేళ్లుగా విద్యారంగ సమస్యలతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబీవీకే)లో విద్యారంగ, ఆర్థిక సమస్యలపై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టీఎస్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. అన్ని వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేలా ప్రభుత్వం వాటిని తీర్చిదిద్దాలని కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నాణ్యమైన విద్య పేరుతో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ఆలోచనలకు అనుగుణంగా చేపడుతున్న మార్పులు ప్రభుత్వ విద్యను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కారణంగా విద్య ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు మిగిలిన పాఠశాలల మనుగడకు ముప్పు తెచ్చేదిగా ఉందన్నారు. హైస్కూళ్లలో సమాంతర మీడియం కొనసాగించాలని, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన వేలకోట్ల బకాయిల విడుదలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. గత ప్రభుత్వ కాలంలో రూ.20 వేల కోట్ల బకాయిలు ఉండగా ప్రస్తుతం అవి రూ.30 వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్క డీఏ అయినా ప్రకటించలేదన్నారు. ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే పునరుద్ధరించాలని, 29 శాతం ఇంటీరియం రిలీఫ్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు ఏఎస్ కుసుమకుమారి, బి.లక్ష్మీరాజా, బి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ దామోదర్, సీఐలు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు ఏసీపీ దామోదర్ హెచ్చరిక

ఆటోనగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ దామోదర్ హెచ్చరించారు. ఆదివారం పటమట, మాచవరం, గుణదల పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవల్లో పాల్గొనకుండా ఉంటే రౌడీ, సస్పెక్ట్‌షీట్లు తొలగిస్తామని అన్నారు. ప్రతి ఆదివారం కచ్చితంగా కౌన్సెలింగ్ రావాలని సూచించారు. షీటర్లపై నిత్యం నిఘా ఉంటుందని, ఎవరైనా నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇతర ప్రాంతాలకు చెందిన రౌడీషీటర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు ట్రాన్స్‌ఫర్ చేయాలని సీఐలకు సూచించారు. సీఐలు వల్లభనేని పవన్‌కిషోర్, సీహెచ్ ప్రకాష్, వాసిరెడ్డి శ్రీను, ఎస్సైలు కృష్ణవర్మ, హరికృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

చెన్నుపాటి గాంధీపై దాడి కేసు నిందితులపై సస్పెక్ట్ షీట్

మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీపై 2022లో దాడి చేసిన గద్దె కల్యాణ్‌రామ్, తమ్మిశెట్టి లీలాకృష్ణ, కానూరు సత్యశ్రీనివాస్, వల్లూరు ఈశ్వరప్రసాద్, అలచింతపల్లి సుబ్రహ్మణ్యంపై పటమట పోలీసులు సస్పెక్ట్ షీట్ తెరిచారు. గతంలో వీరిలో ముగ్గురిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు గద్దె కల్యాణ్‌రామ్, తమ్మిశెట్టి లీలాకృష్ణ, అలచింతపల్లి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు.



రోడ్డు మధ్యలో పోలీస్ బూత్, రోడ్డు పక్కన అవుట్ పోస్టు



రోడ్డు మధ్యలో పోలీస్ బూత్, రోడ్డు పక్కన అవుట్ పోస్టు

అవుట్ పోస్టులు ఉండగా.. బూత్‌లు ఎందుకు దండగ!

ట్రాఫిక్ జంక్షన్ల వద్ద రోడ్డు మధ్యలో పోలీసు బూత్‌లు..ఇబ్బందిపడుతున్న వాహనదారులు

- గ్రీన్‌సిగ్నల్ పడి రోడ్ క్రాస్ చేస్తుంటే ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక అవస్థలు
- ట్రాఫిక్ పోలీసులు సేదతీరడానికైతే ప్రధాన జంక్షన్లలో అందుబాటులో అవుట్ పోస్టులు

ట్రాఫిక్ జంక్షన్ల వద్ద రోడ్డు మధ్యలో ఉన్న ట్రాఫిక్ పోలీసు బూత్‌ల కారణంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సిగ్నల్ పడినపుడు ఎదురు రోడ్డుకు లేదా లెఫ్ట్ కటింగ్‌కు వెళ్లే వాహనదారులకు అటు వైపు నుంచి వచ్చే వాహనాలు కనబడటం లేదు. తప్పనిసరిగా రోడ్డు మధ్యలో ఆగాల్సి వస్తోంది. గ్రీన్‌సిగ్నల్ పడింది కదా అని కదిలితే అటువైపు నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఒక్కోసారి ఆకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తోంది. దీంతో రోడ్‌క్రాస్ చేసే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మొగల్రాజపురం)

రమేష్ ఆస్పత్రి జంక్షన్ నుంచి గురునానక్ రోడ్డుకు వెళ్లడానికి గ్రీన్ సిగ్నల్ పడినపుడు వాహనాలు ఒకేసారి కదులుతాయి. ఈ గ్రీన్ సిగ్నల్ పడటానికి ముందు రామవరప్పాడు నుంచి బెంజిసర్కిల్ వైపునకు వచ్చే వాహనాలకు రెడ్ సిగ్నల్‌పడుతుంది. కానీ అటువైపు నుంచి వాహనాలు చివరి క్షణం వరకూ వేగంగా వస్తుంటాయి. రమేష్ ఆస్పత్రి వైపు నుంచి వచ్చే వాహనదారులకు రామవరప్పాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసు బూత్ అడ్డుగా ఉంటోంది. గురునానక్ కాలనీ రోడ్డు నుంచి రమేష్ ఆస్పత్రి రోడ్డుకు, రామవరప్పాడు రోడ్డుకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. నిర్మలా జంక్షన్‌లో ట్రాఫిక్ బూత్‌కు హోర్డింగ్ నిలబెట్టారు. నిర్మలా కాన్వెంట్ రోడ్డు నుంచి పిన్నమనేని రోడ్డుకు వచ్చే వాహనదారులకు ఇది బెంజిసర్కిల్ నుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా అడ్డుగా ఉంది. ఇలాంటి పరిస్థితి నిర్మలా జంక్షన్, సిద్ధార్థ జంక్షన్ ఇంకా పలు చోట్ల ఒక రోడ్డు నుంచి మరొక రోడ్డుకు వెళ్లే సమయంలో ఎదురవుతోంది.

నిరుపయోగంగా..

బూత్‌లను పోలీసులు ఎక్కడా ఉపయోగించడం లేదు. చాలా చోట్ల పోలీసులు రోడ్డు మీదే నిలబడి విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో వర్షం వచ్చినపుడు కాసేపు అందులో తలదాచుకుంటున్నారు. రోడ్డు పక్కన కూడా కొన్నిచోట్ల పోలీసు అవుట్ పోస్టులు కట్టారు. ఇవి ఉండగా బూత్‌లతో ప్రత్యేకంగా పని లేదు.

బూత్‌లు తొలగించాలి

ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులు కాసేపు సేద తీరడానికి బెంజిసర్కిల్, రమేష్ ఆస్పత్రి జంక్షన్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు జంక్షన్ వద్ద అవుట్ పోస్టులు ఉన్నాయి. జాతీయ రహదారి మీద సిద్ధార్థ జంక్షన్, మదర్ థెరిస్సా జంక్షన్ వంటి చోట్ల ఉన్న బూత్‌లతో అవసరం లేదు. వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా ఉన్న బూత్‌లను అక్కడి నుంచి తొలగించడమో లేదా రోడ్డు పక్కన ఏర్పాటు చేయడమో చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


జెండా ఊపి కూరగాయల లారీని సాగనంపుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

తిరుమల నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

పటమట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిర్వహించే అన్నదానానికి నగరం నుంచి కూరగాయల లారీని పంపడం అభినందనీయమని దాతలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభినందించారు. 13వ డివిజన్ లక్ష్మీపతినగర్‌లో శ్రీవెంకటేశ్వర భక్త బృందం తిరుమలకు పంపుతున్న కూరగాయల లారీకి ఆయన జెండా ఊపారు. వీరంకి గురుమూర్తి, జోగి గౌరీశంకర్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గూడవల్లి నాగేశ్వరరావు, గద్దె ప్రసాద్, పి.దుర్గారావు, పెందూరి కొండ, పేరేపి ఈశ్వర్, శొంఠి నాగేశ్వరరావు, నాగాయలంక శ్రీను పాల్గొన్నారు.


చాంపియన్‌గా నిలిచిన వెల్‌కమ్ సీసీ జట్టు

బీ లీగ్ చాంపియన్‌గా వెల్‌కమ్ సీసీ జట్టు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 16(ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బీ లీగ్ మ్యాచ్‌లలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన వెల్‌కమ్ సీసీ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం చివరి మ్యాచ్ ఫ్రెండ్స్ ఎవరెస్ట్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఫ్రెండ్స్ జట్టు 45.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. జట్టులో ఎం.శ్యామ్‌ప్రసాద్ 124, వి.విశాల్ 119 పరుగులతో సెంచరీలు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎవరెస్ట్ జట్టు 48.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 256 పరుగులు మాత్రమే చేసి ఓటమి చెందింది.

రేషనలైజేషన్‌కు ముందే పదోన్నతులు కల్పించాలి

- వీఆర్వోల అసోసియేషన్ నేతల డిమాండ్

గాంధీనగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్‌కు ముందే ప్రమోషన్లు ఇవ్వాలని వీఆర్వోల అసోసియేషన్ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. గ్రేడ్- 2, డైరెక్ట్ వీఆర్వోల సంఘాల ఉమ్మడి సమావేశం రెవెన్యూ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. రేషనలైజేషన్‌లో వీఆర్వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. నేతలు ఆంజనేయకుమార్, అనుపమ, ప్రసన్నకుమార్ మాట్లాడారు. రేషనలైజేషన్ కంటే ముందుగానే రెవెన్యూశాఖలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఖాళీలను అర్హులైన వీఆర్వోలతో భర్తీ చేయాలన్నారు. వీఆర్వోలకు ఒకటే గ్రేడ్ ఉండాలని కోరారు. వీఆర్వోలకు ఇతర శాఖలోని పనులను అప్పగించొద్దని కోరారు. ఇప్పటి నుంచి మాతృశాఖకు అనుబంధంగా ఉన్న గ్రామ రెవెన్యూ అధికారుల సంఘాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేస్తామన్నారు. వీఆర్వోల సమస్యలను ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వీఆర్వోల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్) 2025 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ (మేథ్స్) అభ్యర్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో బీఈ/ బీటెక్/ బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఏప్రిల్ 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 2025 మే 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఎంట్రెన్స్‌ను అనంతపురంలోని జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది. ప్రవేశ పరీక్ష 2025 మే 6వ తేదీన జరుగుతుంది. పూర్తి వివరాలకు https://cets.apsche.ap.gov.in/ APSCHE/APSCHEHome.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎన్‌సీఎల్‌లో 1,765 అప్రెంటిస్ పోస్టులు

అప్రెంటిస్ పోస్టుల భర్తీకి నార్తరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎన్‌సీఎల్) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం 1,765 పోస్టులు ఉన్నాయి. ఇందులో గ్రాడ్యుయేట్స్ 152, డిప్లొమా 597, ట్రేడ్ అప్రెంటిస్ 941 ఉన్నాయి. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ nclcil.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 18. అభ్యర్థుల వయస్సు 2025 మార్చి1వ తేదీ నాటికి 18 నుంచి 26 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

గడువు పెంపు

'కొమెడెక్'

కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్లకు ఉద్దేశించిన కొమెడెక్ యూజీసెట్-2025కి (కన్సార్టియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్, డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్నాటక) దరఖాస్తు దాఖలు గడువును పొడిగించారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఈ పరీక్షను ప్రతీ సంవత్సరం తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు రాస్తుంటారు. ఆసక్తి గల అభ్యర్థులు https://comedk.org/ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 20 తేదీ వరకు పెంచారు. కరెక్షన్ విండో ఏప్రిల్ 11 నుంచి 14 వరకు ఓపెన్‌గా ఉంటుంది. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష మే10న జరుగుతుంది. ఫలితాలు మే 24న వెల్లడిస్తారు.

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ దరఖాస్తు దాఖలు గడువును 2025 మార్చి 31 వరకు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ వివరాలను తెలిపింది. తొలుత ఈ గడువు 2025 మార్చి 12 వరకు ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కీమ్ ద్వారా భారతదేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. ఇందులో ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, ట్రావెల్ - హాస్పిటాలిటీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ తదితర రంగాలు ఉన్నాయి. రిలయన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఎల్ అండ్ టీ, టెక్ మహీంద్ర, బజాజ్ ఫైనాన్స్, మహీంద్ర అండ్ మహీంద్ర మొదలైన దిగ్గజ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. పదో తరగతి అర్హత ఉన్నవారు మొదలుకుని గ్రాడ్యుయేషన్ వరకు అందరూ ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

మంచి కాలేజీ అయితేనే సరైన ప్లేస్‌మెంట్

దిక్సూచి DIKSUCHI

ఐసెట్ ప్రిపరేషన్ ప్లాన్



తెలుగు రాష్ట్రాల్లో ఎంబీఏ లేదా ఎంసీఏ(మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) చేయాలంటే ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి. ఈ పరీక్షలో ర్యాంకు సాధిస్తే మంచి కాలేజీలో సీటు సంపాదించవచ్చు. ఏదో ఒక కాలేజీలో సీటు సులభమే. కానీ ప్లేస్‌మెంట్ సరిగ్గా ఉండాలంటే మాత్రం తప్పనిసరిగా మంచి కాలేజీలో చదవాలి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఐసెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌లో మే మొదటివారంలో ఎంట్రెన్ జరుగుతుండగా, తెలంగాణలో జూన్ మొదటి వారంలో నిర్వహిస్తున్నారు. రెండు సెట్‌ల పరీక్షల స్వరూపం ఒక్కటే. మొత్తం ప్రశ్నలు 200 ఉంటాయి. కామన్‌గా మూడు సెక్షన్లు ఉంటాయి. అవి అనలిటికల్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ. కాకపోతే ఒక్కో రాష్ట్రంలో ఈ ప్రశ్నలు ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ ఉండోచ్చు. ఐసెట్ ఎంట్రెన్స్ రాయాలంటే కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా పరీక్ష రాయవచ్చు. ఎంసీఏలో చేరాలంటే మాత్రం ఇంటర్‌లో మేథ్స్ చదివి ఉండాలి. ఐసెట్‌లో 200 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలు పూర్తి చేయాలి. అంటే ప్రతీ ప్రశ్నకు 45 సెకన్లు మాత్రమే సమయం ఉంటుందన్నమాట. అనలిటికల్, మేథమెటికల్ ఎబిలిటీల వంటి సెక్షన్లకు ఈ సమయం సరిపోదు. ఎంత ఎక్కువ ప్రాక్టీసు ఉంటే అంత వేగంగా సమాధానాలు గుర్తించగలుగుతారు. షార్ట్‌కట్‌లు తెలుసుకోవాలి. సమాధానం రాకుంటే సమయం వృథా కాకుండా పరీక్ష చివర్లో ప్రయత్నించాలి. సాధారణంగా 150 నుంచి 170 మధ్య టాప్ స్కోర్లు ఉంటాయి. 120 దాటిన వారికి కూడా మంచి కాలేజీల్లో సీట్లు లభించే అవకాశం ఉంటుంది. ఫలానా కాలేజీలో ఈ స్కోరుకు సీటు పక్కా అని చెప్పడానికి ఉండదు. ప్రతీ సంవత్సరం మారే అవకాశం ఉంటుంది. అందుకే సాధ్యమైనంత మంచి ర్యాంకు తెచ్చుకోవాలి.

నోటిఫికేషన్ వివరాలు

- తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 (టీజీ ఐసెట్) నోటిఫికేషన్ విడుదల అయింది. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ దీనిని నిర్వహిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మే 3. ప్రవేశ పరీక్ష 2025 జూన్ 8, 9వ తేదీన నిర్వహిస్తారు.
- ఏపీ కామన్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఐసెట్) కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసారి విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. 2025 ఏప్రిల్ 9 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష 2025 మే 7న జరుగుతుంది.

అడ్మిషన్స్

ఏపీ 'ఈఏపీసెట్'



ఆంధ్రప్రదేశ్ 'ఈఏపీసెట్' దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలనుకున్న విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 24. కరెక్షన్లకు మే 6వ తేదీ నుంచి మే 8 వరకు అవకాశం ఉంటుంది. మే 12 నుంచి ఈఏపీసెట్ వెబ్‌సైట్‌తోపాటు, రాష్ట్రప్రభుత్వ వాట్సాప్ నంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాస్యూటికల్ కోర్సులకు ఎంట్రెన్స్ మే 19, 20 తేదీల్లో, ఇంజనీరింగ్ కోర్సులకు మే 21 నుంచి 27 నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 46 కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచుకున్నవారు కర్నూలులోని ప్రాంతీయ కేంద్రంలో ఎంట్రెన్స్ రాయాల్సి ఉంటుంది.

ఎంట్రెన్స్ విధానం:

- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 80 మేథ్స్, 40 ఫిజిక్స్, 40 కెమిస్ట్రీ నుంచి ఉంటాయి. ఇవన్నీ కూడా ఆబ్జెక్టివ్, మల్టీపుట్ చాయిస్ ప్రశ్నలు.
- అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ ప్రశ్నపత్రంలో కూడా 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో బయాలజీ 80(బోటనీ 40, జువాలజీ 40), ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40 ఉంటాయి.

ఫీజు: దరఖాస్తుతోపాటు జనరల్ అభ్యర్థులు రూ.600/-, బీసీ అభ్యర్థులు రూ.550/-, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ. 500/- చెల్లించాలి.

చిత్రజ్యోతి

SINCE 1965

కోర్ట్ నన్ను గెలిపించింది

నాని



ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీష్ తెరకెక్కించిన చిత్రం 'కోర్ట్'. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం విజయవంతంగా కొనసాగుతోన్న సందర్భంగా మేకర్స్ ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. నాని మాట్లాడుతూ "నేను ఎప్పుడూ స్క్రిప్ట్, ప్రేక్షకుల అభిరుచినే నమ్ముతాను. ఈ సినిమా నన్ను, నా నమ్మకాన్ని గెలిపించింది" అని అన్నారు. "ఈ సినిమా కథ విని చాలా గొప్ప అనుభూతిని పొందాను" అని ప్రియదర్శి చెప్పారు. "జీవితాలనే మార్చేయగల శక్తి సినిమా సొంతం. ఈ విజయం చిత్రబృందానికి అంకితం" అని రామ్ జగదీష్ అన్నారు.

విలన్ వస్తున్నాడు



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం 'ఎల్ 2 ఎంపురాన్'. ఈ నెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. అయితే ఈ చిత్రం విడుదల వాయిదా పడిదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీన్ని ఖండిస్తూ చిత్రబృందం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 27న 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపింది. 'సరైన సమయమిది. అందరూ జాగ్రత్తగా ఉండండి. విలన్ మీ కోసం వచ్చేస్తున్నాడు' అంటూ పృథ్వీరాజ్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

అన్ని వర్గాలనూ అలరిస్తుంది

నవీన్ యెర్నేని



సుశాంత్, జాన్యజోషి, విధి నటించిన హిందీ చిత్రం 'పింటూ కి పప్పీ'. ఈనెల 21న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా పలు భాషల్లో విడుదలవుతోంది. శివ్ హరే దర్శకత్వంలో విధి ఆచార్య నిర్మించారు. తెలుగులో 'కిస్ కిస్ కిస్సిక్' పేరుతో విడుదలవుతోంది. మురళీ శర్మ, గణేశ్ ఆచార్య, విజయ్‌రాజ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ "సినిమా రషెస్ చూశాను. చాలా బాగా వచ్చింది. అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలున్నాయి. తొమ్మిది పాటలూ అద్భుతంగా ఉన్నాయి. సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వాలి" అని ఆకాంక్షించారు. గణేశ్ ఆచార్య మాట్లాడుతూ "అందమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యూత్‌నూ ఆకట్టుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని చెప్పారు. హీరో సుశాంత్ మాట్లాడుతూ "సినిమా మంచి కమర్షియల్ ప్యాకేజీలా ఉంటుంది" అని తెలిపారు.

ఆగస్టులోనే రెండో యుద్ధం



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'వార్-2'. ఆర్యన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తోంది. కాగా, ఈ సినిమాను ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించింది. అయితే కొన్ని రోజుల క్రితం షూటింగ్‌లో హృతిక్ కాలికి గాయం అవడం వల్ల చిత్రీకరణకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల మరింత జాప్యం జరిగి విడుదల వాయిదా పడుతుందంటూ బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరిగింది. దీన్ని చిత్రబృందం ఖండించింది. హృతిక్ కోలుకోగానే మిగిలిన భాగాన్ని పూర్తి చేసి, ముందు ప్రకటించిన విధంగానే ఆగస్టు 14న 'వార్ 2'ను విడుదల చేస్తామని యూనిట్ పేర్కొంది.

వినోదం గ్యారంటీ



నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయిక. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. ఈనెల 28న విడుదలవుతోంది. చిత్రబృందం భీమవరంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో హీరో నితిన్ మాట్లాడుతూ "సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల్ని నిరుత్సాహపరచదు. పూర్తి వినోదం గ్యారంటీ" అని అన్నారు. "మనసుపెట్టి తీసిన చిత్రమిది. కచ్చితంగా మీ అంచనాలను అందుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని వెంకీ కుడుముల చెప్పారు. "ఈ సినిమాను థియేటర్లలో మీ కుటుంబసభ్యులతో మిత్రులతో కలసి చూడండి. బాగా ఎంజాయ్ చేస్తారు" అని వై. రవిశంకర్ తెలిపారు.

'పుష్ప 3'.. మరో మూడేళ్లలో



అల్లుఅర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప 2: ద రూల్' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఆ చిత్రానికి కొనసాగింపుగా 'పుష్ప 3: ద ర్యాంపేజ్' ఉంటుందని మేకర్స్ అప్పట్లోనే ప్రకటించారు. 'రాబిన్‌హుడ్' ప్రెస్‌మీట్‌లో 'పుష్ప 3' గురించి నిర్మాత వై. రవిశంకర్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. "పుష్ప 3'ని 2028లో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అల్లు అర్జున్ ప్రస్తుతం తను చేయబోయే ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు" అని ఆయన తెలిపారు.

సంక్రాంతి కానుకగా మెగాస్టార్ సినిమా

- అనిల్ రావిపూడి



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తను దర్శకత్వం వహిస్తున్న చిత్రం వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తుందని ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. తన ఆరాధ్య దైవం సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో ఆదివారం ఆయన సినిమా స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. తన బృందంతో కలిసి ఆదివారం ఉదయం సింహాచలం చేరుకున్న అనిల్ రావిపూడి ముందుగా ఆలయంలో కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అంతరాలయంలో స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మెగాస్టార్ ఇమేజ్‌కు తగ్గట్లుగా ఈ సినిమాకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 90 శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, మరో నెలరోజుల్లో సెట్స్‌మీదకు వెళ్తామన్నారు. మూడు నెలల షూటింగ్ పార్టు అనంతరం, పోస్టు ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకుని వచ్చే సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. మెగాస్టార్ సినిమాల్లో పాటలు, సంగీతానికి ఉండే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భీమ్స్‌ను సంగీత దర్శకుడిగా ఎంచుకున్నామన్నారు. ప్రముఖ నేపథ్య గాయకుడు రమణ గోగులతో పాటలు పాడించాలని నిర్ణయించామని తెలిపారు.

సింహాచలం (ఆంధ్రజ్యోతి)



కొత్త తేదీన జాన్వీ చిత్రం



వరుణ్ ధావన్, జాన్వీకపూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'సన్నీ సంస్కారీ కీ తుల్సీ కుమారి'. ఈ చిత్రం విడుదల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలవ్వాల్సి ఉంది. అయితే సెప్టెంబర్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణసంస్థ ధర్మా ప్రొడక్షన్స్ ఆదివారం ప్రకటించింది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, భావోద్వేగాల మిళితంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని యూనిట్ పేర్కొంది. 'బవాల్' తర్వాత వరుణ్, జాన్వీ జంటగా నటిస్తున్న చిత్రమిది. శశాంక్ ఖేతన్ దర్శకత్వం వహిస్తున్నారు. రోహిత్ సరాఫ్, సన్యా మల్హోత్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

రెహ్మాన్‌కు అస్వస్థత

- **చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్**



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ. ఆర్ రెహ్మాన్ ఆదివారం ఉదయం స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే ఆయన్ను చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత ఆయన డిశ్చార్జ్ అయ్యారు. డీహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్య కారణంగా ఆయన ఒకింత అస్వస్థతకు గురవ్వడంతో, ఇందుకోసం చికిత్స తీసుకున్నారని రెహ్మాన్ సోదరి రెహానా వెల్లడించారు. 'డీ హైడ్రేషన్, గ్యాస్ట్రిక్ ట్రబుల్ కారణంగా రెహ్మాన్ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స తర్వాత కోలుకున్నారు. మధ్యాహ్నం ఆయనను డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించాం' అని వైద్యులు పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హాస్పిటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి రెహ్మాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.


మాజీ భార్య అనొద్దు : సైరా బాను



రెహ్మాన్ అనారోగ్యానికి గురయ్యారంటూ వచ్చిన వార్తలపై ఆయన భార్య సైరా బాను స్పందించారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. అలాగే, తన గురించి ప్రస్తావించేటపుడు రెహ్మాన్ మాజీ భార్య అని పిలవొద్దు అని ఆమె కోరారు. తాము ఇంకా అధికారికంగా విడాకులు తీసుకోలేదన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, అందుకే రెహ్మాన్‌కు దూరంగా ఉంటున్నాననీ ఆమె వెల్లడించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు



ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దీపికా పిల్లి కథానాయిక. మాంక్స్ అండ్ మంకీస్ బేనర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం విడుదల తేదీని ప్రకటించింది. ఏప్రిల్ 11న 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. కొత్త తరహా ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిదనీ, కుటుంబ ప్రేక్షకులను, యువతను ఆకట్టుకునే హంగులతో తెరకెక్కించామనీ మేకర్స్ తెలిపారు. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రధన్ సంగీతం అందిస్తున్నారు. కథ, మాటలు: సందీప్ బొల్లా, సినిమాటోగ్రఫీ:ఎంఎన్ బాల్‌రెడ్డి, ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్

సద్విమర్శ.. ప్రజాస్వామ్య ఆత్మ!

(మొదటిపేజీ తరువాయి)

పాడ్‌క్యాస్టర్, కంప్యూటర్ శాస్త్రవేత్త లెక్స్ ఫ్రీడ్‌మన్ నిర్వహించిన షోలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, హిందూ జాతీయవాదం, పాకిస్థాన్‌తో శాంతియత్నాలు, తన పేదరికంలో సవాళ్లు, తండ్రి క్రమశిక్షణ, తల్లి త్యాగాలు మొదలైన అంశాలపై తన అంతరంగాన్ని సుదీర్ఘంగా మూడు గంటల పాటు వివరించారు. విమర్శలను తాను సహించనన్న విమర్శను ప్రధాని తోసిపుచ్చారు. సద్విమర్శలను స్వాగతిస్తానన్నారు. 'విమర్శ ప్రజాస్వామ్యంలో తప్పనిసరి. నిజంగా మీ నరనరాల్లో ప్రజాస్వామ్యం గనుక ఉంటే విమర్శను అక్కున చేర్చుకుంటారు. విమర్శ పదునుగా.. విజ్ఞానయుతంగా ఉండాలి. అయితే ప్రస్తుతం సద్విమర్శలు నాకు కనిపించడం లేదు. అసలైన విమర్శలో.. కూలంకష అధ్యయనం.. లోతైన పరిశోధన, నిండైన విశ్లేషణ ఉండాలి. ఇప్పుడు మీడియా ప్రతినిధులు షార్ట్‌కట్‌ల కోసం చూస్తున్నారు. సరైన పరిశోధన, విశ్లేషణ చేయడం లేదు. అందరినీ ఆకట్టుకునే శీర్షికల కోసం పదవిన్యాసాలు చేస్తున్నారు. మీరు (ఫ్రీడ్‌మన్) ప్రస్తావిస్తున్న ఉదాహరణలు ఆరోపణలే తప్ప విమర్శలు కావు. ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉంది. ఆరోపణలతో ఎవరికీ ప్రయోజనం ఉండదు. అనవసర సంక్షోభాలకు అవి కారణమవుతాయి. ప్రస్తుత జర్నలిస్టుల్లో చాలా మంది హెడ్‌లైన్స్ కోసం ఆరోపణలు చేస్తున్నారు. తప్పుడు ఆరోపణలు వచ్చినా నా పనిపైనే దృష్టిపెడతాను. మౌనంగా, పూర్తి అంకితభావంతో దేశసేవ కొనసాగిస్తున్నాను' అని వివరించారు. ప్రధాని ఇంకా ఏం చెప్పారంటే...

ఆరెస్సెస్ వల్లే జీవిత పరమార్థం తెలిసింది

ఆరెస్సెస్ వల్లే నా జీవిత పరమార్థం తెలిసింది. మా స్వగ్రామంలో దాని శాఖ ఉండేది. అక్కడ ఆటలు ఆడేవాళ్లం. దేశభక్తి గీతాలు ఆలపించేవాళ్లం. ఆ గీతాలు నన్ను లోతుగా స్పృశించాయి. నా మనసును కదలించాయి. చివరకు ఆర్ఎస్ఎస్‌లో భాగమయ్యాను. "నువ్వు ఏం చేసినా దానికొక ప్రయోజనం ఉండాలి. చదువుతున్నప్పుడు.. దేశానికి అవసరమైనంత వరకు చదవాలి.. వ్యాయామం చేసేటప్పుడు కూడా.. మీ దేహదారుఢ్యం దేశసేవకు ఉపయోగపడేదిగా ఉండాలి" అని అక్కడ బోధించేవారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ వందో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఇంత పెద్ద స్వచ్ఛంద సంస్థ ప్రపంచంలో ఎక్కడా ఉనికిలోనే లేదు. అయితే ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవడం అంత సులువు కాదు. ఇలాంటి ఉన్నత సంస్థ నుంచి క్రమశిక్షణతో పాటు జీవిత పరమార్థాన్ని తెలుసుకోవడంతో నా జన్మ తరించిందని భావిస్తున్నాను.



పాడ్‌కాస్ట్‌కు ముందు ప్రధాని మోదీతో ఫ్రీడ్‌మన్ కరచాలనం

పేదరికాన్ని భారమనుకోలేదు..

మట్టి నేలతో ఉన్న ఒంటి గది ఇంట్లో పెరిగాను. కొరతలుండేవి.. బాధలు పడలేదు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ పేదరికాన్ని నా కుటుంబం భారంగా భావించలేదు. నా తండ్రి దామోదర్‌దాస్ మోదీ కష్టజీవి. కఠోర క్రమశిక్షణ పాటించేవారు. వేకువన నాలుగు, నాలుగున్న గంటలకే ఇంటి నుంచి వెళ్లేవారు. చాలా దూరం నడిచేవారు. గుళ్లను దర్శించుకుని తన దుకాణానికి చేరుకునేవారు. కిర్రుకిర్రుమనే లెదర్ చెప్పులతో గ్రామంలో తిరిగేవారు. ఆయన చెప్పుల శబ్దం విని జనం టైమెంతో చెప్పేవారు. మా తల్లిదండ్రులు పేదరికం భారం పిల్లలపై పడనివ్వలేదు. నేను గుజరాత్ సీఎం నయ్యేదాకా నా జీవితం గురించి పెద్దగా ఎవరికీ తెలియదు.

పాక్ నుంచి వెన్నుపోటు

ద్వైపాక్షిక సంబంధాల్లో నూతనాధ్యాయం కోసం.. 2014లో ప్రధానిగా తొలిసారి నా ప్రమాణ స్వీకారానికి నాటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించాను. ఆ దేశంతో శాంతి నెలకొల్పుకోవడానికి ప్రయత్నం చేసినప్పుడల్లా మనకు వెన్నుపోటు, శత్రుత్వమే ఎదురయ్యాయి. పాక్ నేతలు వివేకవంతులై శాంతి మార్గాన్ని ఎంచుకుంటారని చిత్తశుద్ధితో ఆశిస్తున్నాం. ఉగ్రవాదంతో అలసిపోయిన పాక్ ప్రజలు కూడా శాంతిని కోరుతున్నారని విశ్వసిస్తున్నాను. ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు నేను చేసిన ప్రయత్నం సద్భావనకు నిదర్శనం. ఇలాంటి దౌత్యయత్నం దశాబ్దాలుగా జరుగలేదు.

ఉక్రెయిన్ యుద్ధంతో ఎన్నో సమస్యలు..

రష్యా, ఉక్రెయిన్ రెంటితో భారత్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. ఇది యుద్ధాల శకం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పాను. యుద్ధరంగంలో విజయాలు శాశ్వత శాంతిని ఇవ్వవని సోదరుడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కూడా సూచించాను. తన మిత్రపక్షాలతో ఉక్రెయిన్ ఎన్ని చర్చలు జరిపినా ఉపయోగం శూన్యం. రష్యా, ఉక్రెయిన్ మాత్రమే చర్చించుకోవాలి. తాజా పరిస్థితులు చర్చలకు అవకాశం కల్పిస్తున్నాయి.

మరణం అనివార్యం..: మరణం అనివార్యం.. జీవితం క్షణభంగురం. మరణం రాక ముందే ఓ ప్రయోజనం కోసం బతకడం ముఖ్యం. నాయకుడికి తప్పనిసరిగా ఓ విజన్, దానిని అమలు చేసే ధైర్యం ఉండాలి. భిన్నత్వం, సంక్లిష్టత కలిగిన భారత్ వంటి దేశంలో నాయకత్వం అంటే కేవలం నిర్ణయాలు తీసుకోవడమే కాదు. ప్రతి నిర్ణయం జాతి ప్రయోజనంతో కూడుకున్నదై ఉండాలి. 21వ శతాబ్దం భారత్‌దే.

ఎవరీ ఫ్రీడ్‌మన్?

లెక్స్ ఫ్రీడ్‌మన్ (41) తజికిస్థాన్‌లో జన్మించారు. ఆయనకు 11ఏళ్ల వయసులో కుటుంబం అమెరికా వెళ్లింది. ఆయన తండ్రి అలెగ్జాండర్ పూర్వ సోవియట్ యూనియన్‌లో ప్రసిద్ధ ప్లాస్మా ఫిజిసిస్టుల్లో ఒకరు. తర్వాత పెన్సిల్వేనియాలోని డ్రెక్సెల్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేశారు. అక్కడే లెక్స్ ఫ్రీడ్‌మన్ అండర్ గ్రాడ్యుయేట్, డాక్టొరల్ డిగ్రీలు చేశారు. 2014, 15ల్లో గూగుల్‌లో మెషీన్ లెర్నింగ్ రీసెర్చర్‌గా పనిచేశారు. మెషీన్ లెర్నింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) కీలక విభాగం. దానిపై ఫ్రీడ్‌మన్‌కు అమితాసక్తి. టెస్లా సెమీ ఆటోమేటిక్ కార్లు నడిపేటప్పుడు డ్రైవర్ల ప్రవర్తన ఎలా ఉంటుందనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఆటోమేటిక్ కార్లు నడుపుతున్నా డ్రైవర్లు పరిసరాలను గమనించుకుంటూ పోతున్నారని ఆయన అధ్యయనంలో తేలింది. ఇది కార్ల పరిశ్రమకు షాకిచ్చింది. 2018లో ఫ్రీడ్‌మన్ పాడ్‌కాస్ట్ ప్రారంభించారు. తన అధ్యయనాన్ని అందులో పంచుకోవడంతో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ చర్చలకు ఆయన్ను ఆహ్వానించారు. దీంతో అనతికాలంలోనే ఆయన ప్రేక్షకాదరణ బాగా పెరిగింది. ట్రంప్, ఇజ్రాయెల్, అర్జెంటీనా ప్రధానులు బెంజమిన్ నెతన్యాహు, జేవియర్ మిలెయ్, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు మస్క్, మార్క్ జుకెర్‌బర్గ్, జెఫ్ బెజోస్, శామ్ ఆల్ట్‌మన్, మాగ్నస్ కార్ల్‌సన్ వంటి ప్రముఖులతో పాడ్‌కాస్ట్‌లో సంభాషించారు. ప్రధాని మోదీతో 3గంటల సుదీర్ఘ సంభాషణ.. తన జీవితంలోనే శక్తిమంతమైన సంభాషణగా పేర్కొంటూ ఫ్రీడ్‌మన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీ స్పందిస్తూ.. ఆయనతో ఆసక్తిదాయక సంభాషణ జరిగిందన్నారు.

గుజరాత్ అల్లర్లపై తప్పుడు ప్రచారం

2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లపై తప్పుడు కథనాలు సృష్టించారు. కేంద్రంలోని నాటి నా రాజకీయ ప్రత్యర్థులు నన్ను శిక్షించాలని భావించారు. కానీ కోర్టులు నన్ను విముక్తి చేశాయి. 2002లో జరిగిన అల్లర్లే రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద ఘర్షణలుగా చూపేందుకు తప్పుడు సమాచారం వ్యాప్తిచేశారు. దానికి ముందు రాష్ట్రంలో తరచూ అల్లర్లు జరిగేవని తెలుస్తుంది. ఎక్కడో చోట కర్ఫ్యూలు ప్రకటించేవారు. 1969లో జరిగిన ఘర్షణలు 6 నెలలకుపైగా కొనసాగాయి. గుజరాత్ అసెంబ్లీకి నేను ఎన్నికైన మూడ్రోజులకే గోద్రాలో రైలు దహనం ఘటన జరిగింది. 1999లో కాందహార్ విమానం హైజాక్ ఘటన జరిగింది. 2000లో ఎర్రకోటపైన, మరుసటి ఏడాది పార్లమెంటుపైన దాడులు జరిగాయి. గోద్రా ఘటన అగ్నికణమై హింస ప్రజ్వరిల్లింది. ఈ వ్యవహారంలో తప్పుడు కథనాలు సృష్టించారు. వాటి ఆధారంగా నన్ను శిక్షించాలని నాడు అధికారంలో ఉన్న రాజకీయ ప్రత్యర్థులు భావించారు. కానీ కోర్టులు సమగ్రంగా దర్యాప్తు చేసి మేం నిర్దోషులమని గుర్తించింది.

తొలి బూట్లు..

నా చిన్నతనంలో నేను, నా అన్నదమ్ములు బూట్ల గురించి ఆలోచించేవాళ్లమే కాదు. మంచి మంచి బూట్లు వేసుకునేవారు అవి లేనప్పుడు బాధపడుతుంటారు. కానీ మేం మా జీవితంలో అవి వేసుకోలేదు. ఒకరోజు మా అంకుల్ నేను చెప్పుల్లేకుండా స్కూలుకు వెళ్లడం చూసి ఆశ్చర్యపోయాడు. రూ.10-12 ఖర్చుపెట్టిన తెల్ల కాన్వాస్ షూస్ కొనుక్కొచ్చాడు. అయితే వాటిని నీటుతా తుడవడం పెద్ద సవాల్. క్లాసురూంలో పడిపోయిన చాక్‌పీస్ ముక్కలు ఏరుకునేవాడిని. వాటిని నీటిలో ముంచి.. పేస్టులో కలిపి నా బూట్లు తెల్లగా కనిపించేలా పాలిష్ చేసేవాడిని. స్కూలు యూనిఫాం విషయంలోనూ అంతే. ఇస్త్రీ చేసుకోవడానికి రాగి పాత్రలో నీటిని వేడిచేసి పట్టకారుతో పట్టుకుని యూనిఫాంపై రుద్ది స్కూలుకు వేసుకుని వెళ్లేవాడిని. చాలా తక్కువ వనరులు ఉన్నప్పటికీ బాధపడేవాళ్లం కాదు.

ట్రంప్‌తో పరస్పర విశ్వాసం..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, నాకు మధ్య పరస్పర విశ్వాసం ఉంది. అన్నిటికంటే జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటాం కాబట్టి అది మమ్మల్ని బాగా కలిపింది. ఆయన ధైర్యవంతుడు. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటారు. అమెరికా పట్ల తిరుగులేని నిబద్ధత చూపుతారు. మొదటిసారి కంటే రెండోసారి ఆయన పూర్తిసన్నద్ధతతో వచ్చినట్టు కనబడుతోంది. తన లక్ష్యాలను చేరుకోవడానికి నిర్దిష్ట చర్యలతో కూడిన స్పష్టమైన ప్రణాళిక ఉంది. 2019 సెప్టెంబరులో హూస్టన్‌లోని ఎన్ఆర్‌జీ స్టేడియంలో నిర్వహించిన 'హౌడీ మోడీ' సభలో వేదికపై నేను ప్రసంగిస్తుంటే ట్రంప్ సభికులతో పాటు కూర్చుని సావధానంగా విన్నారు. స్టేడియంలో కలియదిరుగుదామని ట్రంప్‌ను నేను అడిగితే ఆయన మాత్రం నిస్సంకోచంగా అంగీకరించారు. గత ఏడాది ఎన్నికల ప్రచార సమయంలో తనపై కాల్పులు జరిపినా తట్టుకుని ధైర్యంగా ఉన్నారు. ఆయన జీవితం ఆయన దేశం కోసమే. నేను 'భారత్ ఫస్ట్' అని భావించినట్లే.. ఇది ఆయన 'అమెరికా ఫస్ట్' స్ఫూర్తి.

లోకం తీరు



ఐఎస్ఎస్‌ను చేరిన వ్యోమ నౌక

న్యూఢిల్లీ, మార్చి 16: స్పేస్ ఎక్స్ సంస్థ శనివారం ఫాల్కన్ 9 రాకెట్ సాయంతో నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించిన క్రూ డ్రాగన్ క్యాప్సూల్-10(వ్యోమ నౌక పేరు).. ఆదివారం 9.37గంటలకు(భారత కాలమానం ప్రకారం) ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. ఈ వ్యోమ నౌక ఐఎస్ఎస్‌కు అనుసంధానం కాగానే.. ఐఎస్ఎస్‌లో ఉన్న ఏడుగురు సిబ్బంది వ్యోమ నౌకలో ఉన్న నలుగురు వ్యోమగాములకు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ కూడా ఉన్నారు. వీరు ఇదే వ్యోమ నౌకలో భూమ్మీదకు రానున్నారు.

పాక్‌లో మిలిటరీ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి.. 90 మంది సైనికుల మృతి?

కరాచీ, మార్చి 16: పాకిస్థాన్‌లో బలూచ్ వేర్పాటువాదులు మరోసారి చెలరేగిపోయారు. ఆదివారం మిలిటరీ కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 90 మంది వరకు సైనికులు చనిపోయినట్టు ది బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ప్రకటించగా, 11 మంది సైనికులు చనిపోయారని, మరో 20 మందికిపైగా గాయాలపాలయ్యారని అధికారులు చెబుతున్నారు. బలూచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి టఫ్తాన్‌కు 8 బస్సుల కాన్వాయ్‌లో సైనికులు వెళ్తుండగా నోష్కీలో రోడ్డు పక్కన బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో ఒక బస్సు పూర్తిగా ధ్వంసమైంది.

నార్త్ మేసిడోయాలో నైట్ క్లబ్‌లో అగ్నిప్రమాదం.. 59 మంది మృతి

స్కోప్జే(నార్త్‌మెసిడోనియా), మార్చి 16: ఐరోపాలోని నార్త్ మెసిడోనియాలో ఉన్న పల్స్‌క్లబ్‌లో నైట్‌క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటనలో 59 మంది దుర్మరణంపాలయ్యారు. మరో 155 మంది గాయపడగా.. వారిలో 118 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాణసంచా వంటి పదార్థం కారణంగా మంటలు వ్యాపించినట్లు ఆ దేశ అధ్యక్షుడు సిల్యనోవాస్క చెప్పారు.

రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు

» అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధానిని ఆహ్వానించడానికి..

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు. ఏప్రిల్ నెలాఖరులో అమరావతి పనుల పునఃప్రారంభానికి మోదీని ఆహ్వానిస్తారు. ఈ భేటీ సందర్భంగా రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంకు నిధులతోపాటు పలు ఇతర అంశాలపై ప్రధానితో చంద్రబాబు చర్చించనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను సీఎం కలవనున్నారు.

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం మధ్నాహ్నం 3 గంటలకు సచివాలయంలో జరగనుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఈ భేటీలో సీఆర్డీయే అథారిటీలో ఆమోదించిన రూ.37,702 కోట్ల టెండర్ల పనులకు ఆమోదం తెలపనున్నారు. 4వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆమోదం తెలిపిన అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ అనంతరం వాటికి ఆమోదం తెలపనున్నారు.

తెలుగు వర్సిటీకి అమరజీవి పేరు కొనసాగించాలి

» ఎన్టీఆర్, కేబీఆర్, సంజీవరెడ్డి పేర్లను తీసే దమ్ముందా: సంజయ్

కరీంనగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/సిరిసిల్ల మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం సరికాదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో అన్నారు. దేశ భక్తుడు, గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆర్యవైశ్యుల ఆరాధ్య నేత అయిన గొప్ప వ్యక్తి పేరును తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సీపీఐ నాయకులు ప్రతిపాదిస్తే.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కులాభిమానంతో పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టారని తెలిపారు. ఆంధ్రా మూలాలు ఉన్నాయని పొట్టి శ్రీరాములు పేరును తొలగించారని.. ఎన్టీఆర్, కాసు బ్రహ్మానంద రెడ్డి, నీలం సంజీవరెడ్డి పేరిట ఉన్న పార్కుల పేర్లను తొలగించే దమ్ముందా..? అని ప్రశ్నించారు.

నేడు తెలంగాణ అసెంబ్లీకి వర్గీకరణ బిల్లు

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులను ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఎస్సీ వర్గీకరణ బిల్లును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ బిల్లులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టనున్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి.. రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే స్పష్టత ఉండడంతో ఆ బిల్లుపై సోమవారమే చర్చించి, ఆమోదించే అవకాశం కూడా ఉన్నట్టు సమాచారం.

400 కోట్ల పన్ను చెల్లించిన అయోధ్య రాముడు

అయోధ్య, మార్చి 16: అయోధ్యలోని రామ మందిరాన్ని నిర్వహిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు గత అయిదేళ్ల కాలంలో ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్లు పన్ను చెల్లించింది. 'ఆలయ పర్యాటకం' వృద్ధి చెందడమే ఇందుకు కారణమని ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ ఆదివారం తెలిపారు. ఇందులో రూ.270 కోట్లు జీఎస్టీగా, మిగిలిన రూ.130 కోట్లు ఇతర పన్నుల రూపంలో చెల్లించినట్టు వివరించారు.

షార్‌కు 'క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్' వాహనం

సూళ్లూరుపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మార్క్3 (ఎల్‌వీఎం3) వాహక నౌకలో వినియోగించే క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ (సీ25) ఆదివారం రాత్రి షార్‌కు చేరుకుంది. షార్ నుంచి బ్లూబర్డ్ బ్లాక్ 2 విదేశీ ఉపగ్రహాన్ని త్వరలోనే రోదసిలోకి పంపేందుకు ఒప్పందం కుదుర్చుకొన్నారు. ఈ మేరకు మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ)లో సీ25 క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌ను అనుసంధానించి సిద్ధం చేశారు. దీన్ని ప్రత్యేక వాహనంలో షార్‌కు తీసుకొచ్చేందుకు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ పచ్చజెండా ఊపి శ్రీహరికోటకు పంపారు.

రామచంద్రా.. ఏమిటీ అరాచకం..!

పెద్దిరెడ్డి ఆక్రమణలో బుగ్గ మఠం భూములు

» తిరుపతిలో ఇంటి పక్కనే 3.88 ఎకరాలు స్వాహా

» అధికారం పోయినా పవర్ తగ్గని పెద్దిరెడ్డి

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

తిరుపతిలోని మారుతీనగర్‌లో పెద్దిరెడ్డి నివాసానికి ఆనుకుని ఉత్తరం, తూర్పు, వాయవ్య దిశల్లో బుగ్గ మఠానికి భూములున్నాయి. అందులో పెద్దిరెడ్డి నివాసానికి ఉత్తరం, తూర్పు దిశల్లో 3.88 ఎకరాల మఠం భూములకు ఆయన కంచె వేసుకున్నారు. ఆ భూమిలో కార్యాలయ భవనం నిర్మించుకున్నారు. వాహనాల పార్కింగ్‌కు కొంత స్థలం వాడుతున్నారు. ఆక్రమించిన భూమిలో సుమారు మూడెకరాల భూమిని రెండు భాగాలుగా విభజించి మధ్యలో రోడ్డు వేసుకున్నారు. ఆ రోడ్డు రాయల్ నగర్ రోడ్డులో కలుస్తుంది. రెండు భాగాలుగా విభజించిన భూమిలో ఓవైపు గడ్డి పెంచుతుండగా, మరోవైపు గోశాల తరహాలో ఆవులు, మేకలు వంటి వాటి పోషణకు వినియోగిస్తున్నారు. ఆ భూమిలో బోరు కూడా ఉంది. ఆయన ఆక్రమణలో ఉన్న 3.88 ఎకరాల్లో.. సర్వే నంబరు 261-1లో 1.50 ఎకరాలు, సర్వే నంబరు 261-2లో 2.38 ఎకరాలు ఉన్నాయి. తిరుపతి నగరంలో అత్యంత కీలకమైన ప్రాంతంలో ఉన్న ఈ భూముల కనీస విలువ రూ.వంద కోట్లు.

ఆలయాలూ ఆక్రమించేశారు

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం ఉన్న ముత్యాలరెడ్డిపల్లె మారుతీనగర్‌లో ఉన్న బుగ్గమఠం భూముల్లోని 60 సెంట్ల స్థలంలో శివాలయం, మునీశ్వరాలయం, అక్కగార్ల గుడి, గుర్రప్ప స్వామి గుడి ఉన్నాయి. ఆలయాలతో సహా ఆ భూమంతా ఆక్రమణదారుల చేతుల్లోనే ఉన్నాయి. 2008 జనవరి ఒకటిన అప్పటి ఈవో ఈశ్వరయ్య మారుతీనగర్‌లోని శివాలయం సహా ఇతర ఆలయాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. అటెండర్‌ను, వాచ్‌మన్‌ను నియమించారు. భక్తులకు అర్చన తదితర పూజల కోసం టికెట్లు కూడా జారీ చేయించి ఆదాయం పెంచారు. ఇలా 11 నెలల పాటు 60 సెంట్ల స్థలం, అందులోని ఆలయాలూ మఠం నియంత్రణలో నడిచాయి. అంతే.. ఆయన బదిలీ అయిపోయారు. ఇక ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇప్పటికీ మఠం నియంత్రణలో లేవు. ఆలయాల బోర్డుల్లో కూడా అవి మఠానివని పేర్కొనడం లేదు.

సర్వేకు అనుమతించని అనుచరులు

బుగ్గ మఠం అధికారులు పెద్దిరెడ్డి ఆక్రమించిన భూములను సర్వే చేయించడానికి గతంలో ప్రయత్నం చేసి విఫలమయ్యారు. 2010లో దేవదాయ శాఖ తిరుపతి ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ నుంచీ సర్వేయర్‌ను వెంటబెట్టుకుని మఠం అధికారులు వెళ్లగా... పెద్దిరెడ్డి అనుచరులు ఆ భూముల్లోకి అడుగు పెట్టనివ్వలేదని సమాచారం. 2017లోనూ, అలాగే 2018లోనూ కూడా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయర్‌తో వెళ్లినా అదే పరిస్థితి ఎదురైందని మఠం వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వం మారినా అదే పరిస్థితి

2019-2024 నడుమ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రిగా కొనసాగడంతో అప్పట్లో మఠం అధికారులు కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోలేకపోయారు. కనీసం ఆ భూముల్లో అడుగు పెట్టడానికి కూడా సాహసించలేకపోయారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత కూడా అవే పరిస్థితులు కొనసాగుతుండడమే విచిత్రం. వాస్తవానికి గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చాక జూలై 29న మఠం భూములు సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని కోరుతూ తిరుపతి అర్బన్ తహశీల్దారుకు మఠం అధికారులు లేఖ రాశారు. అయితే అర్బన్ తహశీల్దారు స్పందించలేదు. తాజాగా గత నెలలో మరోసారి అర్బన్ తహశీల్దారుకు లేఖ రాసినా ఇప్పటి వరకూ సర్వే జరగలేదు. మఠం భూములు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలంటే అనివార్యంగా పెద్దిరెడ్డి ఇంటి ఆవరణ సహా ఆయన కంచె వేసి ఆక్రమించుకున్న మఠం భూముల్లో అడుగు పెట్టాల్సి ఉంటుంది. అందుకు ఎవరూ సాహసించడం లేదు. తమను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి భవిష్యత్తులో ఇబ్బందులకు గురి చేస్తారన్న భయం కిందిస్థాయి అధికారుల్లో, ఉద్యోగుల్లో బలంగా ఉంది. రాష్ట్రస్థాయి అధికారులు స్పందించి జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇస్తే తప్ప కనీసం సర్వే కూడా జరిగే సూచనలు కనిపించడం లేదు.



పెద్దిరెడ్డి కంచె వేసి ఆక్రమించుకున్న బుగ్గ మఠం భూములు

ఏమిటీ బుగ్గ మఠం..?

తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయ పరిసరాల్లో ఏర్పడిన రెండు సహజ నీటి బుగ్గలు గతంలో ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి అవసరాలు తీర్చేవి. వాటి నిర్వహణకు ఏర్పాటైన బుగ్గ మఠానికి చంద్రగిరి రాజులు భూములు దానమిచ్చారు. వాటిపై వచ్చే ఆదాయంతో భక్తులకు బస, భోజన సదుపాయాలను మఠం కల్పించేది. ప్రారంభంలో మఠాధిపతులు ఉన్నప్పటికీ కొన్ని దశాబ్దాల కిందటే ఆ పరంపర ఆగిపోయింది. ఆ స్థానంలో మహంతులు వచ్చారు. వారి హయాంలో భూములను కౌలుకు ఇచ్చారు. 1969లో బుగ్గమఠం ప్రభుత్వ దేవదాయ శాఖ ఆధీనంలోకి వచ్చింది. అప్పటికి మఠానికి గోవిందరాజస్వామి ఆలయంలో, వెలుపల నీటి బుగ్గలు, ఆలయంలో లక్ష్మీమండపం ఉండేవి. మఠంలో రామాలయం, కల్యాణ మండపం, మండపానికి అనుబంధంగా గదులు ఉండేవి. కార్యాలయ భవన సముదాయంలో 14 షాపింగ్ గదులుండేవి. ఇవి కాకుండా 123.43 ఎకరాల భూములుండేవి. అయితే మఠం ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాక 1969-1991 నడుమ 100.94 ఎకరాల భూములను విక్రయించారు. అవి పోనూ 22.49 ఎకరాల భూములు మఠం ఆధీనంలో ఉండాలి. అయితే ఈ మొత్తం భూములు ప్రస్తుతం ఇతరుల ఆక్రమణలో ఉన్నాయి.

ఆక్రమణలకు గురైన భూములివే..

తిరుపతి ముత్యాల రెడ్డిపల్లెలో 14.49 ఎకరాలు, వేశాలమ్మ గుడి వీధిలో 3.53 ఎకరాలు, మారుతీనగర్ చర్చి సమీపంలో ఒకచోట 1.08 ఎకరాలు, మరో చోట 2.38 ఎకరాలు, మల్లంగుంటలో 47 సెంట్లు, గోవిందరాజస్వామి దక్షిణ మాడ వీధిలో 47 సెంట్లు మఠానికి చెందిన భూములున్నాయి. ముత్యాలరెడ్డిపల్లెలో 14.49 ఎకరాలూ కౌలుదార్లుగా చెప్పుకొంటున్న కొందరు వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయి. వేశాలమ్మ గుడి వీధిలోని 3.53 ఎకరాలను స్థానికులు ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకునేశారు. సంబంధిత భూముల్లో 126 ఇళ్లు ఉన్నాయి. గోవిందరాజస్వామి గుడి దక్షిణ మాడవీధిలోని 47 సెంట్లు కూడా ఆక్రమణకు గురై ఇళ్లు కట్టుకునేశారు. మిగిలిన భూములు సైతం కౌలుదార్లుగా చెప్పుకొంటున్న వ్యక్తుల స్వాధీనంలో ఉన్నాయి. ఇక మారుతీనగర్‌లో 3.88 ఎకరాలను పెద్దిరెడ్డి ఆక్రమించారు. అవిలాల రోడ్డు విస్తరణలో అక్కడున్న 7 సెంట్ల భూమి పోయింది. దశాబ్దాలుగా బుగ్గ మఠం భూములు ఆక్రమణల పాలయ్యాయి. మిగిలిన కాస్తో కూస్తో కూడా దక్కించుకునే స్థితిలో మఠం లేదు.

గుడిలోకి ఇంటి నుంచి గేటు

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటి ఆవరణ ఆనుకునే బుగ్గ మఠానికి చెందిన భూములు, అందులో ఆలయాలు ఉన్నాయి. గుడి ఆవరణలోకి వెళ్లేందుకు తన ఇంటి నుంచే ప్రత్యేకంగా ఒక గేటును ఆయన ఏర్పాటు చేసుకున్నారు.



ఇతరుల నిర్వహణలో నడుస్తున్న శివాలయం



పెద్దిరెడ్డి ఇంటి ఆవరణ నుంచి గుడిలోకి వెళ్లేందుకు గేటు ఏర్పాటు చేసిన దృశ్యం

హైకోర్టు ఉత్తర్వులు రాగానే స్వాధీనం

తిరుపతి మారుతీనగర్‌లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంచె వేసి ఆక్రమించుకున్న మఠం భూమికి సంబంధించి.. సర్వే నంబరు 261-1లోని 1.50 ఎకరా భూమి విషయంలో హైకోర్టు రెండు వారాలు గడువు ఇచ్చింది. అందువల్ల ప్రస్తుతానికి దానిని మినహాయించి సర్వే నంబరు 261-2లోని 2.38 ఎకరాల భూమిపై దృష్టి పెడుతున్నాం. ఆ భూమి తనదని మాజీ మంత్రి హైకోర్టులో ఎలాంటి ఆధారాలూ చూపలేకపోయారు. దీంతో మొదట ఆ భూమిని స్వాధీనం చేసుకోవాల్సివుంది. హైకోర్టు ఉత్తర్వుల కాపీ కోసం దరఖాస్తు చేస్తున్నాం. అందగానే భూమి స్వాధీనానికి చర్యలు తీసుకుంటాం.

- బుగ్గ మఠం ఈవో వెంకటేశ్వర్లు

సర్వే చేయిస్తాం

బుగ్గ మఠం అధికారులు సర్వే కోరుతూ జూలైలో లేఖ రాసిన సంగతి నాకు తెలియదు. అప్పటికి నేను తిరుపతి అర్బన్‌లో బాధ్యతలు చేపట్టలేదు. మూడు రోజుల కిందట మాత్రం సర్వే కోసం లేఖ వచ్చినట్టు ఉంది. పరిశీలించి త్వరగా సర్వే చేయించి మఠం భూములకు హద్దులు చూపిస్తాం.

- తిరుపతి అర్బన్ తహశీల్దారు భాగ్యలక్ష్మి

ఫ్యామిలీ ఉండాల్సిందే!


విరాట్ కోహ్లీ

బెంగళూరు: ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా వైఫల్యం తర్వాత ఆటగాళ్లపై బీసీసీఐ కఠిన ఆంక్షలను అమలు చేస్తోంది. ఇందులో ప్లేయర్స్ వెంట కుటుంబ సభ్యుల బసపై పరిమితి కూడా ఉంది. 45 రోజులకుపైగా విదేశీ పర్యటన ఉంటే కుటుంబ సభ్యులు కేవలం రెండు వారాలపాటు మాత్రమే ఉండేందుకు అనుమతిస్తారు. అయితే ఈ నిర్ణయంపై విరాట్ కోహ్లీ అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'మైదానంలో కఠిన పరిస్థితులు ఏర్పడినప్పుడు కుటుంబ సభ్యులతో గడిపితే సాంత్వనగా ఉంటుంది. అలాంటి వేళ వారి మద్దతు అవసరమే. ఏ క్రికెటర్‌ను అడిగినా ఇదే చెబుతాడు. మ్యాచ్ ఆడాక రూమ్‌కి వెళ్లి ఒంటరిగా, ఎవరితోనూ మాట్లాడకుండా ఉండలేను. క్రికెట్ ఆడడం మా బాధ్యత. అదయ్యాకే కుటుంబం గురించి ఆలోచిస్తాం. నేనైతే ఫ్యామిలీతో ఎంజాయ్ చేసే సమయాన్ని వదులుకోను' అని విరాట్ తేల్చాడు.

తిండిపై చర్చ ఎందుకు?: తన వ్యక్తిగత విషయాలపై బ్రాడ్‌కాస్టర్లు చర్చించాల్సిన అవసరం లేదని కోహ్లీ స్పష్టం చేశాడు. "బ్రాడ్‌కాస్ట్ షోలో క్రికెట్ గురించే మాట్లాడుకోవాలి కానీ 'విరాట్ నిన్న లంచ్‌లో ఏం తిన్నాడు? అతడికిష్టమైన ఛోలే భటూరే ఢిల్లీలో ఎక్కడ దొరుకుతుందనే విషయాలపై చర్చ అనవసరమ"ని కోహ్లీ సూచించాడు.


శాంసన్ వస్తున్నాడు..



బెంగళూరు: ఐపీఎల్ ఆరంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్ అభిమానులకు శుభవార్త. ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్ చేతివేలి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఈమేరకు అతడికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందింది.

ఆస్ట్రేలియన్ జీపీ విజేత నోరిస్

» హామిల్టన్‌కు పదో స్థానం



మెల్‌బోర్న్: వరల్డ్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కు ఝలక్ ఇచ్చిన మెక్ లారెన్ ఎఫ్1 డ్రైవర్ లాండో నోరిస్ ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రీ విజేతగా నిలిచాడు. వర్షంతోపాటు నాటకీయ పరిణామాలు చోటు చేసుకొన్న రేసులో పోల్‌పొజిషన్ నుంచి ఫైనల్ రేసును ఆరంభించిన నోరిస్ కేవలం 0.895 సెకన్ల తేడాతో రెడ్‌బుల్‌కు చెందిన వెర్‌స్టాపెన్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ మూడోస్థానం దక్కించుకొన్నాడు. కాగా, ఫెరారీ తరఫున తొలిసారి బరిలోకి దిగిన ఏడుసార్లు చాంపియన్ లూయిస్ హామిల్టన్ 10వ స్థానంలో నిలిచాడు. ఫెరారీ టీమ్ వ్యూహాత్మక తప్పిదాలతో రేసును ఓడాల్సి వచ్చిందని హామిల్టన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు.

ఆఖరి రోజు 12 పతకాలు

ప్రపంచ శీతాకాల క్రీడలు

ట్యూరిన్ (ఇటలీ): ప్రత్యేక ఒలింపిక్స్ ప్రపంచ శీతాకాల క్రీడల ఆఖరి రోజు పోటీల్లో భారత్ క్రీడాకారులు పన్నెండు పతకాలు కైవసం చేసుకున్నారు. ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో భారత్ ఎనిమిది స్వర్ణాలు సహా మొత్తం 33 పతకాలు సాధించింది. ఆఖరి రోజు జరిగిన 25 మీటర్ల స్నోషూయింగ్‌లోని వివిధ విభాగాల్లో భారత్ పతకాలు గెల్చుకుంది.

పాక్ జట్టు కంటే భారత్ మెరుగు

ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: పాకిస్థాన్ కంటే భారత క్రికెట్ జట్టు మెరుగైనదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఆదివారం లెక్స్ ఫ్రిడ్‌మన్ అనే అమెరికా పాడ్‌కాస్టర్ నిర్వహించిన చర్చలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెక్స్ అడిగిన పలు క్రీడాసంబంధిత ప్రశ్నలకు మోదీ తనదైన శైలిలో బదులిచ్చారు. తాను క్రీడల్లో నిష్ణాతుడిని కాదని, సాంకేతిక అంశాలు తనకు తెలియదని, అయితే తాజాగా ముగిసిన చాంపియన్స్ ట్రోఫీ ఫలితాల ఆధారంగా పాక్ కంటే భారత్ జట్టు మెరుగైందని చెప్పగలనని మోదీ అన్నారు. ప్రపంచంలో గొప్ప ఫుట్‌బాలర్ ఎవరని వ్యాఖ్యాత అడగ్గా.. 80వ దశకంలో డీగో మారడోనాను మించిన వారు లేరు. ఈ తరంలో లియోనెల్ మెస్సీ గొప్ప ఆటగాడని మోదీ చెప్పారు. భారత్‌లోనూ ఫుట్‌బాల్‌కు ఆదరణ పెరిగిందన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఓ చిన్న పట్టణంలో ఫుట్‌బాల్‌కున్న ఆదరణ చూసిన ఆశ్చర్యపోయానని అన్నారు. 'క్రీడలు ప్రజలను దగ్గర చేస్తాయి. ప్రపంచ మొత్తాన్ని ఉత్తేజపరిచే శక్తి క్రీడలకు ఉంది. దేశాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తి ప్రజలను దగ్గర చేయగలదు. మానవ పరిణామ క్రమంలో క్రీడలు కీలక పాత్ర పోషించాయి' అని మోదీ చెప్పారు.

ఆరో టైటిల్ వేటలో..



ధోనీ, కెప్టెన్ రుతురాజ్

పునర్వైభవం కోసం ముంబై..

● పాండ్యా కెప్టెన్సీకి పరీక్ష


రోహిత్, కెప్టెన్ హార్దిక్

గతేడాది కెప్టెన్సీ మార్పు.. పేలవ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన ముంబై ఇండియన్స్ ఈసారి అసలుసిసలు సత్తా చాటాలనుకొంటోంది. ఐదుసార్లు మెగా లీగ్ విజేతగా నిలిచిన ముంబై.. రికార్డుస్థాయిలో ఆరో టైటిల్‌పై గురిపెట్టింది. రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాను సారథిగా ప్రకటించడంతో అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలో పాండ్యాకు అవహేళనలు కూడా ఎదురయ్యాయి. అయితే, ఆ తర్వాత జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడంలో హార్దిక్ కీలకపాత్ర పోషించాడు. తాజాగా చాంపియన్స్ ట్రోఫీలో కూడా ఆకట్టుకోవడంతో.. ఈసారి ఫ్యాన్స్ అండగా నిలుస్తారని భావిస్తున్నారు. గత సీజన్ చివరి మ్యాచ్‌లో స్లోఓవర్ రేట్ కారణంగా పాండ్యాపై ఒక మ్యాచ్ వేటుపడింది. దీంతో ఈ 18వ అంచెలో తొలి మ్యాచ్‌కు అతడు దూరం కానుండడంతో.. తాత్కాలికంగా రోహిత్ జట్టును నడిపించే అవకాశం ఉంది. మెగా వేలం తర్వాత జరుగుతున్న లీగ్ కావడంతో జట్టు కుదురుకోవడానికి కొంత సమయం పట్టనుంది. వెన్నునొప్పితో బాధపడుతున్న స్టార్ పేసర్ బుమ్రా ఆలస్యంగా బరిలోకి దిగే చాన్సులున్నాయి. రోహిత్, హార్దిక్, బుమ్రా, సూర్యకుమార్, తిలక్ వర్మ కోర్ టీమ్. బ్యాటర్లు ర్యాన్ రికెల్టన్ (దక్షిణాఫ్రికా), రాబిన్ మిన్జ్ ఈసారి ప్రత్యేక ఆకర్షణ. ట్రెంట్ బౌల్ట్, శాంట్నర్, రీస్ టోప్లే, విల్ జాక్స్, బెవాన్ జాకబ్స్‌తో టీమ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. బ్యాటింగ్‌లో జట్టు ఎంతో బలంగా ఉంది. తరచూ గాయపడే దీపక్ చాహర్ పేస్ భారాన్ని ఏమేరకు మోస్తాడో చూడాలి. ఏడు, ఎనిమిది స్థానాల్లో సరైన ఫినిషర్ లేని లోటు కనిపిస్తోంది.

ముంబై జట్టు

బ్యాటర్లు: రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, బెవాన్ జాకబ్స్, రాబిన్ మిన్జ్, నమన్ ధిర్, రికెల్టన్, కృష్ణన్ శ్రీజిత్
ఆల్ రౌండర్లు: హార్దిక్ పాండ్యా, రాజ్ బవా, కార్బిన్ బాష్, విల్ జాక్స్, శాంట్నర్, తిలక్ వర్మ
బౌలర్లు: జస్‌ప్రీత్ బుమ్రా, అశ్విన్ కుమార్, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, ముజిబుర్ రహ్మాన్, విఘ్నేష్ పుతుర్, సత్యనారాయణ రాజు, కర్ణ్ శర్మ, అర్జున్ టెండూల్కర్, రీస్ టోప్లే.

ధోనీకి ఘనంగా గుడ్‌బై చెప్పాలి!

ఆల్‌రౌండర్ల అండతో సీఎస్‌కే

ఐపీఎల్ చరిత్రలో అత్యంత నిలకడైన జట్టు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే). ధోనీ చివరి లీగ్‌గా భావిస్తున్న నేపథ్యంలో యువ తరం ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేలం తర్వాత జట్టులో భారీ మార్పులు రావడంతో.. కుదురుకోవడానికి కొంత సమయంపట్టే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే ఈసారి ఆల్‌రౌండర్లపైనే చెన్నై ఎక్కువగా ఆధారపడేలా కనిపిస్తోంది. మహీ టీమ్‌లో ఉంటే ఫ్యాన్స్‌కు ఉండే జోషే వేరు. అతడిపై భారం లేకుండా చూడాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఓవరాల్‌గా ముంబైతో సమంగా ఐదు టైటిళ్లు సాధించిన చెన్నై.. ఈసారి టైటిల్‌తో ధోనీకి ఘనంగా వీడ్కోలు పలకాలనుకొంటోంది. గత సీజన్‌లో ఐదో స్థానంలో నిలిచిన సీఎస్‌కే ప్లేఆఫ్స్ బెర్త్‌ను త్రుటిలో చేజార్చుకొంది. కాగా, రుతురాజ్ గైక్వాడ్ బ్యాటర్‌గా ఆకట్టుకొంటున్నా.. కెప్టెన్‌గా ధోనీ స్థాయిని అందుకోలేక పోతున్నాడు. ధోనీ, జడేజా దూరమైతే ఇప్పుడిప్పుడే ఆలోటును భర్తీ చేయడం కష్టమే..! కాన్వే, రచిన్ రవీంద్ర, గైక్వాడ్, ధోనీతో జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. అయితే, మ్యాచ్ విన్నరైన పేసర్ లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. అశ్విన్, శివం దూబే, రవీంద్ర జడేజా లాంటి ఆల్‌రౌండర్లతో మిడిలార్డర్ బలంగా ఉంది. పేస్ బౌలింగ్ విభాగంలో మహీశ్ పతిరన, ఖలీల్ అహ్మద్, సామ్ కర్రాన్, నాథన్ ఎల్లీస్ జట్టులో ఉన్నారు.

చెన్నై జట్టు

బ్యాటర్లు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), డెవాన్ కాన్వే, ధోనీ, రాహుల్ త్రిపాఠి, వన్ష్ బెడీ, రషీద్
ఆల్ రౌండర్లు: రవీంద్ర జడేజా, శివం దూబే, రవిచంద్రన్ అశ్విన్, రచిన్ రవీంద్ర, అన్షుల్ కాంబోజ్, సామ్ కర్రాన్, దీపక్ హుడా, జేమీ ఓవర్టన్, విజయ్ శంకర్, రామకృష్ణ ఘోష్, కమలేష్ నాగర్‌కోటి, ముకేష్ చౌదరి
బౌలర్లు: పతిరన, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్, గుర్‌జప్‌నీత్ సింగ్, నాథన్ ఎల్లీస్, శ్రేయాస్ గోపాల్.

పాక్ 91 ఆలౌట్

కివీస్ చేతిలో చిత్తు

క్రైస్ట్‌చర్చ్: చాంపియన్స్ ట్రోఫీలో దారుణ వైఫల్యంతో ఇంటా బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాక్ జట్టుకు తాజాగా మరో పరాభవం. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో పాక్ 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. రిజ్వాన్, బాబర్ ఆజమ్‌లపై వేటు వేసి మరీ ఎంపిక చేసిన ఈ జట్టు ముందుగా బ్యాటింగ్‌కు దిగి 18.4 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. 11/4తో ఇబ్బందుల్లో పడిన జట్టు ఖుష్దిల్ (32) పోరాటంతో ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. ఎనిమిది మంది బ్యాటర్లు పది పరుగుల్లోపే అవుటయ్యారు. జేకబ్ డఫీకి నాలుగు (4/14), మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ జేమిసన్‌కు మూడు (3/8), సోధికి రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో కివీస్ 10.1 ఓవర్లలో 92/1 స్కోరుతో గెలిచింది.

ఇండియాదే 'మాస్టర్స్'

చెలరేగిన రాయుడు

ఫైనల్లో విండీస్ ఓటమి




రాయుడు (74)


రాయ్‌పూర్: అంబటి రాయుడు (74) అదరగొట్టడంతో అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్) తొలి సీజన్‌లో ఇండియా మాస్టర్స్ విజేతగా నిలిచింది. ఆదివారం వెస్టిండీస్ మాస్టర్స్‌తో జరిగిన ఫైనల్లో 6 వికెట్ల తేడాతో సచిన్ సేన గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లారా సేన 20 ఓవర్లలో 7 వికెట్లకు 148 పరుగులు చేసింది. లెండిల్ సిమ్మన్స్ (57), ఓపెనర్ డ్వేన్ స్మిత్ (45) మాత్రమే రాణించారు. వినయ్ కుమార్‌కు మూడు, షాబాజ్ నదీమ్‌కు రెండు వికెట్లు పడ్డాయి. ఆ తర్వాత ఛేదనలో ఇండియా మాస్టర్స్ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 149 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాయుడు, సచిన్ ఆరంభం నుంచే ఎదురుదాడి ఆరంభించారు. ముఖ్యంగా రాయుడు స్ట్రయిక్ ఎక్కువగా తీసుకుని భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు. అటు ఉన్న కాసేపు సచిన్ తన మాస్టర్ క్లాస్ ఆటతీరుతో అభిమానులను అలరించాడు. థర్డ్ మ్యాన్ దిశగా బాదిన ఓ ఫోర్, సిక్సర్ చూశాక సచిన్‌లో సత్తా ఏమాత్రం తగ్గలేదనిపించింది. ఎనిమిదో ఓవర్‌లో తను అవుట్ కావడంతో తొలి వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో ఎండ్‌లో రాయుడు వరుస బౌండరీలతో చెలరేగుతూ 34 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే 15వ ఓవర్‌లో అతడు వెనుదిరిగినా అప్పటికే విజయం ఖాయమైంది. చివర్లో బిన్నీ (16 నాటౌట్) దూకుడుతో 17 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్ మాస్టర్స్: 20 ఓవర్లలో 148/7 (సిమ్మన్స్ 57, స్మిత్ 45; వినయ్ 3/26, నదీమ్ 2/12);
ఇండియా మాస్టర్స్: 17.1 ఓవర్లలో 149/4. (రాయుడు 74, సచిన్ 25; నర్స్ 2/22)

'మెటల్ కింగ్' అనిల్ అగర్వాల్

పట్టుదలతో శిఖరాగ్రానికి



అనిల్ అగర్వాల్. భారత పారిశ్రామిక సామ్రాజ్యంలో ఈ పేరు తెలియని వారుండరు. పాట్నాకు చెందిన ఈ పారిశ్రామిక దిగ్గజం అంతర్జాతీయంగా 'మెటల్ కింగ్'గా పేరు ప్రతిష్ఠలు గడించారు. జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నా తట్టుకుంటూ ప్రస్తుతం 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.34,800 కోట్లు) నికర ఆస్తులతో ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా ఎదిగి, ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రేరణగా నిలిచారు. ఆయనే వేదాంత రిసోర్సెస్ అధినేత అనిల్ అగర్వాల్.

కుటుంబ నేపథ్యం : అనిల్ అగర్వాల్ 1954 జనవరి 24న బిహార్ రాజధాని పాట్నాలో ఒక మార్వాడి కుటుంబంలో జన్మించారు. తండ్రి ద్వారకా ప్రసాద్ అగర్వాల్‌కు ఒక చిన్న అల్యూమినియం కండక్టర్ల తయారీ వ్యాపారం ఉండేది. పాట్నాలోని మిల్లర్ హైస్కూల్‌లో అనిల్ హైస్కూలు విద్య పూర్తి చేశారు. ఆ పై చదువులకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. దాంతో తండ్రి బిజినెస్‌లో చేరాలని ఉన్నా అప్పటికే ఆ వ్యాపారం గాలిలో దీపంలా మారింది.

ముంబై పయనం: ఇక ఏదైతే అదవుతుందని ప్రయాణ ఖర్చులకు సరిపడా డబ్బులతో అనిల్ ముంబై రైలెక్కారు. పొట్టకూటి కోసం అక్కడ అనేక చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. చివరికి ఒక స్ర్కాప్ (లోహాల తుక్కు) డీలర్ వద్ద పని చేస్తూ, ఆ వ్యాపారాన్ని ఔపోసన పట్టి, 1976లో తానే స్ర్కాప్ బిజినెస్ ప్రారంభించారు. ముంబైతో పాటు ఇతర రాష్ట్రాల్లోని కేబుల్ కంపెనీల నుంచి స్ర్కాప్ కొని, దాన్ని కరిగించి మెటల్‌గా మార్చి ముంబైలోని వివిధ కంపెనీకు అమ్మడం ప్రారంభించారు.

పారిశ్రామికవేత్తగా : ఈ స్ర్కాప్ బిజినెస్ చేస్తూనే అగర్వాల్ మరింత ఎదిగేందుకు బుర్రకు పదును పెట్టారు. 1976లో బ్యాంకు లోన్‌తో షంషేర్ స్టెర్లింగ్ కార్పొరేషన్ అనే కంపెనీని కొనుగోలు చేసి ఎనామిల్డ్ కాపర్ సహా అనేక ఉత్పత్తులు తయారు చేసి అమ్మడం ప్రారంభించారు. పదేళ్ల పాటు ఈ రెండు వ్యాపారాల్ని నెట్టుకొచ్చారు. తర్వాత 1986లో జెల్లీఫిల్డ్ కేబుల్స్ తయారీ కోసం స్టెరిలైట్ ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ బిజినెస్ లాభ నష్టాలు కీలక ముడి పదార్థాలైన రాగి, అల్యూమినియంపై ఆధారపడి ఉండేవి. దాంతో 1993లో దేశంలోనే తొలిసారిగా ప్రైవేటు కాపర్ స్మెల్టర్, రిఫైనరీని ఏర్పాటు చేశారు. 1995లో ఖాయిలా పడిన మద్రాస్ అల్యూమినియం కంపెనీని, 2001లో ప్రభుత్వ రంగంలోని భారత్ అల్యూమినియం కంపెనీని (బాల్కో) కొనుగోలు చేసి కీలక ముడి పదార్థాలైన కాపర్, అల్యూమినియం ధరలు తగ్గించుకున్నారు. 2002లో మరో ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్) ఈక్విటీలోనూ మెజారిటీ వాటా 65 శాతం కొని లోహాల రంగంలో పట్టు పెంచుకున్నారు.

అంతర్జాతీయ మార్కెట్లకు: 2003లో తన గ్రూప్ ప్రధాన కంపెనీ వేదాంత రిసోర్సెస్ షేర్లను లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టు చేశారు. ప్రస్తుతం ఈ గ్రూప్ ద్వారానే అనిల్ అగర్వాల్ దేశ, విదేశాల్లోని తన ఖనిజ, మెటల్ కంపెనీలను నిర్వహిస్తున్నారు.

సవాళ్లు : అనిల్ అగర్వాల్ వ్యాపారంలో చాలా సవాళ్లే ఎదుర్కొన్నారు. తమిళనాడు తూత్తుకుడిలోని స్టెరిలైట్ ఇండస్ట్రీస్ కాపర్ స్మెల్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ పేరుతో మూసివేయడం అతి పెద్ద సవాలు. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లో రాగి, అల్యూమినియం ధరలు పడిపోయాయి. దాంతో కంపెనీ అప్పుల చెల్లింపుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. కొన్ని ఆర్థిక సంస్థలు అప్పుల చెల్లింపు గడువు పొడిగించగా కొన్ని కుదరదన్నాయి. దాంతో ఆ అప్పులు చెల్లించేందుకు అధిక వడ్డీతో కొత్త అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితి చూసి, ఇంకేముంది వేదాంత మరో దివాలా కంపెనీ కాబోతోందనే వార్తలు గుప్పుమన్నాయి.

కొత్త రంగాల్లోకి : ఈ సవాళ్లను తట్టుకుని వేదాంత గ్రూప్ ఇప్పుడు సెమీ కండక్టర్లతో సహా అనేక కొత్త రంగాల్లోకి విస్తరిస్తోంది. రాజస్థాన్‌లోని తన చమురు, గ్యాస్ క్షేత్ర ఉత్పత్తి సామర్థ్యాన్నీ మరింత పెంచుతోంది. ఏదేమైనా అనిల్ అగర్వాల్ వ్యాపార నైపుణ్యాలు, పట్టుదలే ఈ రోజు వేదాంతా గ్రూప్‌ను ప్రముఖ అంతర్జాతీయ లోహాల కంపెనీగా నిలబెట్టాయి. ఈ విధంగా అగర్వాల్ ఎంతోమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్గదర్శిగా నిలిచారు.

ఎఫ్‌పీఐ నిధులకు రెక్కలు

» రెండున్నర నెలల్లోనే రూ.1.42 లక్షల కోట్లు తరలింపు
» మార్చిలో 15 రోజుల్లోనే రూ.30,000 కోట్లు..

న్యూఢిల్లీ: దేశీయ ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ యథేచ్ఛగా సాగుతోంది. ప్రపంచ స్థాయిలో వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో మార్చి నెల తొలి 15 రోజుల కాలంలో (13వ తేదీ నాటికి) వారు రూ.30,015 కోట్ల నిధులు తరలించుకుపోయారు. ఎఫ్‌పీఐలు జనవరి నెలలో రూ.78,027 కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్లు తరలించుకుపోవడంతో నూతన సంవత్సరంలో తొలి రెండున్నర నెలల కాలంలోనే వారు తరలించుకుపోయిన సొమ్ము మొత్తం రూ.1.42 లక్షల కోట్లకు చేరింది. ఎఫ్‌పీఐలు నికరంగా నిధులు ఉపసంహరించడం వరుసగా ఇది 14వ వారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అస్థిరతలు, టారిఫ్‌ల ద్వారా ఏర్పడిన మాంద్యం కారణంగా వర్తమాన మార్కెట్ల విషయంలో ఎఫ్‌పీఐలు అప్రమత్త వైఖరి అనుసరిస్తున్నాయి. దీనికి తోడు డాలర్ బలపడడం, అమెరికన్ బాండ్లలో రాబడులు పెరగడంతో అమెరికాలో పెట్టుబడులు వారికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులంటున్నారు. 2025 సంవత్సరంలో ఇతర మార్కెట్లతో పోల్చితే చైనా మార్కెట్లు మెరుగ్గా ట్రేడవుతున్నందు వల్ల దేశం నుంచి ఎఫ్‌పీఐ నిధులు చైనాకు తరలిపోతున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ అన్నారు.

హైదరాబాద్‌లో యాపిల్ ఎయిర్‌పాడ్స్ తయారీ

న్యూఢిల్లీ: అమెరికా టెక్ దిగ్గజం యాపిల్ కంపెనీ ఉత్పత్తి మ్యాప్‌లో హైదరాబాద్ చేరబోతోంది. హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ యూనిట్‌లో ఏప్రిల్ నుంచి యాపిల్ 'ఎయిర్ పాడ్స్' తయారీ ప్రారంభం కానుంది. స్థానిక మార్కెట్ కోసంగాక పూర్తిగా ఎగుమతుల కోసం కంపెనీ ఈ ఎయిర్‌పాడ్స్ తయారు చేయించనుంది. ఐఫోన్ల తర్వాత యాపిల్ కంపెనీ మన దేశంలో తయారు చేసే రెండో ఉత్పత్తి ఎయిర్‌పాడ్స్ కావడం విశేషం.

ఇళ్ల ధరలు మరింత పెరుగుతాయ్...

» క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమన్ ఇరానీ

న్యూఢిల్లీ: ఇటీవల బడ్జెట్లో ప్రకటించిన చర్యలతో పాటు, ఆర్‌బీఐ రెపో కోత ప్రభావంతో దేశంలో ఇళ్ల డిమాండు బలంగానే ఉంటుందని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమన్ ఇరానీ అన్నారు. దేశంలో ఇళ్ల డిమాండు మందగించే సంకేతాలేవీ లేవని ఆయన తేల్చి చెప్పారు. అయితే మార్కెట్లో కాలానుగుణంగా ఏర్పడే స్వల్పకాలిక ఆటుపోట్ల గురించి చింతించాల్సిన పని లేదన్నారు. ఈ ఏడాది ఇళ్ల ధరల్లో వృద్ధి ద్రవ్యోల్బణానికి దీటుగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రధానంగా మౌలిక వసతులపై దృష్టి సారిస్తోందని; ఫలితంగా గృహనిర్మాణం, కార్యాలయం, మాల్స్, వేర్‌హౌసింగ్ రంగాల్లో నూతన అవకాశాలు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు.

బిజినెస్

22,100 దిగువన బేరిష్

(మార్చి 17-21 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్నికల్ వ్యూ

నిఫ్టీ : 22397 (-156)

గత వారంలో నిఫ్టీ 22675-21314 పాయింట్ల మధ్యన కదలాడి 156 పాయింట్ల నష్టంతో 22397 వద్ద ముగిసింది. రాబోయే వారాంతంలో 22100 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

20, 50, 100, 200 డిఎంఏలు 22446, 22447, 22440, 22836 వద్ద ఉన్నాయి.

బ్రేకౌట్ స్థాయి : 22600
బ్రేక్ డౌన్ స్థాయి : 22100
నిరోధ స్థాయిలు : 22500, 22600, 22700 (22400 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 22200, 22100, 22000 (22300 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన : వారం ప్రారంభ స్థాయి కీలకం. ఆ పైన మాత్రమే పొజిషన్లు శ్రేయస్కరం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	425
వరంగల్	397	గోదావరి	405
చిత్తూరు	443	విశాఖపట్నం	405
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	83	విజయవాడ	87
వరంగల్	83	గుంటూరు	87
కరీంనగర్	83	ఒంగోలు	87
మహబూబ్‌నగర్	83	చిత్తూరు	92
కర్నూలు	83	నెల్లూరు	97
విశాఖపట్నం	81	అనంతపురం	97
గోదావరి	87		

అప్రమత్తతే మంచిది

పుంజుకుంటున్న దేశ ఆర్థిక వ్యవస్థ, ఏప్రిల్‌లో ఆర్‌బీఐ కీలక రెపోరేటు మరో పావు శాతం తగ్గిస్తుందన్న అంచనాలు మార్కెట్లో పాజిటివ్ సెంటిమెంట్‌ను పెంచుతున్నాయి. మరోవైపు డోనాల్డ్ ట్రంప్ సుంకాల భయం మార్కెట్‌ను ఇంకా వెంటాడుతోంది. దీంతో ఈ వారంలో కూడా మన మార్కెట్ మిశ్రమంగానే చలించే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు మరింత దిగజారితే మాత్రం సూచీల్లో మరింత కుదుపు తప్పకపోవచ్చు. ఈ కరెక్షన్‌లోనూ కొన్ని మెటల్, కమోడిటీస్, ఫైనాన్స్ కంపెనీల షేర్లు కొంత బలం ప్రదర్శిస్తున్నాయి. దీర్ఘకాలిక లాభాల కోసం చూసే మదుపరులు ప్రస్తుతం ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్న మంచి కంపెనీల షేర్లలో పెట్టుబడులు ప్రారంభించవచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

డీమార్ట్ : జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి ఈ కంపెనీ షేర్లు ఇప్పటికే 40 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం ఈ షేర్లలో అక్యూములేషన్ జరుగుతోంది. ఈ సంవత్సరం ప్రారంభం నుంచే ఈ కౌంటర్‌లో చక్కటి బేస్ ఏర్పడింది. గత ఏడు సెషన్స్‌లో డీమార్ట్ షేర్లు 15 శాతం మేర పెరిగి గత వారం రూ.3,797 వద్ద ముగిశాయి. రూ.4,250 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.3,650ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆర్ఈసీ లిమిటెడ్ : గత ఏడాది జూలై నుంచి డౌన్ ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. గత వారమే రెసిస్టెన్స్‌ను బ్రేక్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే మాత్రం కొద్దిగా బలహీనంగానే ఉంది. గత వారం రూ.406 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.455 టార్గెట్‌తో రూ.400/390 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.384ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పాటించాలి.

వరుణ్ బేవరేజెస్ లిమిటెడ్ : కొద్ది నెలలుగా ఈ కౌంటర్ డౌన్‌ట్రెండ్‌లో ఉంది. వేసవి ప్రారంభం కావడంతో కంపెనీ షేర్లపై మదుపరులకు మళ్లీ ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు ఆకర్షణీయమైన ధరల్లోనే లభిస్తున్నాయని చెప్పాలి. గత వారం రూ.488 వద్ద ముగిశాయి. రూ.575 టార్గెట్‌తో మదుపరులు రూ.475 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.450.

అదానీ గ్రీన్ : ఈ కంపెనీ షేర్లు మరోసారి కీలక స్థాయి రూ.870 వద్ద మద్దతు తీసుకున్నాయి. గత త్రైమాసికంలో అమ్మకాలు తగ్గినా అదానీ గ్రీన్ ఈపీఎస్ పెంచుకుంది. గురువారం రూ.873 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,050 టార్గెట్‌తో రూ.840 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.810ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

చెన్నై పెట్రో : కొద్ది నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్నఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కోలుకుంటున్నట్టు కనిపిస్తున్నాయి. రూ.440 వద్ద భారీ వాల్యూమ్స్‌తో వీ షేప్ రికవరీ కనిపిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే గత నెల 10.27 శాతం, గత వారం 8.18 శాతం మేర పెరిగాయి. గత వారం రూ.570 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.700 టార్గెట్‌తో రూ.550 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.525ను స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ప్రధాన నిరోధం 22,700

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తదుపరి నిరోధం 22700 వరకు వెళ్లి రియాక్షన్‌కు గురైనా ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయి 22000 కన్నా చాలా పైన క్లోజయింది. తక్షణ ముప్పు లేదనేందుకు ఇది సంకేతం. గత మూడు వారాలుగా సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ధోరణిలో 22700-22000 పాయింట్ల మధ్యన కదలాడుతోంది. అమెరికా మార్కెట్లో గత శుక్రవారం నాటి పునరుజ్జీవం వల్ల ఈ వారంలో నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ రికవరీలో ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయిల్లో పరీక్షకు గురి కావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత సానుకూలత కోసం నిఫ్టీ నిరోధ స్థాయి 22550 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 22700. ఇదే స్వల్పకాలిక నిరోధం కావడం వల్ల ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు : ప్రస్తుత ప్రధాన నిరోధం 22550 వద్ద విఫలమైతే బలహీనపడుతుంది. అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయి 22300.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 440 పాయింట్ల మేరకు నష్టపోయి 48000 వద్ద ముగిసింది. అయితే ఈ స్థాయిలో గత రెండు నెలలుగా పలు బాటమ్‌లు ఏర్పడ్డాయి. రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 48600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 48000 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ మరోసారి 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. 22700 స్థాయిలో కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. సానుకూలత కోసం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	22,490, 22,550
మద్దతు	22,400, 22,340

విల్లాలు.. చకచకా

గత ప్రభుత్వంలో విశాఖ నగర నడిబొడ్డున కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో అంకోశా ఫంక్షన్ హాల్ వెనుక ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన భూమిలో ఉన్న పాడుబడిన డాక్టర్ల క్వార్టర్లను కూల్చేసి విల్లాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.8.7 కోట్లతో ఏడు విల్లాలు... ఒక్కొక్కటి 5 వేల చ.అ. విస్తీర్ణంలో నిర్మించాలని పనులు ప్రారంభించారు. ఏడాది పాటు పనులు చాలా వేగంగా జరిగాయి. ఆ తరువాత నిర్మాణాలకు నిధులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం రూ2.47 కోట్లు మంజూరు చేయడంతో ఆ నిర్మాణాలన్నీ ఓ కొలిక్కి వచ్చాయి. రెండు నెలల్లో మిగిలిన పనులు పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

విశాఖలో అంకోశా వెనుక పూర్తి కావొచ్చిన విల్లాలు





విజయనగరం జిల్లా భోగాపురం వద్ద విమానాశ్రయం పనులు

శరవేగంగా 'భోగాపురం'..

విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు మందకొడిగా జరగగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వేగవంతమయ్యాయి. రూ.4,650 కోట్లతో జీఎమ్మార్ సంస్థ పనులు చేపడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమీక్షలు నిర్వహిస్తున్నారు. 2026 జూన్ నాటికి ఈ విమానాశ్రయాన్ని వినియోగంలోకి తెస్తామని రామ్మోహన్ నాయుడు ప్రకటించారు.



తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం-సామర్లకోట ఏడీబీ రోడ్డు నిర్మాణ పనులు

అద్దంలా రహదారి

2018లో నాటి టీడీపీ ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం నుంచి సామర్లకోట వరకు ఏడీబీ రోడ్డును ప్రపంచ బ్యాంక్ నిధులతో నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండర్ల పేరుతో పనులు ఆగిపోయాయి. ఈ రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో అనేక ప్రమాదాలు జరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక 30 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు పనులు వేగవంతమయ్యాయి.



విశాఖ ఐటీ పార్కులో టీసీఎస్‌కు ఇచ్చిన మిలీనియం టవర్లు

విశాఖ మిలీనియం టవర్‌లో టీసీఎస్

విశాఖలో రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నంబరు 3పై రూ.160 కోట్లతో టవర్-ఎ, టవర్-బీ పేరుతో ఐకానిక్ భవనం నిర్మించారు. 2014-19లో టీడీపీ హయాంలో టవర్-ఎ నిర్మాణం పూర్తి చేశారు. సీఎం చంద్రబాబు అందులో నాలుగు అంతస్థులు కాండ్యుయెంట్ కంపెనీకి ఇచ్చి, ఆ సంస్థను 2019లో ప్రారంభించారు. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ టవర్-బీ పూర్తి చేసి రెండేళ్లు ఖాళీగా ఉంచింది. టవర్-ఏలో మిగిలిన నాలుగు అంతస్థులు ఐదేళ్లు ఎవరికీ ఇవ్వకుండా ఖాళీగా వదిలేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు టవర్-ఎ, టవర్-బీలలో మొత్తం 2.08 లక్షల చదరపు అడుగుల స్థలం కేటాయించింది. టీసీఎస్ మొత్తం పది వేలమందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించింది.

అభివృద్ధికి మళ్లీ మోక్షం!

జగన్ ఏలుబడిలో ఆగిన ఎన్నో పనులు ఇప్పుడు పట్టాలపైకి

నిధుల కొరత ఉన్నా కూటమి ప్రభుత్వం చొరవ.. రోడ్లు, భవనాలు, కాలువలు
వంతెనల పనులు చకచకా.. పలు పెండింగ్ బిల్లులూ చెల్లింపు
ప్రారంభించని పనులూ పూర్తి చేయాలని స్థానికుల ఎదురు చూపులు

పవన్ చొరవతో...

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు తహశీల్దార్ కార్యాలయానికి నూతన భవనాల నిర్మాణానికి 2018లో రూ.60 లక్షలు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం రాగానే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని పెండింగ్ బిల్లులు చెల్లించేలా చేశారు. పనులు పూర్తి చేసేందుకు రూ.28 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

గొల్లప్రోలులో అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి వైసీపీ హయాంలో కేంద్రం నిధులు రూ.75 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని రూ.20.9 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో పనులు పూర్తి చేయడంతో పాటు ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.



కాకినాడ జిల్లా గొల్లప్రోలులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న తహశీల్దారు కార్యాలయ భవనం

రోడ్లకు మహర్దశ

వైసీపీ పాలనలో అనంతపురం జిల్లా యల్లనూరు మండలం గడ్డవారిపల్లి, వెన్నపూసపల్లి, మల్లాగుండ్ల గ్రామాల రహదారులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.5 కోట్లతో చేపట్టి మధ్యలోనే వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. రహదారులపై కంకర తోలి రోలింగ్ పనులు పూర్తి చేశారు. తారు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరో నెల రోజుల్లో రహదారులు అందుబాటులోకి వస్తాయి.



అనంతపురం జిల్లా యల్లనూరు గడ్డంవారిపల్లిలో నిలిచిపోయిన రోడ్డు పనులు తిరిగి కొనసాగుతున్న దృశ్యం

పనుల్లో వేగం




అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువ

వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో రోడ్ల విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. పూర్తి చేయకుండా ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ పనులకు మోక్షం కలిగింది. పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి టీ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు జోరుగా సాగుతున్నాయి. పాత బస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువ పనులకు రూ.2.35 కోట్లు, ఇతర ప్రాంతాల్లో కల్వర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.6.30 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

పడని ముందడుగు

గురుకులానికి తొలగని గ్రహణం

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పెదతురకపాలెంలో ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం చేపట్టిన రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం నిలిచిపోయింది. గత టీడీపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టగా.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిలిపివేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ముస్లిం మైనార్టీ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.




పల్నాడు జిల్లా పెదతురకపాలెంలో నిలిచిపోయిన ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల భవనం



పునాదుల్లోనే శీతల గిడ్డంగి

నరసరావుపేట మార్కెట్ యార్డులో మిరప రైతుల ప్రయోజనాల కోసం గత టీడీపీ ప్రభుత్వం రూ.5 కోట్లతో శీతల గిడ్డంగి నిర్మాణం చేపట్టింది. పునాదుల వరకు పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ పనులను నిలిపివేశారు. ఈ ప్రాంత రైతులు పండించే మిరప పంటను గుంటూరు తరలించి అక్కడి శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. దీంతో రైతులు వ్యయప్రయాసలకు గురౌతున్నారు. కూటమి ప్రభుత్వం శీతల గిడ్డంగి నిర్మాణాన్ని పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

మధ్యలో ఆగిన మార్కెట్ నిర్మాణం



ప్రొద్దుటూరులో మధ్యలోనే ఆగిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రొద్దుటూరు నడిబొడ్డున శివాలయం సర్కిల్లో పాత కూరగాయల మార్కెట్ కూల్చి రూ.50.9 కోట్లతో కొత్తగా నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు రూ.20 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వంలో రూ.5 కోట్లు మాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. మరో రూ.15 కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో నిలిచిపోయాయి. గుడ్‌విల్ పద్ధతుల్లో గానీ రుణం తీసుకుని గానీ మున్సిపాలిటీనే మార్కెట్ నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని కూటమి ప్రభుత్వం నోట్ పంపింది.

ఆగిన వారధి

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలోని ములకల్లంక మధ్య గోదావరి పాయపై 2020లో ఆరంభించిన బ్రిడ్జి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ లంకలో సుమారు 10 గ్రామాల ప్రజలు వ్యవసాయ, పశుపోషణల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ లంకలో సుమారు 70 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గోదావరికి వరద వచ్చిన ప్రతి ఏటా ఈ లంక మునిగిపోతూ ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం రూ.35 కోట్లతో 300 మీటర్ల మేర బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కొన్ని పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యాక బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. సుమారు రూ.15 కోట్ల బిల్లులు బకాయిలు ఉన్నాయి. ఈ వారధి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో నిలిచిపోయిన బొబ్బిల్లంక-ములకల్లంక వారధి

అసంపూర్తిగా గోదాములు

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి రైతుల కోసం 2018-19లో రూ.5 కోట్లతో నాలుగు అంతస్తుల (జీ+3) శీతల గిడ్డంగి నిర్మాణం పనులు చేపట్టారు. పిల్లర్లు, స్లాబుల వరకు దాదాపు రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా గంపెడు సిమెంట్ కూడా వేయలేదు. ఈ నిర్మాణాలు పూర్తి చేయాలంటే రూ.6 కోట్లు అవసరమని మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



కర్నూలు మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఆగిపోయిన ఉల్లి శీతల గిడ్డంగులు

ఉర్దూ వర్సిటీపై మళ్లీ ఆశలు

రాష్ట్ర విభజన తరవాత నాటి సీఎం చంద్రబాబు 2017-18లో కర్నూలు నగరంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రారంభించారు. కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల్లో ఫేజ్-1 కింద రూ.18 కోట్లతో పనులు చేపట్టారు. అకాడమిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ 75 శాతం, ఫస్ట్‌ఫ్లోర్ 25 శాతం, బాలిక హాస్టళ్ల పునాది, పిల్లర్ల వరకు పనులు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు పేరు వస్తుందని పనులు ఆపేసింది. ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ఉర్దూ వర్సిటీ నిర్మాణంపై విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి.





విశాఖ నగర పరిధిలోని చంద్రంపాలెం పాఠశాలలో అసంపూర్తిగా నాడు-నేడు పనులు

ముందుకు కదలని 'నాడు-నేడు'

గత ప్రభుత్వంలో విశాఖ జిల్లాలోని 319 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు-నేడు (ప్రస్తుతం దీనిపేరు మన బడి-మన భవిష్యత్తు) రెండో దశలో చేపట్టిన పనులకు అవసరమైన నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాదిన్నర నుంచి నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పనులపై సమీక్ష జరిగినా పురోగతి లేదు. మరో రూ.27 కోట్లు నిధుల విడుదలతో పాటు కొంత మెటీరియల్ సరఫరా చేస్తే వసతులు అందుబాటులోకి వస్తాయి.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో...

నంద్యాల జిల్లా పంచాయితీరాజ్‌శాఖ పరిధిలో 415 సచివాలయాలకు గాను సుమారు రూ.180 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 361 సచివాలయాల నిర్మాణాలు మాత్రమే చేపట్టి 292 పూర్తిచేశారు. జిల్లాలో 394 రైతుభరోసా కేంద్రాలకు గాను దాదాపు రూ.94 కోట్లు మంజూరు చేశారు. వీటిలో 281 నిర్మాణాలు చేపట్టి 222 ఆర్బీకేలు పూర్తి చేశారు. మరో 59 రైతు భరోసా కేంద్రాలు అసంపూర్తిగా మిగిలాయి. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 59 పనులు చేపట్టారు. వీటిలో 70 శాతం పనులే పూర్తయ్యాయి. కాగా రోడ్లు, భవనాలకు సంబంధించి గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.125.781 కోట్లు బిల్లులు చెల్లించలేదు. అలాగే రూ.5 కోట్లతో ఆళ్లగడ్డ-మాయలూరు మధ్యలో, రూ.2 కోట్లతో బ్రాహ్మణకొట్కూరు-మిడుతూరు మధ్యలో హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభించకపోవడంతో రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులను పూర్తిచేసేందుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో సచివాలయాల నిర్మాణాలను పూర్తి చేయడం కోసం రూ.16.67 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని జక్కసాని కుంట్ల గ్రామంలో అసంపూర్తిగా సచివాలయం


హడ్కో రుణ ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న సీఎం , హడ్కో సీఈవో

అమరావతికి మరో రూ.11వేల కోట్లు!

- రుణం మంజూరుపై సీఆర్డీఏతో హడ్కో ఒప్పందం
- త్వరలో మరో జర్మన్ బ్యాంకు నుంచి 5 వేల కోట్లు
- మొత్తం 16వేల కోట్లతో మలిదశ పనులకు శ్రీకారం

గుంటూరు/అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణం దిశగా మరో ముందడుగు పడింది. అమరావతిలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.11వేల కోట్ల రుణ సహాయం అందించేందుకు జనవరి 22న హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) బోర్డు సమావేశంలో ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో సీఆర్డీఏ అథారిటీతో ఆదివారం ఆ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి నారాయణ, హడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్ఠ, మున్సిపల్ శాఖ అధికారులు ఆదివారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలోనే హడ్కో, సీఆర్డీఏ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. దీంతో అతి త్వరలోనే రాజధానికి రూ.11వేల కోట్ల రుణం అందనుంది. కాగా, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా మరో రూ.5వేల కోట్ల రుణానికి కూడా మార్గం సుగమమైనట్లుగా తెలుస్తోంది. వారం, పది రోజుల్లో ఈ ఒప్పందంపై అంగీకారం వస్తుందని సమాచారం. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టనున్నారు. మలిదశ పనుల్లో రహదారుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టనున్నారు. సీఆర్డీఏ పరిధిలో అంతర్గత రహదారులు అభివృద్ధి చేయడం, సీడ్ యాక్సెస్ రోడ్డు, ఇతర ప్రధాన రహదారులను జాతీయ రహదారితో అనుసంధానం చేయడం వంటి పనులు చేపడతారు.

ఉపాధి సిబ్బందికి బదిలీలు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి సిబ్బంది బదిలీలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉపాధి హామీ పథకం డైరెక్టర్ బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేశారు. జిల్లాల్లో బదిలీలు చేపట్టేందుకు డ్వామా పీడీలకు అనుమతి మంజూరు చేశారు. ఈ నెల 15నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభించి 20లోపు పూర్తిచేసి, కొత్త ప్రదేశాల్లో 22 నాటికి విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఉపాధి హామీ పథకంలోని ఎఫ్‌టీఈ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో పనిచేసే సిబ్బందికి ఆయా జిల్లాల్లో అంతర్గత బదిలీలకు అవకాశం కల్పించారు. డ్వామా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది ఒకే సీటులో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉంటే వారిని వేరే సీట్లకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. సెప్టెంబరు 30 నాటికి రిటైర్ కాబోయే సిబ్బందిని మాత్రం బదిలీల నుంచి మినహాయించారు.

ఉపాధి నిధులతో శ్మశానాలు, కోనేర్ల అభివృద్ధి

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కొత్త రకాల పనులకు శ్రీకారం చుట్టారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో శ్మశానాల అభివృద్ధి పనులు ఎన్‌ఆర్‌ఐల సహకారంతో చేపట్టారు. 70శాతం ఉపాధి మెటీరియల్ నిధులు, 30శాతం ఎన్‌ఆర్‌ఐ విరాళాలను వాటికి వెచ్చించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకాన్ని అటకెక్కించారు. తాజాగా శ్మశానాల అభివృద్ధి కోసం మండల స్థాయిలో సిబ్బంది పనులు చేపట్టేందుకు ఉపాధి హామీ డైరెక్టర్ ఆదేశాలిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానవాటికల్లో స్థలాల లభ్యతను బట్టి, అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు వివిధ రకాల కొలతలతో డిజైన్లు రూపొందించింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల వద్ద సుమారు 750 పురాతన కోనేరుల అభివృద్ధికి గ్రామీణాభివృద్ధిశాఖ యోచిస్తోంది.

మరో రెండ్రోజులు వడగాడ్పులు


- నాతవరంలో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం భానుడు భగ్గుమన్నాడు. వడగాడ్పులు తీవ్రమయ్యాయి. అనకాపల్లి జిల్లా నాతవరంలో 42.1, నంద్యాల జిల్లా రుద్రవరం, విజయనగరం జిల్లా పెదనదిపల్లిలో 41.8, ప్రకాశం జిల్లా గొల్లవిడిపి, కర్నూలు జిల్లా లద్దగిరిలో 41.4, మన్యం జిల్లా పాచిపెంట, అప్పయ్యపేటలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండురోజుల పాటు పలుచోట్ల వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఫ్యాటీ లివర్‌ను తేలిగ్గా తీసుకోవద్దు

- శరీరంలో అన్ని భాగాలపై దాని ప్రభావం
- నిర్లక్ష్యం చేస్తే కాలేయ క్యాన్సర్ ముప్పు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి వెల్లడి

(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)



అందరూ శరీరానికి కేంద్రస్థానం గుండె అని అనుకుంటారు. కానీ.. అది కాలేయం అని.. అంతటి కీలకమైన అవయవానికి ఏదైనా సమస్యలొస్తే మొత్తం శరీరంపైనా ఆ ప్రభావం పడుతుందని.. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మరీ ముఖ్యంగా ఫ్యాటీ లివర్ సమస్య చాలా ప్రమాదకరమని, దాన్ని నిర్లక్ష్యం చేస్తే అది గుండెకు చేటు చేస్తుందని, అధిక రక్తపోటు, మధుమేహం తదితర ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారణమవుతుందని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. ఫ్యాటీ లివర్‌కు చికిత్స తీసుకోకపోతే కాలేయ క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందని.. పెరుగుతున్న ఫ్యాటీ లివర్ కేసుల కారణంగా మనదేశం లివర్ క్యాన్సర్ రాజధానిగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతోపాటు.. జన్యుక్రమం ఆధారంగా చికిత్సలు, అవయవ దానానికి బదులుగా సెల్ డొనేషన్, వైద్య పరిశోధనలు విస్తృతంగా పెరగాల్సిన అవసరం.. తదితర అంశాలపై ఆయన సవివరంగా మాట్లాడారు. అందులో కొన్ని ముఖ్యాంశాలు..

ఫ్యాటీ లివర్ కేసులు ఎలా పెరుగుతున్నాయి?

మనకి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో దేశంలో 10% మందిలో ఈ సమస్య ఉండేది. అదిప్పుడు 40 శాతానికి చేరింది. చివరికి బడికెళ్లే పిల్లల్లో సైతం మేం పరీక్షలు చేయిస్తే.. 40% మందికి ఆ సమస్య ఉన్నట్టు తేలింది. మొదటి రెండు దశల్లో ఉన్నప్పుడు దీన్ని గుర్తిస్తే.. కొన్ని ఔషధాలు, జీవనశైలి మార్పులతో రివర్స్ చేయగలం. మూడో దశలో గుర్తిస్తే.. రివర్స్ చేయలేం. దాని తీవ్రతను మాత్రమే తగ్గించగలం. ఫ్యాటీ లివర్‌ను గుర్తించి సరైన చికిత్స చేయించుకోకపోతే.. దాని ప్రభావం గుండె, మూత్రపిండాలపైన కూడా పడుతుంది. రక్తపోటు పెరుగుతుంది. ఉదాహరణకు.. గుండెపోటుతో వచ్చే చాలామందికి వైద్యపరీక్షల్లో ఫ్యాటీలివర్ కూడా ఉన్నట్టు తేలుతుంది. ఆ విషయం చెప్తే.. 'అవును సార్, పదేళ్ల నుంచి నాకు ఈ సమస్య ఉంది' అని అప్పుడు చెప్తారు. వారు ఆ సమస్యను పట్టించుకోకపోవడం వల్ల దాని ప్రభావం గుండెపై పడిందన్న విషయం వారికి అప్పుడు తెలుస్తుంది. కాబట్టి, ఫ్యాటీ లివర్ అంత ప్రమాదకరం కాదులే అనే దృక్పథాన్ని మార్చుకోవాలి.

కారణం ఏమిటి? ఎలా గుర్తించాలి?

ఇటీవల పెరిగిన జంక్ ఫుడ్ వినియోగం.. దానికి తోడు సరైన వ్యాయామం లేకపోవడం ఫ్యాటీ లివర్ సమస్యను మరింత పెంచుతోంది. దురదృష్టవశాత్తు కొంతమందిలో జన్యుపరంగానూ ఈ సమస్య వచ్చే ప్రమాదం ఉంది. ఫ్యాటీ లివర్ ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడం ఖర్చుతో కూడుకున్న పని. స్కానింగ్‌లు చేయాల్సి వస్తుంది. కానీ మేం కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా.. ఫ్యా టీలివర్ డయాగ్నోసిస్‌ను సులభతరం చేశాం. నాలుగు సాధారణ రక్త పరీక్షలు (సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, ప్లేట్‌లెట్స్) చేసి వాటిలో వచ్చే ఫలితాలను ఏఐ ద్వారా విశ్లేషించి ఫ్యాటీ లివర్ ఉందీ లేనిదీ తెలుసుకునే ప్రక్రియను రూపొందించాం. ఇప్పటికే 10 వేల మందిపై దీన్ని పరీక్షించాం. ఈ పరిశోధన ఫలితాల్ని.. ఏఐ టూల్‌ను త్వరలో అందరికి అందుబాటులోకి తీసుకొస్తాం.

> **ఏడాదికొకసారి ఆరోగ్య పరీక్షలు**
>
> క్యాన్సర్ వచ్చినట్టు తెలిస్తే.. 'అమ్మో' అని చికిత్స తీసుకుంటున్నారు. కానీ.. బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులు నిశ్శబ్దంగా తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇది తెలియక చాలామంది పట్టించుకోవట్లేదు. నా సలహా ఏంటంటే.. ఏడాదికి ఒకసారి సమగ్ర ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడు చాలా సమస్యలను మనం ముందే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడం, మందుల వాడకం ద్వారా వాటిని అదుపులో ఉంచుకోవచ్చు.

ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?

ప్రాసెస్డ్ ఆహారం అస్సలు తీసుకోకూడదు. కూల్ డ్రింక్స్ తాగకూడదు. రోజుకు గంట వ్యాయామం చేయాలి. ప్రజల్లో చాలామందికి ఇవన్నీ తెలుసు. అయినా చేయరు. నా దగ్గరకొచ్చే వారిలో చాలామంది తాము చాలా బిజీ అంటారు. వాళ్లను నేను అడిగేది ఒక్కటే ప్రశ్న.. 'మీరు నా కంటే బిజీనా?' అని. నేను ఉదయం ఆరున్నరకు ఆస్పత్రికి వస్తాను. రాత్రి పదకొండున్నర వరకూ పని చేస్తాను. పదకొండున్నర నుంచి పన్నెండున్నర వరకూ వ్యాయామం చేస్తాను.

జన్యుపరీక్షల ద్వారా ముందే తెలుసుకోవచ్చా?

శరీరంలో జన్యువుల పరిస్థితిని పరీక్షించడానికి.. మా దగ్గర లైఫ్ స్టైల్ క్లినిక్ ప్రారంభించాం. అక్కడ జన్యుపరీక్షలు జరిపి రోగి మొత్తం జన్యుక్రమం పరిస్థితిని అంచనా వేస్తాం. తద్వారా సదరు వ్యక్తికి పదేళ్ల తర్వాత క్యాన్సర్ వస్తుందా? బీపీ, ఫ్యాటీ లివర్ వస్తుందా? చివరకు ఏ వయసులో బట్టతల వస్తుందన్న వివరాలు కూడా చెప్పొచ్చు. ఈ పరీక్షకు రూ.30 వేలు ఖర్చవుతుంది. శరీరంలో జన్యువులు శాశ్వతం కాబట్టి.. ఈ పరీక్షను జీవితంలో ఒక్కసారి చేయించుకుంటే సరిపోతుంది. దీంతోపాటు, ఫార్మకోజీనోమిక్స్ మీదా మేం దృష్టి కేంద్రీకరించాం. రోగుల శరీర తత్వం ఆధారంగా వారికి ఏ మందు బాగా పనిచేస్తుందో తెలుసుకుని ఆ మందులు ఇచ్చే పద్ధతి ఇది. ఉదాహరణకు.. ఒకే రోగానికి వాడే ట్యాబ్లెట్ ఒకరికి రోజుకు ఒకటి వేసుకుంటే సరిపోతుంది. మరికొందరికి రెండు రోజులకు ఒకటి వేసుకోవాల్సి రావచ్చు. ఏ జన్యువు ఏ ఔషధానికి ఎలా స్పందిస్తున్నదన్నది ఫార్మకోజీనోమిక్స్ ద్వారా తెలుస్తుంది. అందుకే నా దగ్గరకు వచ్చే వారికి మందులు రాయబోయే ముందు.. వారిని ఈ పరీక్ష చేయించుకోమని చెబుతాను. దీనికి రూ.5 వేల దాకా అవుతుంది. దీన్ని కూడా జీవితంలో ఒకసారి చేసుకుంటే సరిపోతుంది. మనదేశంలో ఈ పరీక్ష మా దగ్గర మాత్రమే అందుబాటులో ఉంది.

గట్ బ్యాక్టీరియా పాత్ర ఏమిటి?

బ్యాక్టీరియా మన శరీరాన్ని నియంత్రిస్తుంది. అందునా గట్ బ్యాక్టీరియా మన ఆరోగ్యంలో కీలక భూమిక పోషిస్తుంది. అందుకే మా దగ్గర నాలుగేళ్లుగా బ్యాక్టీరియాకు సంబంధించిన జీనోమికల్ అనాలసిస్ చేస్తున్నాం. దీంతో ఒక్కొక్కరి శరీరంలో ఉన్న బ్యాక్టీరియా ఆధారంగా వారు ఏ ఆహారం తినాలి? ఎలాంటి ఆహారం తినకూడదు? అని చెప్పగలం.

ఏఐజీలో చేస్తున్న ఇతర పరిశోధనలేమిటి?

ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత.. బ్యారీ మార్షల్ పేరిట ప్రత్యేకంగా ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. అందులో అనేక పరిశోధనలు చేస్తున్నాం. మరో రెండు నెలల్లో మేం బ్యాక్టీరియా పర్సనలైజడ్ మెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. దీని ద్వారా.. బాధితుల పేగుల్లో ఏ బ్యాక్టీరియా తక్కువ ఉందో గమనించి దానికి తగ్గ క్యాపూల్స్ వేస్తాం. ఈ క్యాప్సూల్స్‌ను 'స్టూల్ (మలం)' నుంచి సేకరించి తయారు చేస్తారు. ఉదాహరణకు కొంతమంది ఎంత తిన్నా సన్నగా ఉంటారు. అలా సన్నగా ఉన్న వ్యక్తికి సంబంధించి స్టూల్‌ను క్యాప్సూల్స్ రూపంలో తీసుకుని లావుగా ఉన్న వారికి ఇస్తే సన్నగా అవుతారు. అమెరికాలో అల్సరేటివ్ కొలైటిస్ సమస్యతో బాధపడుతున్న ఒక మహిళకు.. ఆరోగ్యవంతుడైన దాత నుంచి స్టూల్స్ సేకరించి క్యాప్సూల్ రూపంలో ఇస్తే ఆ సమస్య తగ్గింది. కానీ, సన్నగా ఉండే ఆమె లావుగా అయ్యింది. ఆ ఘటన ఆధారంగా దీనిపై పరిశోధనలు చేస్తున్నారు. అయితే, మలాన్ని క్యాప్సూల్ రూపంలో ఇస్తామంటే ఎవరూ అంగీకరించరు కాబట్టి.. పొడి రూపంలోకి మార్చి ఇస్తున్నాం. వాటిని 'క్రాప్‌స్యూల్స్' అంటారు. ఇప్పుడున్న చాలా మందులకు బదులుగా భవిష్యత్తులో ఇవే వస్తాయి. బీపీకి ఒక క్రాప్‌స్యూల్.. షుగర్‌కి ఒకటి.. ఇలా వస్తాయి. మధుమేహానికి సంబంధించి ఒక బ్యాక్టీరియాను (అకర్‌మెన్సియా మ్యూసినోఫిలా) ఇప్పటికే కనుగొన్నారు. ఆ బ్యాక్టీరియా ఇస్తే.. ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, మధుమేహం వంటివి తగ్గిపోతాయి.

అవయవ దానం నిబంధనల్ని మార్చాలా..?

పదేళ్ల క్రితంతో పోలిస్తే తెలంగాణ, తమిళనాడులో అవయవదానం పెరిగింది. మన రాష్ట్రంలో జీవన్‌దాన్ ద్వారా బాగా చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తక్కువగా ఉంది. ఇందులోని సమస్య ఏంటంటే.. అవయవాలను బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా ఉన్నాయి. కొందరు ఈ నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి వారి విషయంలో జాగ్రత్తలు అవసరం. అలాగే దీనిపై దేశమంతా ఒకే విధానం లేదు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పద్ధతి. మన రాష్ట్రంలో మాత్రం కుటుంబ సభ్యుల (భార్య, భర్త, కూతురు, కొడుకు) నుంచి మాత్రమే తీసుకోవాలి.

అవయవదానం భవిష్యత్‌లో ఎలా ఉండనుంది?

రానున్న రోజుల్లో అవయవదానం కంటే సెల్ డొనేషన్ ఎక్కువ కానుంది. మన శరీరంలో బోన్ మ్యారో నుంచే అన్ని కణాలూ వస్తాయి. కాలేయంగానీ, గుండెగానీ.. అన్నీ దాన్నుంచే వస్తాయి. బోన్ మ్యారో నుంచి ప్రైమరీ సెల్స్‌ను తీసుకొని వాటిని ల్యాబ్‌లో కాలేయంగా, మూత్రపిండంగా మార్చవచ్చు. అందుకే మేం దీనికి సంబంధించి ఒక స్టెమ్‌సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. అక్కడ మేం ఇప్పటికే బోన్‌మ్యారో కణాలను కాలేయకణాలుగా మార్చి 50 మంది పేషెంట్లకు కాలేయ మార్పిడి అవసరం లేకుండా చికిత్స చేశాం. భవిష్యత్తులో ఈ విధానం గొప్పగా అభివృద్ధి చెందనుంది. లివర్ సిర్రోసిస్, హృద్రోగాలు, మధుమేహం.. అన్నింటికీ ఈ విధానంలో చికిత్స చేయొచ్చు.

> **మంచి అలవాట్లు**
>
> ఆరోగ్య కరమైన ఆహారం తినడం, రోజూ వ్యాయామం చేయడం, ప్రాసెస్డ్ ఆహారానికి, ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండడం, ఆరోగ్యానికి మేలు చేసే అలవాట్లు. పండ్ల రసాలు తాగడం కన్నా.. పండ్లు తినడం మంచిది. అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్‌ను నిరుత్సాహపరిచే విషయంలో ప్రభుత్వాలు సెలబ్రిటీల సహాయం కూడా తీసుకోవాలి. సినీనటులు చెప్తే ప్రజలు విని పాటించే ప్రయత్నం చేస్తారు.
>
> **రైస్‌బ్రాన్ ఆయిల్.. ఆలివ్ నూనెతో సమానం**
>
> అసలు మన ఆహారంలో నూనెల వినియోగం తగ్గించాలి. అన్ని నూనెల్లోకీ రైస్‌బ్రాన్ ఆయిల్ ఉత్తమం. దాన్ని తయారుచేసింది మన హైదరాబాద్ ఐఐసీటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)నే అనే విషయం చాలా మందికి తెలియదు. శాచురేటెడ్ ఆయిల్స్ (సంతృప్త నూనెలు-కొబ్బరి నూనె, పామాయిల్ వంటివి) మంచివి కా వు. రైస్‌బ్రాన్ ఆయిల్ ఆలివ్ ఆయిల్‌తో సమానం.

బీమా ప్రీమియం భారంగా మారడంపై..

ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. ఈ సందర్భంగా అమెరికాలో తీసుకొచ్చిన ఒబామా కేర్ గురించి చెప్పాలి. బీమా సంస్థలతో ఒబామా ఎంతో పోరాటం చేశారు. ప్రీమియంలకు పరిమితులు పెట్టారు. ట్రంప్ వచ్చిన తర్వాత కూడా దాన్ని మార్చలేదు. అలాంటి విధానం మన దేశంలోనూ తీసుకురావాల్సి ఉంది. ప్రివెంటివ్ కేర్‌ను కూడా బీమా పరిధిలోకి తీసుకురావాలి. వైద్యపరీక్షలకు అయ్యే మొత్తాన్ని బీమా సంస్థలు భరించేలా చర్యలు తీసుకోవాలి.

మనం ఫోకస్ చేయాల్సిన అంశాలేంటి?

ఇంజనీర్లు.. వైద్యులు కలిసి పని చేస్తే వైద్యరంగంలో అద్భుతాలు సాధించొచ్చు. మనం పెద్దగా పట్టించుకోని ఈ అంశానికి చైనా, అమెరికా బాగా ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ క్రమంలోనే మేం ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి ఆరు ప్రాజెక్టులపై పనిచేస్తున్నాం. మేం అభివృద్ధి చేసిన ఒక హై ఫ్రీక్వెన్సీ అల్ట్రాసౌండ్ పరికరంతో.. సర్జరీ అవసరం లేకుండానే లివర్ క్యాన్సర్ కణాలను నాశనం చేయవచ్చు.

బిజీగా ఉంటూ పరిశోధనలెలా చేస్తున్నారు?

మా నాన్నగారు పాథాలజిస్టు. ఆయన పరిశోధనలకు చాలా ప్రాధాన్యమిచ్చేవారు. నేను బాగా ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఒక రోజు పిలిచి.. "నువ్వో పెద్ద ఫెయిల్యూర్" అన్నారు. దేశంలో పేరున్న గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుల్లో ఒకడినైన నన్ను అలా ఎలా అంటారని అడిగితే.. "నువ్వు పరిశోధనలు చేస్తున్నావా? నీవి ఎన్ని రిసెర్చ్ పేపర్లు పబ్లిష్ అయ్యాయి?" అని అడిగారు. 35 ఏళ్ల క్రితం జరిగింది. అప్పటికే మా నాన్నగారి పరిశోధనలకు సంబంధించి 400 రిసెర్చ్ పేపర్లు పబ్లిష్ అయ్యాయి. ఆయన అడిగాక నాలో ఆలోచన మొదలై పరిశోధనల మీద ఎక్కువ దృష్టి పెట్టాను. నావి ఇప్పటికి 1100 పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పబ్లిక్ పరీక్షల ఒత్తిడిని అధిగమించేలా గత వంద రోజుల నుంచి పాఠశాల విద్యాశాఖ విద్యార్థులను సన్నద్ధం చేసింది. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేసింది. మెరుగ్గా ఉన్న విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించేలా, అంతంతమాత్రంగా ఉన్నవారు సులభంగా ఉత్తీర్ణులయ్యేలా సమాయత్తం చేసింది. నేటి నుంచి ఈనెలాఖరు వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8.45 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అని పరీక్షా కేంద్రాలను మొబైల్ రహితంగా ప్రకటించారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి మొబైల్ తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలైన ల్యాప్‌ట్యాప్‌లు, కెమేరాలు, ట్యాబ్‌లు, ఇయర్‌ఫోన్లు, స్పీకర్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ వంటివాటిని పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీటి సౌకర్యం, ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉంచారు. ఈ ఏడాది టెన్త్ విద్యార్థులకు ఎస్సీఈఆర్‌టీ సిలబస్ అమలు చేశారు. మొత్తం విద్యార్థుల్లో 51,069 మంది తెలుగు మీడియంలో పరీక్షలు రాయనున్నారు. ఒడియాలో 838 మంది, తమిళంలో 194 మంది, కన్నడలో 623 మంది, హిందీలో 16 మంది, ఉర్దూలో 2,471 మంది పరీక్షలు రాయనున్నారు. వీరితో పాటు ఓపెన్ స్కూల్ సొసైటీ విద్యార్థులకూ సోమవారం నుంచే పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. అకడమిక్ ప్రయాణంలో టెన్త్ పరీక్షలు కీలక మైలురాలు లాంటివని, ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

మొత్తం విద్యార్థులు	6,49,884
బాలురు	3,36,225
బాలికలు	3,13,659
పరీక్షా కేంద్రాలు	3,450
ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు	156
సమస్యాత్మక కేంద్రాలు	163

ప్రయాణం ఫ్రీ!: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా చేరుకోవచ్చునని ప్రకటించింది.

మేం పనికిరామా?

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేయాలని భావిస్తున్నారు. ముందుగా ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఒకరిద్దరు అధికారులను కలసి తమ గోడు చెప్పుకొందామని ప్రయత్నించినా వారి దర్శనం లభించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రమోటీ కేడర్ అధికారుల్లో నెలకొన్న ఆందోళన, సమావేశం గురించి నిఘా విభాగం సీఎంకు నివేదించినట్లు తెలిసింది.

గతానికి భిన్నంగా...

ప్రభుత్వంలో మొత్తం 400 మందికి పైగా అఖిల భారత సర్వీసు అధికారులు పనిచేస్తున్నారు. వీరిలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్, ఇతర విభాగాల అధికారులున్నారు. ఐఏఎస్‌లలో నేరుగా యూపీఎస్సీ ద్వారా రిక్రూట్ అయిన ఆర్ఆర్‌బ్యాచ్ వారు, రాష్ట్ర సర్వీసుల నుంచి ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన అధికారులు ఉన్నారు. మొన్నటిదాకా ఈ రెండు కేటగిరీల అధికారులకూ సమబాధ్యతలు, పోస్టింగ్‌లు ఇచ్చేవారు. రాజశేఖరరెడ్డి, చంద్రబాబు హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో ఈ రెండు కేటగిరీల అధికారులకూ పోస్టింగ్‌లు ఉండేవి. జగన్ ప్రభుత్వంలోనూ ఇదే విధానం కొనసాగింది. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రమోటీ ఐఏఎస్‌లకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ముఖ్యమంత్రి కార్యాలయంలోని కార్యదర్శులు అందరూ ఆర్ఆర్ కోటా అధికారులే. అందులో ఒకరు ఐఏఎస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కూడా. తమ కేడర్ వారు ఎవరూ సీఎంఓలో కార్యదర్శిగా లేరన్న ఆందోళన ప్రమోటీ అధికారుల్లో నెలకొంది. సాధారణంగా ప్రమోటీ ఐఏఎస్‌లకు క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం చాలా ఎక్కువ. రాష్ట్ర సర్వీస్ కింద గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన వీరు రెవెన్యూ డివిజన్లలో ఆర్డీఓలుగా, జిల్లా కేంద్రాల్లో డీఆర్ఓ, పీడీ డ్వామా, పీడీ డీఆర్‌డీఏ, ఇతర క్షేత్రస్థాయి ప్రభుత్వ వ్యవస్థల్లో సేవలందించి ఉంటారు. రాష్ట్ర, జిల్లా, మండల పరిస్థితులపై వారికి పూర్తి అవగాహన ఉంటుంది. దీంతో ప్రతిభ ఆధారంగా ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పించాక సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ పోస్టులలో నియమిస్తారు. ఆ తర్వాత శాఖల విభాగాధిపతులు, కార్యదర్శులుగా కీలక బాధ్యతలు అప్పగిస్తారు.

నేరుగా కీలక పోస్టింగ్‌లు...

యూపీఎస్సీ ద్వారా నేరుగా నియమితులయ్యే ఆర్ఆర్ అధికారులు మొదట సబ్‌కలెక్టర్‌గా పోస్టులు పొందుతారు. ఐఏఎస్‌కు ఎంపికయ్యాక డీఓపీటీలో శిక్షణ పొంది నేరుగా రాష్ట్రాలకు వస్తారు. అప్పటి వరకు వారికి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల గురించి పెద్దగా తెలియదు. గ్రామీణ అసమానతలపైనా సరైన అవగాహన ఉండదు. ఎవరితో ఎలా వ్యవహరించాలి? కీలకమైన అంశాల్లో సంయమనంగా ఎలా ఉండాల్నో కొందరికి ఇప్పటికీ తెలియదు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.. ఫైబర్‌నెట్‌లో జరిగిన గొడవలే. ప్రభుత్వమే అధికారులకు రాష్ట్ర పరిస్థితులపై అవగాహన కల్పించాలి. అప్పటి వరకు వారికి క్షేత్రస్థాయి బాధ్యతలు అప్పగించాలి. ఆ తర్వాతే వారికి కీలక బాధ్యతలు అప్పగించాలి. అలా కాకుండా నేరుగా కీలక పోస్టుల్లో కూర్చోబెడితే పాలనా అనుభవం కన్నా సమస్యలే వస్తాయని అనేక అనుభవాలు చెబుతున్నాయి.

పోస్టింగ్‌ల్లో అసమానతలు

కొంతకాలంగా పోస్టింగ్‌ల విధానంలో తీవ్ర అసమానతలు, వ్యత్యాసాలు ఉంటున్నాయని ప్రమోటీ అధికారులు చెబుతున్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్(జేసీ) పోస్టులనే ఉదాహరణగా చూపిస్తున్నారు. రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా, కలెక్టర్లుగా 17 మంది ఆర్ఆర్ అధికారులను నియమిస్తే, ప్రమోటీ అధికారులకు కేవలం 9 మందికే అవకాశం కల్పించారు. జేసీ పోస్టుల్లో 21 ఆర్ఆర్ కేడర్‌కు ఇస్తే, 5 మాత్రమే ప్రమోటీ అధికారులకు ఇచ్చారు. ప్రభుత్వంలో విభాగాధిపతులుగా అంటే ఆయా శాఖల డైరెక్టర్ లేదా కమిషనర్ పోస్టుల్లో 90 శాతం ఆర్ఆర్‌కే ఇచ్చారని ప్రమోటీ అధికారులు చెబుతున్నారు. పురపాలక శాఖలోని రెండు పోస్టులే తమ కేడర్ వారికి ఇచ్చారని, మిగిలిన కీలకమైన పోస్టులన్నీ వారికే అప్పగించారని, తమకు ఏమాత్రం ప్రాధాన్యం లేని పోస్టుల్లో పడేశారన్న ఆందోళన వారిలో నెలకొంది. ఆయా శాఖల్లోని కార్పొరేషన్‌లు, ఏమాత్రం పనిలేని విభాగాల డైరెక్టర్‌లుగా నియమించారని ఓ సీనియర్ ప్రమోటీ అధికారి వాపోయారు. ప్రభుత్వంలో ఇప్పటికీ అనేక కీలకమైన పోస్టులకు రెగ్యులర్ అధికారులు లేరు. ఆ పోస్టులకు ఆర్ఆర్ కేడర్ అధికారులనే ఎఫ్ఏసీ కింద ఇన్‌చార్జీలుగా నియమించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఓ సీనియర్ ప్రమోటీ అధికారిని కీలక శాఖ కమిషనర్ పోస్టు నుంచి బదిలీ చేసి ప్రాధాన్యం లేని మరో శాఖకు మార్చారు. దీంతో ఆయన తీవ్ర ఆవేదన చెంది నేరుగా సీఎంఓ అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న తనను ఎలా మారుస్తారని, ఇది అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. తెగువ ఉన్నవారు తమ అన్యాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. అత్యధికులు మౌనంగా ఉంటున్నారని ఆ కేడర్ అధికారులు చెబుతున్నారు.

ముఖ్యమంత్రితో భేటీకి యత్నం

పోస్టింగ్‌లలో ఎదుర్కొంటున్న వివక్షపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ అంతరంగాన్ని తెలియజేయాలని ప్రమోటీ అధికారులు భావిస్తున్నారు. మొదట సీఎంకు లేఖ రాయాలని యోచిస్తున్నారు. ము ఖ్యమంత్రే పిలిచి మాట్లాడితే తామెదుర్కొంటున్న సమస్యలను ఆయన ముందు ఉంచాలని అధికారులు ఓ వినతిపత్రాన్ని సిద్ధం చేసినట్లు తెలిసింది. 'మేం ఎవ్వరికీ వ్యతిరేకం కాదు. మాకు జరుగుతున్న అన్యాయా న్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అందరినీ సమానంగా చూసే బాధ్యత సర్కారుదే. కాబట్టి, మా ఆవేదనను సీఎం దృష్టికి తీసుకెళ్లాలనుకుంటున్నాం' అని ఓ సీనియర్ ప్రమోటీ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

రష్యన్ పేరు పెట్టుకొని తమిళ రాజకీయాలు!

- స్టాలిన్ ముందు తన పేరు మార్చుకోవాలి: బీజేపీ నేత షెహజాద్

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రష్యన్ పేరు పెట్టుకుని తమిళనాట రాజకీయాలు చేస్తున్న డీఎంకే అధినేత స్టాలిన్ ముందు తన పేరు మార్చుకోవాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా హితవు పలికారు. ఏపీ బీజేపీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్..' సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశాభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒక తాటిపైకి రావాల్సిన తరుణంలో తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రమాదకర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హిందీపై రాద్ధాంతం చేస్తున్న స్టాలిన్‌కు 2011లో హిందీ భాషపై వేసిన కమిటీని కరుణానిధి సమర్థించిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. అప్పట్లో రూపీ సింబల్‌కు మద్దతిచ్చిన స్టాలిన్ ఇప్పుడెందుకు తిరస్కరించారో చెప్పాలన్నారు. సమావేశంలో రాష్ట్రబీజేపీ నాయకులు పాతూరి నాగభూషణం, కేశవ్‌కాంత్, నాగోతు రమేశ్ నాయుడు, సాధినేని యామినీశర్మ తదితరులు మాట్లాడారు.

మాతృభాషే మన చిరునామా

- తెలుగువారు తెలుగులోనే మాట్లాడుకోవాలి: ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

విజయవాడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మాతృభాష తెలుగువారి చిరునామా అని, మాతృభాషను ప్రేమించనివాడు తల్లిని ప్రేమించని వాడితో సమానమని శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో 'వారధి' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి రఘురామ మాట్లాడుతూ తెలుగువారికి మాతృభాషలో చదువుకునేలా ప్రభుత్వాలు అవకాశం ఇవ్వాలన్నారు. తెలుగువారు తెలుగులోనే మాట్లాడుకోవాలని పిలుపునిచ్చారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ తెలుగు సినిమాల్లో నటించడం వల్ల భాషపై మమకారం పెరిగిందని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.